సాహిత్య

# ప్రస్థానం

ఆగస్టు 2014

వెల రూ. 10



చేకూరి రామారావు
1934-2014

సాహితీ స్రవంతి




సాహితీస్రవంతి ఆధ్వర్యంలో 2005 జూన్‌లో విజయవాడలో జరిగిన తొలి సాహిత్యశాలలో ప్రారంభోపన్యాసం చేస్తున్న చేకూరి రామారావు. చిత్రంలో ఎడమనుండి కళ్యాణరావు, అద్దేపల్లి రామమోహనరావు, కేతు విశ్వనాథ రెడ్డి, తెలకపల్లి రవి, జ్వాలాముఖి, అంపశయ్య నవీన్. (వెనుక) శివారెడ్డి, కాలువ మల్లయ్య, గూడూరి సీతారాం, దేవేంద్ర, కె. ఆనందాచారి, జిలుకర శ్రీనివాస్, కంభాలపల్లి కృష్ణ











కవి, విమర్శకుడు
కొండ్రెడ్డి వెంకటేశ్వర రెడ్డి
చిత్రకళా కౌశలం

సాహిత్య ప్రస్థానం
ఆగస్టు 2014
సంపుటి : 13 సంచిక : 8

# నూతన ప్రోత్సాహం

తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్‌లలో నూతన రాష్ట్రాలు రెండు మాసాలు పూర్తి చేసుకుంటున్నాయి. కె. చంద్రశేఖరరావు, చంద్రబాబు నాయుడు ప్రభుత్వాలు తమవైన విధానాలను రూపొందించుకోవడంలో తలమునకలవుతున్నాయి. సహజంగానే ఈ క్రమంలో అనేక వివాదాలు విభేదాలు కూడా ఉత్పన్నమవుతున్నాయి. ఇవి సుహృద్భావ పూర్వకంగా పరిష్కారం కావాలని రెండు రాష్ట్రాలకూ మేలు జరగాలని ప్రజాస్వామ్య ప్రియులందరూ కోరుకుంటారు. అయితే ఎలాటి వివాదానికి అవకాశం లేని అంశం తెలుగుభాషను ప్రోత్సహించడం. ఎందుకంటే రెండూ తెలుగు రాష్ట్రాలే గనుక అక్కడా ఇక్కడా అదే భాష మాట్లాడతారు గనక రెండు చోట్ల కవులు రచయితలూ కళాకారులకు కొదవ లేదు గనక నూతన ప్రభుత్వాలు సరికొత్త సాంస్కృతిక విధానాన్ని త్వరితంగా రూపొందించి అమలు చేయడం ప్రారంభిస్తే చాలా మంచిది. తెలుగులో ప్రాంతీయ వ్యత్యాసాలు మాండలికమైనవా మౌలికమైనవా అనే మీమాంసలు కూడా వున్నా అవి ఆచరణకు ఆటంకం కానవసరం లేదు. ఇక ఈ విధంగా వైవిధ్యం పెరగడానికి ఇది అనుకూలాంశంగానే ఉపయోగించుకోవచ్చు. విస్తారంగా అవకాశాలు పెరిగిన ఆధునిక కాలంలో విద్యాధికుల శాతం సాహిత్య సృజన కూడా పెరిగాయి. రెండు రాష్ట్రాలు ఇందుకు రెండు సాహిత్య కేంద్రాలుగా పరిఢవిల్లే వీలుంది. కాకపోతే అందుకు క్రమబద్ధమైన ప్రణాళిక కేటాయింపులు అవసరం. గతంలో అనేక సందర్భాల్లో కోట్లు గల్లంతైనప్పటికీ నిజమైన సాహిత్య కృషి జరిగింది స్వల్పమే. రచనలు రచయితలకు ప్రభుత్వాల నుంచి అందిన అండదండలూ నామమాత్రమే. అసలు తెలుగు భాషే దాడికి గురవుతున్నా పరిరక్షించుకుని పరివ్యాప్తికి దోహదపడిందీ పరిమితమే. ఇప్పుడు ప్రభుత్వాలు ఆంగ్ల మాధ్యమంపై అధిక తర శ్రద్ధ చూపిస్తున్నాయి. ప్రాథమిక విద్యలోనైనా తెలుగు చదవకుండా నెట్టుకురాగలిగే అవకాశం ఎట్టి పరిస్థితుల్లో వుండకూడదనే మాట శిరోధార్యం. ఇక సాహిత్య సాంస్కృతిక రంగాల్లో కొత్త గొంతులను ప్రోత్సహించడానికి నూతన శక్తులను ఆవిష్కరించడానికి కూడా ఇది సందర్భమైతే మంచిది. లేకపోతే రచయితలు, సాహిత్యాభిమానులు తాము చేసేది ఎలాగూ చేస్తూనే వుంటారు. కాని చాలా పథకాలకు నిధులు కేటాయిస్తామంటున్న ప్రభుత్వాలు ఈ రంగం ప్రాధాన్యతను కూడా గమనిస్తే పరిస్థితిలో మార్పు మరింత ప్రభావశీలంగా వుంటుంది.

బొమ్మలు : టి. శివాజి, జె. వెంకటేష్, భాస్కర్

## ఈ సంచికలో...

కవిత... 4
పసి మొగ్గలు (కథ) 5
కవిత 8
ఎదుగుతున్న కథకుడు వేంపల్లి షరీఫ్ 9
కవిత 13
తేనెటీగలు (కథ) 14
కవిత 19
తెలుగు మాండలిక పదసేకరణ–అనుభవాలు 20
శాంతి నారాయణ కథల్లో వస్తువైవిధ్యం 26
దిబ్బయజమాని (కథ) 31
కవిత 36
అక్షర శ్రామికుడు – భాషా శాస్త్రజ్ఞుడు 37
కవిత 40
స్వీకారం 42
కవిత 45
శివ మెత్తిన కవితా యోధుడికి 'మువ్వా' పురస్కారం 46
డైరీ 47

సంపాదకవర్గం
తెలకపల్లి రవి (సంపాదకుడు)
కె.ఆనందాచారి
వొరప్రసాద్
వల్లభాపురం జనార్దన
కె. లక్ష్మయ్య, మేనేజర్

చిరునామా
సాహిత్య ప్రస్థానం
ఎం.హెచ్.భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్,
ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర,
హైదరాబాద్-500 020,
ఫోన్ : 27660013, 9490099059
ఫ్యాక్స్, 040-27635136,
ఇ.మెయిల్ : ssprasthanam@gmail.com
www.prasthanam.com

## కవిత

# నా సెల్లు నా ఇష్టం



**జంధ్యాల రఘుబాబు**
**9849753298**

నన్ను ఊరికి దూరం చేసిందని
వాపోయింది పిచ్చుక

అందులోనే మౌఖిక పరీక్ష
నాకు ఉద్యోగం ఇప్పించిందని
ఓ యువ హృదయం పొంగి పోయింది

ఎక్కువగా మాట్లాడి
చెవిపోటుతో వైద్యుడి దగ్గర క్యూలో
కూచున్నాడో మొబైల్ పిపాసి

రేపటినుండి పనికి రానక్కరలేదని
ఓ చిరుద్యోగికి "పింకు" లెటర్ బదులు
అదే రంగు ఎస్సెమ్మెస్ ఇచ్చాడు బాసు

కళాశాల ఆవరణలోనే
నీలి చిత్రం చూస్తూ
ఓ కుర్రాడు సమాజానికి దూరమౌతున్నాడు

మాట్లాడే 'ఉచిత' సమయం లో
మునిగిన మరో 'ఇద్దరు'
గంటదాటిన విషయమే మరిచారు

అదే సెల్లుతో విస్ఫోటనం సృష్టించి
ఎందరినో పైలోకాలకి పంపి
ముచ్చట పడ్డాడో ముష్కరుడు

అదే నా ప్రాణాన్ని కాపాడిందని
నావాళ్ళని మళ్ళీ చూస్తున్నానని
గాయపడ్డ ప్రయాణికుడి ఆనందం

దానినుండే నాకు
కుర్చీ యోగం కలిగిందని
సంబరపడ్డాడో రాచక్రీడాకారుడు

నిప్పుతో చెలగాటం
చరవాణితో 'సెల' గాటం
తప్పని యాంత్రిక జీవనం

దుర్వినియోగం చేస్తున్నావని
పిల్లలకు శ్రీరంగ నీతులు
పెద్దలకు మాత్రమేనా 'గాలి' మాటలు

గురివింద ఈర్ష్యపడింది సెల్లుపై
ఎరుపూ నలుపులే కాక
అన్ని రంగులతో అది వెలిగిపోతోందని

ఉండండుండండి అక్కడ గూట్లో
నా "చరమూ" మోగుతోంది
ఎవరు చేశారో ఏమో!!

---

## జూలై నెల పురస్కారాలు





**అమ్మచీర**
**కథకు : రూ.700/-**
రచయిత : **వేంపల్లి సికిందర్**

**కొత్తపొద్దు**
**కవితకు : రూ.500/-**
రచయిత : **కె. విల్సన్‌రావు**

***సినీ రచయిత జనార్దన మహర్షి అందిస్తున్న పురస్కార చెక్కులు ఈ రచయితలకు అందుతాయి***



**వ్యాసం:**
**తెలుగు భాషకు వావిళ్ళవారు చేసిన సేవ**
రచయిత : **డా॥ జి.శైలమ్మ**

***ఈ రచయితకు 'కర్లపాలెం రుక్మిణమ్మ స్మారక పురస్కారం' రూ. 500/- అందజేయబడుతుంది.***

పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాలలో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు. సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ఉద్దేశ్యంగా గ్రహించగలరు.

**- ఎడిటర్**

**కథ**

# పసి మొగ్గలు

**భవానీ ఫణి**
**9441555402**



***విరిసీ విరియని మందార మొగ్గలా ఉంది ఆ అమ్మాయి. పసితనం, పెంకితనం కలగలిపి ఒక విధమైన వింత అందాన్ని ఆ పిల్లలో నింపినట్టున్నాయి అనుకుంటూ సాత్విక వైపు సాలోచనగా చూసింది అంజలి.***

“సరే, నువ్వేమీ చెప్పొద్దు నేనే నీకు ఒక సీక్రెట్ చెబుదాం అనుకుంటున్నాను. నువ్వు ఎవరితోనూ చెప్పవు కదూ” సాత్విక ఏమీ మాట్లాడలేదు. తన మాటలకి ప్రతిస్పందన గా ఆ పాప శరీరం కొద్దిగా బిగుసుకోవడం గమనించింది అంజలి.

“నాకు చిన్నప్పుడు ఒక పిచ్చి కోరిక ఉండేది. విన్నాక నువ్వు నవ్వకూడదు మరి” మారాం చేస్తున్నట్టు అంది అంజలి

ఈ సారి సాత్విక కొంచెం ఆసక్తిగా తలెత్తి అంజలిని చూసింది. నవ్వను అన్నట్టు గా చిన్నగా తలపంకించింది. ఆ ప్రతిస్పందన అంజలి కి సంతృప్తి కలిగించింది.

“అప్పటికి నాకు నీ వయసే ఉంటుంది. ఆ రోజుల్లో నాకు తలారా స్నానం చేసి జుట్టు విరబోసుకుని స్కూల్ కి వెళ్ళాలని విపరీతమైన ఆశగా ఉండేది.”

అందులో ఏముంది అన్నట్టు కనుబొమ్మలు చిట్లించింది సాత్విక.

“నీకు అలానే అనిపిస్తుంది. కానీ మా అమ్మ అస్సలు అలాంటి వాటికి ఒప్పుకునేది కాదు. స్కూలు కెళ్ళే పిల్లలు బాగా నూనె రాసుకుని బిగువుగా జడ అల్లుకుని వెళ్ళాలనేది”

సాత్విక సానుభూతిగా ఆమె వైపు చూసింది. “మీ మమ్మీ ని రిక్వెస్ట్ చేస్తే సరిపోయేది గా ”

“నాకు మా మమ్మీని ఇటువంటి విషయాలు అడిగే ధైర్యం ఉండేది కాదు. అడగాలంటే భయం. అడిగినా ఒప్పుకోదు అని నమ్మకం కూడా. అందుకే ఒక ప్లాన్ వేసాను.”

సాత్విక ఈసారి ఉత్సాహం గా ముందుకు జరిగింది చెప్పమన్నట్టు గా.

ఏదో రహస్యం చెబుతున్నట్టు గొంతు తగ్గించి చెప్పసాగింది అంజలి.

“మా ఇంట్లో బట్టలు కుట్టుకునే మిషన్ ఉండేది. మా అమ్మ దాని మీదే మేం వేసుకునే బట్టలు కుడుతూ ఉండేది. ఓ రోజు ఏం చేసానంటే నా చిరిగిన యూనీఫాం కుట్టుకుంటున్నట్టు యాక్ట్ చేస్తూ నా జుట్టు మిషన్ లో చిక్కు పడిపోయేలా చేసుకున్నాను.”

"అయ్యో, అప్పుడేమైంది, ఎందుకలా ?" అయోమయం గా అడిగింది సాత్విక.

"ఏమవుతుంది, మా అమ్మ ఎంత ట్రై చేసినా ఆ జుట్టు మిషన్ లోంచి తియ్యలేకపోయింది. గత్యంతరం లేక కొంత మేర కట్ చేసేసింది"

"దాని వల్ల మీకు యూజ్ ఏంటి " సాత్విక అర్థం కానట్టుగా ముఖం పెట్టింది.

"అమ్మ జుట్టు కట్ చేస్తే స్నానం చేయిస్తుంది. కావాలనే స్కూల్ టైం కి అరగంట ముందు నేనిలాచేసాను. పైగా ఆ రోజు ఎగ్జామ్ కూడా. అమ్మ తప్పని సరై తల స్నానం చేయించి, జుట్టు ఆరే టైం లేక అలా వదిలేసి స్కూల్ కి పంపుతుందని నా ప్లాన్. అలాగే జరిగింది" అంది అంజలి.

"అవునా, బాగా చేసారు. మా మమ్మీ కూడా అంతే. నా కిష్టమైన పనులేవీ చెయ్యనివ్వదు" అంది సాత్విక



ఆ అమ్మాయి తన దారి లోకి వస్తోందని అర్థమయింది అంజలి కి. అంజలి ఒక సైకాలజిస్ట్. పిల్లలలో ఉండే బిహేవియరల్ ప్రాబ్లెమ్స్ బాగా సాల్వ్ చేస్తుందని ఆమెకి మంచి పేరుంది. సరిగ్గా వారం రోజుల క్రితం సాత్విక ని వాళ్ళ అమ్మ తీసుకుని వచ్చింది అంజలి క్లినిక్ కి.

ఆ పిల్ల సమస్య ఏంటంటే ఎంతో బాగా చదివే అమ్మాయి సడన్ గా చదవడం మానేసిందట

" చాలా బాగా చదివేది డాక్టర్, ఎప్పుడూ క్లాస్ ఫస్ట్ వచ్చేది. అదేంటో ఈ మధ్య ఏ ఎగ్జామ్ లోనూ పది మార్కులు దాటి రావడం లేదు. అలా అని ఇంట్లో అన్నీ బానే చదువుతోంది. చెప్తోంది. ఎగ్జామ్ లో మాత్రం ఏమీ రాయడం లేదు. అడిగితే అప్పుడు గుర్తు రావడం లేదు అంటోంది" అని చెప్పి వాళ్ళమ్మ కళ్ళ నీళ్ళు పెట్టుకున్నంత పని చేసింది.

లాస్ట్ వీక్ రెండు సిట్టింగ్స్ లోనూ సాత్వికతో మాట్లాడించే ప్రయత్నం చేసి విఫలమైంది అంజలి. ఇప్పటికి ఆ అమ్మాయి నోరు విప్పింది. జాగ్రత్త గా అసలు విషయం తెలుసుకోవాలి.

"నీకు ఏమేమిష్టం " ముఖం లో ఉత్సాహం కనబరుస్తూ అడిగింది అంజలి.

సాత్విక ముందేం చెప్పాలా అని ఆలోచించి ఆఖరికి అంది "ఆ ... నాకు వర్షం లో తడవడం చాలా ఇష్టం"

"అవునా, వర్షం భలే బాగుంటుంది. వర్షం పడినప్పుడు వచ్చే మట్టి వాసన నాకు చాలా ఇష్టం. మంచి టేస్ట్" అభినందిస్తున్నట్టుగా చూసింది అంజలి

" కానీ మా మమ్మీ అస్సలు తడవనివ్వదు. తడిస్తే జలుబు చేస్తుందనీ , స్కూల్ మిస్సవుతాననీ తనకి భయం " అంది నిరాశ గా.

ఆ కామెంట్ కి సమాధానం ఇవ్వకుండా మాట మార్చింది అంజలి "నీకు పింక్ రోజ్ అంటే ఇష్టమా?నీ తల్లో గులాబీ పువ్వు చాలా బాగుంది "

"అవును. చాలా చాలా ఇష్టం" కొంచెం గర్వంగా జడ లో గుచ్చుకున్న గులాబీ ని తడుముకుంటూ చెప్పింది సాత్విక.

"అమ్మమ్మ వాళ్ళ పెరట్లో ఎన్ని రకాల గులాబీ లుంటాయో !కనకాంబరాలు కూడా. అమ్మమ్మ చక్కగా మాల కట్టి నాజడలో పెడుతుంది ... కానీ అమ్మ సెలవుల్లో కూడా అమ్మమ్మ ఊరు తీసుకెళ్లడం లేదు ఈ మధ్య. అయిపోయిన సిలబస్ హాలిడేస్‌లో రివైజ్ చేయిస్తుంది. సెవెంత్ లోకి వచ్చేసాను కదా. అలా చదివితే గానీ ఐ. ఐ. టి లో సీట్ రాదట." అమాయకం గా చెబుతున్న సాత్విక ని జాలిగా చూసింది అంజలి.

ఆరో తరగతి నించే స్టార్ట్ చేసేస్తున్న ఈ ఐ ఐ టి కోచింగ్ పిల్లల బాల్యాన్ని కళా విహీనం చేసేస్తోందని అనిపించిందామెకి.

"అలాగే నాకు కుక్క పిల్లలంటే కూడా చాలా ఇష్టం. అమ్మని కొనియ్యమని ఎంత బ్రతిమాలినా కొనియ్యదు. వాటి తో ఆడుతూ టైం వేస్ట్ చేసుకుంటే ఎలా రా తల్లీ అంటుంది."

అంజలి మౌనంగా వింటోంది. పిల్లలు కాస్త ఓపెన్ అయ్యేవరకే సమస్య. తర్వాత వాళ్ళంతట వాళ్ళే మొత్తం విషయం చెప్పేస్తారు.

" నాకెప్పుడూ ఎగ్జామ్స్ లో మంచి మార్కే వస్తాయి. ఎప్పుడైనా బై మిస్టేక్ ఒక హాఫ్ మార్క్ తగ్గితే మమ్మీ చాలా ఫీలయిపోతుంది. నన్నేమీ అనదు. కానీ డల్ గా అయిపోతుంది. ఒక్కోసారి అన్నం కూడా తినదు. నాకు చాలా బాధేస్తుంది. భయమేస్తుంది." దిగులుగా చెబుతోంది సాత్విక. అటువంటి సమయాల్లో ఆ అమ్మాయి అనుభవించే మానసిక క్షోభ తన ముఖంలో స్పష్టం గా కనిపిస్తోంది.

"నాకు ఇంక విసుగు పుట్టింది. అందుకే ఇంట్లో చదువుకుని వెళ్ళినా ఎగ్జామ్ లో రాయడం మానేసాను. మమ్మీ ఎందుకు అలా జరిగిందో అర్థం కాక కన్ఫ్యూజ్ అవుతుంటే కొంచెం హ్యాపీ గా ఉంది." బిడియం గా చెప్పి తప్పు చేసానా అన్నట్టు అంజలి వైపు చూసింది సాత్విక.

అంజలి ఒక్క క్షణం మాట్లాడకుండా ఊరుకుంది. తర్వాత నెమ్మదిగా అంది

"ఇందాకా నా కథ నీకు పూర్తి గా చెప్పలేదు. ఇప్పుడు చెప్పనా"

"చెప్పండి" సాత్విక కి మళ్ళీ ఉత్సాహం వచ్చింది.

"చిన్నప్పుడు మా స్కూల్లో నా పేరు ఏంటో తెలుసా, పొడవు జడ అమ్మాయి అని పిలిచేవారంతా. నాకు చాలా పెద్ద జడ ఉండేది. పిల్లలు, టీచర్స్ అందరూ నన్ను ఎంతో గొప్పగా చూసేవారు. నా జడంటే అందరికీ ఇష్టమే. నా పొడవాటి జడ చూసి సర్ప్రైజ్ అవని వాళ్ళు ఉండేవారు కాదు. అది నాకో స్పెషల్ అట్రాక్షన్ గా ఉండేది. కానీ జుట్టు విప్పుకుని వెళ్ళాలన్న కోరిక వల్ల దాదాపు సగం జుట్టు పోయింది. అందువల్ల నేను కూడా స్పెషల్ అమ్మాయి నుండి మామూలు అమ్మాయి గా మారిపోయాను. నాకు మళ్ళీ అంత జుట్టు రావడానికి రెండేళ్ళు పట్టింది. అనవసరం గా అమ్మ మీద కోపంతో, నా కోరిక తీర్చుకోవాలన్న పంతంతో ఇంపార్టెన్స్ పోగొట్టుకున్నానని చాలా రోజులు బాధ పడ్డాను"



సాత్విక ఆలోచనలో పడినట్టు కనిపిస్తోంది. వేడి గా ఉన్నప్పుడే కదా ఇనుముని వంచాల్సింది.

మళ్ళీ అంది అంజలి. "నీక్కూడా స్కూల్లో అలాగే అయి ఉంటుంది కదూ, మార్క్స్ రావడం తగ్గిపోయాక "

"అవునాంటీ, అంతకు ముందు టీచర్సంతా నన్ను బాగా మెచ్చుకునేవారు. సాత్విక ని చూసి నేర్చుకోండి అని మిగితా స్టూడెంట్స్ ని తిట్టేవారు. ఇప్పుడేమో నన్నే తిడుతున్నారు. కళ్ళు నెత్తి కెక్కాయని, పొగరని" బాధ గా చెప్పింది సాత్విక.

ఈ ఆలోచన చాలు. సాత్విక మళ్ళీ మునుపటిలా మారిపోవడానికి. సంతృప్తి గా అనుకుంది అంజలి.

"మమ్మీ లు మనకోసమే అన్నీ చెప్తారు, చేస్తారు. కానీ వాళ్ళు చెప్పే మెథడ్ లోనే తేడా ఉంటుంది. ఏం చేస్తాం,ఒక్కోసారి మనమే సర్దుకుపోవాల్సి వస్తుంది " అంటూ కొంత బుజ్జగించింది అంజలి ఆ అమ్మాయిని.

ఈ రోజుకి ఇది చాలు. అవసరమైతే ఇంకో సారి మాట్లాడితే సరిపోతుంది అనుకుని ఏ ప్రోబ్లెం వచ్చినా తనతో డిస్కస్ చెయ్యమని చెప్పి సాత్విక ని పంపేసింది అంజలి. వాళ్ళమ్మ ఆత్రంగా బయట వెయిట్ చేస్తూ ఉండి ఉంటుంది.

తను చెయ్యాల్సింది ఇంకా అయిపోలేదు. అసలు సమస్య సాత్విక లో లేదు. ఆమె తల్లి లో ఉంది. తల్లి ప్రవర్తన సాత్విక పై విపరీతమైన దుష్ప్రభావాన్ని చూపుతోంది.

తెలీకుండానే ఆమె తల్లే ఆ పాప ని సమస్యకి చేరువ చేస్తోంది. ఆ పసి మొగ్గ సహజంగా వికసించే అవకాశం లేక మరింతగా ముడుచుకు పోతోంది. తల్లి ప్రవర్తనని డైజెస్ట్ చేసుకోలేక ఆ పిల్ల ఆలోచనలు అడ్డ దారుల్ని వెతుకుతున్నాయి.

ఇది ఒక్క సాత్విక సమస్యే కాదు. కార్పొరేట్ చదువుల చట్రం లో ఇరుక్కుని నలిగిపోతున్న చాలా మంది పిల్లలకి ఏర్పడుతున్న సంకటమే ఇది. ఇప్పటికైనా తల్లి తండ్రులు మేలుకోకపోతే చాలా ప్రమాదం. బాగా చదువుకునే ఒక తెలివైన అమ్మాయి పరిస్థితే ఇలా ఉంటే సామాన్యమైన తెలివి తేటలున్న పిల్లలకి ఇంకెంత కష్టం గా ఉంటుంది.

పిల్లలని చదువుకోమని చెప్పొద్దని తన ఉద్దేశ్యం కాదు. బలవంతంగా చదువు ని వాళ్ళ నెత్తి మీద రుద్దకుండా చదువుకుంటే వచ్చే లాభాలు వాళ్ళకు విశదం గా చెప్పి, ఈ వయసులో చదువు కి ఎక్కువ సమయాన్ని కేటాయించడం ఎంత అవసరమో వాళ్లకి తెలిసేలా చెయ్యాలి. వాళ్ళ భవిష్యత్తు వాళ్ళ చేతుల్లోనే ఉందని వాళ్ళకి అర్థమయ్యేలా చెప్పాలి.గొప్ప విజయాల్ని సాధించిన వారి కథల్ని వాళ్ళకి వినిపించాలి.

అది ఒక్క తల్లి తండ్రుల వల్లనే అయ్యే పని కాదు. మేధావి వర్గం కూడా ముందుకు వచ్చి స్కూల్స్ లో కౌన్సిలింగ్ నిర్వహించాలి. చదువుకి పిల్లలు ఇష్టం తో దగ్గరయ్యేలా చెయ్యాలి. అది ఎప్పటికి సాధ్యపడుతుందో సమాజంలో ఆ మార్పు ఎప్పటికి వస్తుందో అనుకుంటూ నిట్టూర్చింది.

సాత్విక విషయంలో మార్పు అవసరమైంది ఆ పాప ఆలోచనలో కాదు, ఆమె తల్లి ప్రవర్తన లో. ఆ విషయమే సాత్విక తల్లి కి చెప్పి ఆమెకి కౌన్సిలింగ్ ఏర్పాటు చెయ్యాలి అనుకుంటూ అసిస్టెంట్ కి కాల్ చేసి ఆమెకి మెసేజ్ ఇవ్వమని చెప్పింది అంజలి.

## కవిత

# 'చదువులలో సారమెల్ల చదివితితండ్రీ'

- అద్దేపల్లి రామమోహనరావు
9849150303

ఏది తెలుసుకుంటే
అన్నీ తెలిసిపోతయ్యో
దాన్ని తెలుసుకోకపోతే
నువ్వు ఏమీ తెలుసుకోనట్లే
కళ్ళుమూసుకుని నిలబడ్డ చోటనే పరుగెత్తుతూ
గుండెలవిసిపోయి కళ్ళు తెరిస్తే
ఉన్నచోటనే ఉండిపోయినట్లే
దూరంగా కొండకొమ్మమీద దీపాన్ని చూస్తూ
చీకట్లో నడిచిపోతూ
ఊబిలోకి జారిపోయినట్లే
ఏది తెలుసుకుంటే
అన్నీ తెలిసిపోతయ్యో
ఆ రహస్యాన్ని
సముద్రాల అవతలనించిన వచ్చిన గాలి
నా చెవిలో ఊదిపోయింది
విన్నావా, ఎవరోలాక్కుపోతున్న దారపుఉండ మొదలు
నీ చేతిలోకొస్తుంది
వినకపోయావా, నీచేతిలోనించి
సూత్రం తప్పించుకుపోతుంది
ఏది తెలుసుకుంటే
అన్నీ తెలిసిపోతయ్యో
దాన్ని తెలుసుకోకపోతే
నువ్వు ఏమీ తెలుసుకోనట్లే
కళ్ళ ఎదుట 'దర్శన' మిస్తూ 'దూరం' లేకుండా
చర్చలు, ఉపచర్చలు
వెంట్రుకలు చీల్చి చూపించే చర్చోపచర్చలు
వాదాలు, ప్రతివాదాలు
సూది రాళ్ళు ముఖాన విసిరికొట్టే వాదోపవాదాలు
ఖండనలు, మండనలు
ఒక పార్టీ ఖండిస్తే, మరోపార్టీ మండిస్తుంది
అదే పార్టీ పదవిలోకొస్తే
అదే నిర్ణయం తీసుకున్నా ఎదటి పార్టీని ఎండగడుతుంది
మేధావులు బుర్రల్ని పల్టీ కొట్టించినా
చివరికి బొర్రలే గెలుస్తున్నై
సాంకేతిక నిపుణులు విజ్ఞానాన్ని కొండలుగా పేర్చినా
కొండల కడుపులో పేల్చిన బాంబులు
కొండల్ని పగలగొట్టేస్తున్నై
ఏది తెలుసుకుంటే, అన్నీ తెలిసిపోతయ్యో
దాన్ని తెలుసుకోకపోతే
నువ్వు ఏమీ తెలుసుకోనట్లే



నెగ్గేదానికి, నెగ్గనిదానికి
మధ్య 'ఉన్న గ్రహగమనం'
తెలిస్తే
నువ్వు భవిష్యవాణి వౌతావు
నీకు కాలం నాడి తెలిస్తే
నాడీ జ్యోతిష్యుడివే ఔతావు
కార్పొరేట్ వ్యాపారాన్ని
కొలబద్ధగా తీసుకో
నిన్ను ఖండించేవాడిచేతిలో
నీ భవిష్యవాణి రాల్చు
ముందు, వాడుదాన్ని తీసికెళ్ళి మట్టిలో కలుపుతాడు
తర్వాత నీ మాట నిజమైనప్పుడు
మట్టిలోనించి 'నిజం' మొక్క తలెత్తగానే
ఆశ్చర్యంతో కళ్లు ఆకాశంమీద ఆరేసి
నా పాదాల మీద కనుపాపలకాంతులు కురిపిస్తాడు
సామ్రాజ్యవాదానికి ఆజ్యంపోస్తే
కార్పొరేట్లకి ఎర్రకార్పెట్లు పరిస్తే
అది అణుప్లాంటుకానీ, గ్యాస్ పైప్‌లైన్ కానీ
జన్యుమార్పిడిగానీ, ప్రాజెక్టులుగానీ
ప్రజల కన్నీళ్లు పాదాల్ని కరిగించనీ
కరుణగల పెద్దల గుండెల్ని కదిలించనీ
వారి వాదాన్నే విజయ 'లక్ష్మి' వరిస్తుంది
బల్లి, పురుగుని తినడానికి
ఎన్నిక్షణాలైనా రాయిలా కదలకుండా ఆగిపోతుంది
సమయంరాగానే
క్షణంలో నోరుతెరిచి పైన దూకుతుంది
బల్లిని అర్థం చేసుకుంటే చాలు
ఏది నెగ్గుతుందో ముందే చెప్పేస్తావు
అందుకే, గ్లోబుగమనం తెలిసినవాడు ఆశ్చర్యపోడు
ఎందుకంటే
ఏది తెలుసుకుంటే
అన్నీ తెలిసిపోతయ్యో
దాన్ని తెలుసుకుంటే
నీకు అన్నీ తెలిసినట్లే !

## పరిశీలన

# ఎదుగుతున్న కథకుడు వేంపల్లి షరీఫ్

- రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి
9440222117




***2004లో జాతీయంగా, రాష్ట్రీయంగా జరిగిన రాజకీయ మార్పువల్ల కొన్ని ఉపశమనాలు తప్ప, మౌలికమైన మార్పులేవీ రాలేదు. ఒకరకంగా ఆ మార్పు భుజాలు మార్చుకోవడంగానే మిగిలిపోయింది. ఈ కాలంలో కూడా కులమతఘర్షణలు జరిగాయి. దేశం బాగుందన్నది ప్రచారమే తప్ప వాస్తవం కాదని తేలిపోయింది. ఈ కాలంలో తెలుగు రచయితలు నిర్వహించిన కర్తవ్యం చాలా బాధ్యతాయుతమైన పాత్రని నిర్వహించింది. ఇందులో భాగమే షరీఫ్ కథలు.***

యువరచయితలను ప్రోత్సహించడానికి కేంద్రసాహిత్య అకాడమీ కొత్తగా ప్రారంభించిన 'యువపురస్కార్'లు మొదటి రెండు పర్యాయాలూ ఒకే జిల్లాకు (వెయస్సార్ జిల్లా) చెందిన, ఒకే ఇంటిపేరు (వేంపల్లె) కలిగిన ఇద్దరు కథకులకు లభించడం- గంగాధర్ 2011, షరీఫ్ 2012- కాకతాళీయమే అయినా, ఆసక్తికరమైన అంశం. ఇద్దరూ పీడితవర్గ రచయితలు కావడం విశేషం.

వేంపల్లె షరీఫ్ రచించిన పన్నెండు కథల సంపుటి 'జుమ్మా' 2011లో పుస్తకరూపంలో వచ్చింది. ఈ సంపుటిలోని కథల్ని షరీఫ్ 2003-11 మధ్య తొమ్మిదేళ్లలో రచించారు. ఇవి ఇరవయ్యొకటవ శతాబ్దం తొలి దశాబ్దానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కథలు. తొలికథ 'జీపొచ్చింది' (2003) వచ్చేనాటికి భారతదేశ పాలకులు ప్రవేశపెట్టిన ప్రపంచీకరణకు ఒక దశాబ్ది చరిత్ర గడిచిపోయింది. ముస్లిముల గుండెలను గాయం చేసిన బాబ్రీ మసీదు విధ్వంసం జరిగి కూడా దశాబ్దం గడిచిపోయింది. వీటికి కొనసాగింపుగా 2002 నాటి గోద్రానంతర గుజరాత్ మారణకాండ, బషీర్‌బాగ్ హత్యాకాండ పచ్చిపచ్చిగా ప్రజల మనస్సులలో నిలిచి ఉన్నాయి. దేశం వెలిగిపోతోందని, అంతా బాగుందని, స్వర్ణాంధ్ర అని, విజన్ 2020 అని పాలకులు ప్రచారం చేసుకుంటూ ఉంటే, ప్రజలు తరతరాలుగా భారతదేశాన్ని పట్టి కుదిపేస్తున్న కుల, మత, ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారు. అది రాష్ట్ర ప్రజల కడగండ్లు చెప్పేదానికి సాధ్యం కాని కాలం. కరువు విలయతాండవం చేస్తున్నది. రైతులు, చేనేతకార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. పాలకులు రైతులు తినింది అరక్క చస్తున్నారని, ప్రభుత్వమిచ్చే ఎక్స్‌గ్రేషియాకు ఆశపడి చస్తున్నారని ఎగతాళి చేస్తున్నారు. అప్పటి రాజకీయ వ్యవస్థమీద ప్రజలు తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నారు. ప్రజాసంఘాలు కరువుపీడిత ప్రజలకు గంజికేంద్రాలు నిర్వహించి ఆదుకోవలసిన దుస్థితికి రాష్ట్రం చేరుకొంది. 2004లో జాతీయంగా, రాష్ట్రీయంగా జరిగిన రాజకీయ మార్పువల్ల కొన్ని ఉపశమనాలు తప్ప, మౌలికమైన మార్పులేవీ రాలేదు. ఒకరకంగా ఆ మార్పు భుజాలు మార్చుకోవడంగానే మిగిలిపోయింది. ఈ కాలంలో కూడా కులమతఘర్షణలు జరిగాయి. దేశం బాగుందన్నది ప్రచారమే తప్ప వాస్తవం కాదని తేలిపోయింది. ఈ కాలంలో తెలుగు రచయితలు నిర్వహించిన కర్తవ్యం చాలా బాధ్యతాయుతమైన పాత్రని నిర్వహించింది. ఇందులో భాగమే షరీఫ్ కథలు.

'జుమ్మా' సంపుటిలోని పన్నెండు కథలలో జీపొచ్చింది(2003), అయ్యవారి చదువు(2007), ఛాపరాయి(2011) తప్ప తక్కిన కథలు ముస్లిం జీవిత ప్రతిఫలనాలు. ఆ తొమ్మిదింటిలో రజాక్‌మియా సేద్యం(2003), రూపాయికోడిపిల్ల(2005), దస్తగిరి చెట్టు(2006), జుమ్మా(2007), పర్దా(2009) పూర్తిగా ముస్లిముల ఆర్థికసాంస్కృతిక జీవితాన్ని ప్రతిబింబిస్తున్నాయి. పలకలపండగ(2004), తెలుగోళ్ల దేవుళ్లు(2007), అంజనం(2010), ఆకుపచ్చ ముగ్గు(2011) ఈ నాలుగు కథలు సహజంగానో, కృత్రిమంగానో హిందూమత ప్రభావం ముస్లిముల మీద పడడం గురించినవి.

షరీఫ్ రాసిన మొదటి రెండు కథలు- జీపొచ్చింది, రజాక్‌మియా సేద్యం- వ్యవసాయానికి సంబంధించినవి. వీటిలో మొదటిది రైతులపట్ల ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించడాన్ని చిత్రిస్తే, రెండవది పేదరైతుల పట్ల సంపన్న రైతుల దుర్మార్గ ప్రవర్తనను ప్రదర్శించింది. ఈ కథలు రాసేనాటికి షరీఫ్‌కు పాతికేళ్ళుంటాయి. ఈ వయసులో ఈ రాజకీయ కథలు రాయడం విశేషం. నిజంగానే అది గ్రామాల్లోకి జీపులొస్తున్న కాలం. పాలకులు ప్రత్యక్షంగా ప్రజలపైని యుద్ధానికి దిగిన కాలం. రెవెన్యూ ఉద్యోగులు, పోలీసులను గ్రామాల మీదికి ఉసిగొల్పి రైతులను కరెంటు దొంగలుగా ముద్ర వేసి, వాళ్ళను అరెస్ట్ చేసి, జైల్లో పెట్టి, వాళ్ల మోటార్లు, స్టార్టర్లు పెరక్కపోయి హింసిస్తున్న కాలం. రైతులు ప్రభుత్వానికి భయపడి ఊర్లొదిలి పారిపోతున్న కాలం. ఈ దుర్మార్గం నే




"ఎప్పుడూ అల్లా మీదే ధ్యాస పెట్టాలి. చివరికి పక్కన బాంబు పేలినా కదలకూడదు" అని బోధించింది. ఆ తల్లే మక్కామసీదులో బాంబులు పేలినట్లు తెలిసినప్పుడు కొడుకుతో "నువ్వుగాని మసీదుకు వెళ్లలేదు కదా నాయనా" అని అడిగింది ఫోన్‌లో.

వెంకట్రెడ్డి అనే రైతు జీవితాన్ని 'జీపొచ్చి కథగా రాశారు షరీఫ్. కథ చా వాస్తవికంగా, విషాదాంతంగా రాశా స్వతంత్ర భారతదేశ చరిత్రలో అప్పటి ర ప్రభుత్వం వ్యవసాయరంగ ప్రజల చేస్తున్న దౌర్జన్యాన్ని షరీఫ్ ఒకే ఒక్క వాక్య వ్యాఖ్యానించారు. 'బ్రిటీషోళ్ళు పన్ను వసూలు చేస్తున్నట్లుంది పరిస్థితి' అన్నా ఈ వాక్యం ఈ కథకు ప్రాణ పరాయిపాలకుల దౌర్జన్యానికీ, ప్రజలెన్నుకున్న పాలకుల దౌర్జన్యానికీ తేడాలేని వాస్తవాన్ని ఈ వాక్యం సూచిస్తున్నది. తాను ఓటువేసి ఎన్నుకున్న ప్రభుత్వం అండతో ధైర్యంగా బతకవలసిన రైతును మూడు నెలల నుండి 'సచ్చిపోయాడెట్టా?' అని ఆలోచించే దశకు నెట్టింది. ఈ చిత్రణ బ్రిటీష్ వాళ్ళనుండి ఎవరికి స్వతంత్రం వచ్చిందనే ప్రశ్నను రేకెత్తిస్తుంది.

'రజాక్‌మియా సేద్యం' ప్రజాస్వామ్యం ముసుగులో కొనసాగుతున్న భూస్వామ్య వ్యవస్థకు ప్రతిబింబం. ఒక సామాన్య తరగతి ముస్లిం రైతును మరో సంపన్న హిందూ రైతు ఎలా కబళించారో ఈ కథ చిత్రించింది. కుట్టు పనిచేసుకొని బతుకుతున్న రజాక్ మియా తండ్రికి స్నేహం కొద్దీ మలకోలపల్లి రెడ్డి నాలుగెకరాల భూమి ఉచితంగా ఇస్తే, తర్వాత కాలంలో దానిని మధురెడ్డి అనే పెద్ద రైతు కబ్జా చేసేస్తాడు ఈ కథలో. రజాక్‌మియా తండ్రి మలకోలపల్లి రెడ్డితో "సాయిబుని, నాకెందుకు రెడ్డీ భూమి" అని అంటే, ఆయన "భూములు రెడ్లూ, కాపోళ్లే సేయాల్లని యాడన్నా రాసిపెట్నారా ఏంది!" అని ప్రశ్నించాడు. తదనంతర కాలంలో రజాక్‌మియాతో అంజిగాడు "సాయిబులు మీకెందుకు మామా సేద్యం. అమ్మిపారేసి ఏ దుబాయికో, కోయిటుకో పోకుండా" అని అంటాడు. గ్రామీణ ఆర్థిక సంబంధాలలో వచ్చిన మార్పునకు ఈ సంభాషణలు సంకేతాలు. అయిదెకరాల రైతు కూడా కరువొస్తే రాయలసీమలో తిండిగింజల కోసం పెద్దరైతులను ఆశ్రయించాల్సిన దైన్యాన్ని ఈ కథ వర్ణించింది. ముస్లిం స్త్రీలు సైతం వ్యవసాయ కూలీలుగా మారి ప్రాణాలు పోగొట్టుకునే వాస్తవాన్ని కూడా ఈ కథ బయటపెట్టింది.

పర్దా, దస్తగిరి చెట్టు- ఈ రెండు కథలూ ముస్లిముల ఆర్థిక దుస్థితిని చిత్రించాయి. 'పర్దా', పరదా వెనక దాగుండే పేదరికాన్ని ఆవిష్కరించింది. తలుపులు లేని మూడు చిన్న గదులలో అయిదుమంది ఇరుకుగా బతకవలసి వచ్చిన దుస్థితిని ఈ కథ వాస్తవికంగా ప్రతిబింబించింది. తలుపులు లేని రెండవ గదికి పరదా ఎందుకు కట్టారంటే పెద్దమనిషి అయిన మ్మాయిని దాచిపెట్టుకోడానికి, అదికూడా ్నానికి భయపడి. 'దస్తగిరి చెట్టు'లో మ్మమ్మ ఊరికిపోయి రావాలన్న కొడుకు కను తల్లి తిరస్కరిస్తుంది. అందుకు ణం ఆర్థికవే. తన కొడుకు మ్మగారింటికి పోతే, అక్కడ వీడికి తిండి లేని పేదరికం. ఈ రెండు కథల్ని ఒక పల్లవాడి దృష్టి కోణం నుండి ంచారు షరీఫ్.

భారతదేశంలోను మతపరమైన హింనాకాండ రక్తచరిత్రగా మిగిలి కొనసాగుతున్నది. ఇది భారతదేశ చరిత్రలో ఒక మాయని మచ్చ. 'జుమ్మా' కథ అలాంటి ఒకానొక మాయని మచ్చను ప్రతిబింబించింది. హైదరాబాదులో మక్కామసీదులో శుక్రవారం ముస్లిములు ప్రార్థనలు చేసుకుంటున్న సమయంలో జరిగిన పేలుళ్ళలో అనేకులు మరణించిన విషాద సంఘటన ఈ కథలో వస్తువు. శుక్రవారం మసీదుకు వెళ్లి నమాజు చెయ్యడం పట్ల ప్రగాఢమైన విశ్వాసం గల తల్లి, హైదరాబాదులో ఉన్న తన కొడుకు ఆ పేలుళ్ళలో ఏమైనా చిక్కుకున్నాడా? అని ఆందోళనపడే కథ ఇది. గ్రామీణ ముస్లింతల్లి శుక్రవారం పవిత్రతనూ బోధించి కొడుకును మసీదుకు పంపడం అలవాటు చేసింది. ఆమె దృష్టిలో శుక్రవారం మసీదుకు వెళ్లి నమాజు చేయటం కన్నా పవిత్రమైన పని ఇంకొకటి లేదు. అందుకే ఆమె తన కొడుక్కి మసీదులో ప్రార్థన చేసే సమయంలో ఎలా ఉండాలో చెబుతూ "ఎప్పుడూ అల్లా మీదే ధ్యాస పెట్టాలి. చివరికి పక్కన బాంబు పేలినా కదలకూడదు" అని బోధించింది. ఆ తల్లే మక్కామసీదులో బాంబులు పేలినట్లు తెలిసినప్పుడు కొడుకుతో "నువ్వుగాని మసీదుకు వెళ్లలేదు కదా నాయనా" అని అడిగింది ఫోన్‌లో. మతపరమైన తీవ్రవాదం ఒకతల్లికి కలిగించిన మానసిక వేదనకు

నిలువెత్తు సాక్ష్యం ఈ కథ. నిరంతరం కొడుకును మసీదుకు వెళ్ళమని వత్తిడి చేసే తల్లి తన కొడుకు మసీదుకు పోలేదు కదా అని అడిగించగలిగినంత దుర్మార్గం అది. ఈ కథలో ధ్వనించే ఒక అంశమిది. రెండవది: మనిషి ప్రాథమికంగా భౌతికవాది. పెరిగి పెద్దయ్యే క్రమంలో మతం అలవాటవుతుంది. కాని మనిషి తన జీవితానికి రక్షణగా ఉంటాడని దేవుని నమ్మి, ఆ ప్రయోజనం నెరవేరనప్పుడు, ఆ దేవుని అయినా తిరస్కరిస్తాడు. అందుకే తల్లి మాట విన్న కథకునికి "కన్నుపేగు తీపికన్నా దేవుడు చేదయ్యాడా? నమాజు కానిదైందా?" అని అనిపించింది.

'రూపాయికోడిపిల్ల' అంజాన్ అనే చిన్నపిల్లవాడి సరదా కథ. ఒకరూపాయి పెట్టి అంజాన్ తల్లి కొనిచ్చిన కోడిపిల్ల పెద్దదైనాక కోసుకుతిందమని తండ్రి అంటే అతను వద్దంటాడు. అది వాహనం కింద పడి నలిగిపోతే కోసుకుని రావడానికి హజరత్ దగ్గరకి తొందరగా తీసుకుపోతాడు.

ఒక సమాజంలో విభిన్న విశ్వాసాలు గ‌ ప్రజలు నివసిస్తున్నప్పుడు వాటిమధ్య ఆదానప్రదానాలు జరగడం చాలా సహజం. అధికసంఖ్యాకుల ప్రభావం అల్పసంఖ్యాకుల మీద ఎక్కువగా ఉంటుంది. వీళ్ళ ప్రభావం వాళ్ళ మీద కూడా ఉంటుంది పరిమితంగానైనా. అయితే ఈ ప్రభావం పడడం బలవంతంగా జరగకూడదు. సహజంగా స్వీకర్తల ఇష్టంతో జరిగితే తప్పుపట్టవలసిన పనిలేదు. ఈ వాస్తవాన్ని షరీఫ నాలుగు కథలలో చిత్రించారు. 'పలకలపండగ' కథలో ముస్లిం విద్యార్థి పాఠశాలలో పలక మీద వినాయకుని బొమ్మ వెయ్యడానికి పలక కొనివ్వమని తల్లిని నిర్బంధం చేస్తాడు. పేదరికం వల్ల ఆమె గుజిలీలో ఉండే రేకు తీసుకొచ్చి ఇస్తే, అది బలపంతో రాస్తే అంటదు. ఆ పిల్లవాడు దానిని విసిరికొడితే తల్లికి దెబ్బతగులుతుంది. ఆఖరికి తాగుబోతు తండ్రి తాగకుండా వచ్చి కొడుక్కి పలక కొనిస్తాడు. పిల్లవాడు మదార్ మర్నాడు ఉదయం వినాయకుని విగ్రహం ముందు కొత్త పలకతో చిందులు వేస్తాడు. "నాకు సదూకోనికి పలక లేకున్నా పర్వాలా. పలక పూజకు మాతరం గావాల" అని మదార్ పట్టుబడతాడు ఆ కథలో. ఇది మత ప్రభావం అంతగా పడని, మత విభేదాలు తెలియని వయసు గల పిల్లవాడి కథ. 'తెలుగు దేవుళ్ళు' కథ కూడా ఇలాంటిదే. హిందువులు పెట్టుకున్న పాఠశాలల్లో అన్ని మతాల పిల్లల్ని విద్యార్థులుగా చేర్చుకొని, వాళ్ళు నిర్వహించే పోటీలలో ముస్లిం పిల్లలకు కూడా హిందూ దేవుళ్ళ బొమ్మలున్న వస్తువులను బహుమతులుగా ఇవ్వడం మీద అధిక్షేపం ఈ కథ. లౌకికవాద వ్యవస్థలో మత ప్రమేయం మీద విమర్శ ఈ కథలో కనిపిస్తుంది. "అందరూ కల్సి చదువుకొనే స్కూళ్ళకు దేవుళ్ళ పేర్లు పెట్టకుండా ఏ మామూలు పేర్లో పెట్టొచ్చు కదా... మతాన్ని తెలిపే పేర్లెందుకు. చదువుకు లేని మతం ఆ చదువు చెప్పే స్కూళ్ళకు ఎందుకుండాలి!" అని ఈ కథలో గౌసియా ప్రశ్నిస్తుంది. ఈ ప్రశ్నకు మతప్రభావం గల విద్యాసంస్థలు సమాధానం చెప్పాలి. గౌసియా తన కూతురు మున్నీని తన మాతృభాష కాని తెలుగు మాధ్యమంలో చేర్పించింది. ఆ పాఠశాల యాజమాన్యం ఇచ్చిన ఐడెంటిటీ కార్డుమీద, బెల్టుమీద వెంకటేశ్వరస్వామి బొమ్మ ఉన్నా సహించింది. ఆఖరికి ఇంట్లో శాశ్వతంగా ఉంచుకునే బహుమతుల మీద కూడా ఆ బొమ్మ ఉంటే ఆమె ఆక్షేపించింది. ఇది అస్తిత్వ సమస్య. విశ్వాస సమస్య. మతం ప్రమేయం లేని విద్యావ్యవస్థ తప్ప ఈ సమస్యకు మరో పరిష్కారం లేదు. 'అంజనం' కథలో ఏనాడో ఇంట్లోంచి వెళ్ళిపోయిన పెద్ద కొడుకు ఆనవాళ్లు తెలుసుకోవడం కోసం జుమ్మాలో అంజనాలు వేసి చెప్పే వాళ్ళను

షరీఫ్ కథలలో వస్తువులన్నీ పేద, మధ్య తరగతి కుటుంబాలవే. జీవితానుభవాలను చక్కగా కథగా మలచడం మీద ఆసక్తి స్పష్టంగా కనిపిస్తుంది. వాస్తవికతా సరిహద్దులు దాటని ఆదర్శవాదమూ ఉంది

ఆశ్రయిస్తుంది. ఆమెకు అదొక సంతృప్తి. ‌ంనిమీద చిన్నకొడుకు దృష్టికోణం నుండి ఈ కథ రాశారు షరీఫ్. ఇండ్లముందు ముగ్గులు వేసే హిందూ సంప్రదాయం ప్రభావంతో ఒక ముస్లిం యువతి తన మతంలోని ఆంక్షల వల్ల, చేతుల మీద గోరింటాకుతో ముగ్గులు వేయడం అలవాటు చేసుకుంటుంది 'ఆకుపచ్చ ముగ్గులో'. ఈ కథలో జీనత్ తన అమ్మపోరు పడలేక ముగ్గుల పిచ్చిని గోరింటాకు పెట్టి తీర్చుకుంటుంది. ఆమె ఒక ప్రశ్న వేసింది. "ముగ్గు ఇంటిముందు వేస్తే తప్పు కానీ, చేతిలో వేస్తే కాదుకదా... ఒక మతానికి మరో మతానికి మధ్య తేడా ఇంతేనా? ఇంతమాత్రం దానికేనా ఇన్ని మతగొడవలు జరుగుతుంటాయి?"ఈ ప్రశ్న కథలో కీలకం. ఈ మాత్రం ప్రశ్న 'జుమ్మా' కథలో లేకపోవడం వెలితిగా అనిపిస్తుంది.

కటికదారిద్ర్యంలో చదువుకొని పైకి వచ్చిన ఉపాధ్యాయుడు తన జీవితాన్ని ఒక కథగా తన విద్యార్థికి చెప్పిన కథ 'అయ్యవారి చదువు'. పేదరైతు కుటుంబంలోని పిల్లలు చదువుకొని పైకి రావడంలోని ఘర్షణను ఈ కథలో ఆసక్తికరంగా చదివించే శిల్పంలో చిత్రించారు. 'చాపరాయి' అరకులోయలో ప్రేమికుల రూపంలో యువకులు, పర్యావరణ సమస్య సృష్టించడాన్ని, వాళ్ళను నమ్ముకుని బతుకుతున్న ఒక చిత్రకారుడు, వాళ్ళ కోరిక నెరవేరుస్తున్నా, పర్యావరణానికి భంగం కలగకుండా కాపాడటాన్ని ఆవిష్కరించింది.

షరీఫ్ కథలలో వస్తువులన్నీ పేద, మధ్య తరగతి కుటుంబాలవే. జీవితానుభవాలను చక్కగా కథగా మలచడం మీద ఆసక్తి స్పష్టంగా కనిపిస్తుంది. వాస్తవికతా సరిహద్దులు దాటని ఆదర్శవాదమూ ఉంది– కథను అరకొరగా కాకుండా

## కవిత

# వీలునామా

- వలన్‌దాస్ వెంకటేష్
9505555197



మిత్రమా..........
నిర్దేశించుకున్న గమ్యాన్నిచేరే లక్ష్యంతో నడుస్తున్న మార్గ మధ్యనో
కక్ష్యలో తిరిగి తిరిగి అలసి ఆదమరచి నిద్రిస్తున్న అర్ధరాత్రి సమయాన్నో
అంతా సవ్యమేనని భావించి అస్త్రసన్యాసినై అప్రమత్తంగా లేని సందిగ్ధ కాలన్నో,,,,,,,,,,,,
మృత్యుకేళి సుడిగాలిలా చుట్టేసి నా పెడరెక్కలు విరిచికట్టి బంధీ చేస్తే
ఎదలోతుల్లోని గుప్పెడంత గుండె అచేతనమై
సంకోచ వ్యాకోచ ప్రక్రియలనాపి ఊపిరితిత్తులు చతికిలపడితే
నవరసరాగాలొలికిన స్వరపేటిక మూగబోయి నవనాడులు స్తంభిస్తే
పంచేంద్రియాలు సహజధర్మం కోల్పోయి నే విగతజీవినైతే
శవాసనంలోని నా మాంసపు ముద్దపై మృత్యువు వికట్టాట్టహాసం చేస్తూ,,,,,,,,,,,
విజయగీతిక పాడవచ్చు,,,,,,,కానీ,,,,,,,,,,,
చావును గేలిచేసి మృత్యువును ఓడించి
నిశబ్దాన్ని ఛేదించడమనే తంత్రాన్ని ఒడిసిపట్టేకదా
ఈ భూమ్మీద మరో శత వసంతానికి
చెరగని సంతకమవ్వాలని నిర్ణయించుకుంది
స్వప్నం సాకారం అవలేదనేబాధ
ఆత్మ క్షోభించడం సుతారం ఇష్టంలేదు........
పార్ధివదేహ అవయవాలు
అవసరమున్న పదిమందికి పంచాలి,,,,
కనుగుడ్లు,కాలేయం,మూత్రపిండాలు,
ఊపిరితిత్తులు గుండె కవాటాలు
ఆర్థులకు అందించాలి
మృతకాయంలోని సమస్త చిన్నా చితక అవయవాలు
శాస్త్రవిద్యార్థుల శోధనకై వినియోగించే
కొత్త అన్వేషణల ముడిపదార్ధపు ముద్దకావాలి
ఒక మృతదేహం పది మంద్రై వెలుగుతుంటే
జవసత్వాలందుకొని మళ్లీ నడకమొదలైతే
ఇంద్రధనస్సు కాంతుల్ని వీక్షించే అంధుడి కంట్లో నేనుంటే
సిరలు,ధమనులు,చతికిలబడి నీరసించిన గుండెకు నే చేదోడునైతే
నిర్జీవ శరీరం జీవచ్ఛవాలకు ఊపిరిపోసె కొత్త దండకం పాడితే
నిశ్శబ్దం నీరసించదా ? చావుసిగ్గుతో తలదించుకోదా ?
మృత్యువు ఓటమితో చచ్చిపోదా ?
అవయవదాన మహాయజ్ఞ క్రతువులో నా భౌతికకాయం సమిధైతే...
నేను.. మరో శతవసంతానికి చెరగని సంతకమే కదా !.....

---

నిండుగా, పుష్టిగా ఉండేట్లు రాయాలన్న ప్రయత్నంతో పాటు, కథ ఎండుగడ్డి దూర్చిన చర్మం దూడగా తయారవుతుంది. క్లుప్తతను కాపాడే ప్రయత్నమూ బాగ కనిపిస్తుంది. అయితే ప్రాపంచిక దృక్పథంలో రచయిత విధించుకున్న, లేదా జవదాటలేకపోయిన పరిమితి కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. అన్ని కథలలో కాకపోయినా కొన్ని కథలలో నైనా రచయిత భౌతికవాది అయ్యేంటే అవి ఆయన మాష్టర్‌పీస్‌లుగా రూపొంది ఉండేవి. 'జుమ్మా' కథలో అంతటి విధ్వంసం జరిగినప్పుడు, దానిని వస్తువుగా తీసుకున్నప్పుడు అసలు మత వ్యవస్థ మీదే మేధోపరమైన, దృక్పథపరమైన డైరెక్షన్ ఇవ్వగలిగిన అవకాశం వచ్చింది రచయితకు. "ఆ మసీదుకల్లా పోకు నాయనా" అని అన్న తల్లిలో వచ్చిన మార్పుకు కథకుడు ఆశ్చర్యపోతాడు. ఆశ్చర్యపోవడంలో ఆశ్చర్యం లేదు. ఆ తర్వాత కథకుడు "అల్లా క్షమించు. అల్లా మన్నించు. ఇంకో శుక్రవారం ఎక్కడా నెత్తురోడకుండా చూడు" అని ప్రార్థించాడు. ఈ ప్రార్థనతో కథ ముగియడం వల్ల అదొక ముస్లిం ఆస్తిక కథగా మిగిలిపోయింది. అన్ని మతాల ఫండ్‌మెంటలిస్టుల కళ్ళు తెరిపించే అవకాశం రచయిత భావవాద దృక్పథం వల్ల చేజారిపోయింది.

ముస్లిం కుటుంబాల పేదరికాన్ని బలంగా చెప్పగలిగిన రచయిత, దాని మూలాల్ని, దాని పరిష్కారాల్ని అన్వేషించే ప్రయత్నం చేయడం ఇకమీదటనైనా అవసరం. ఇవాళ మన తెలుగు సాహిత్యంగాని, సమాజం గాని ఫిర్యాదులతో సరిపుచ్చుకునే స్థితిలో లేదు. సమస్యల పరిష్కారాలకు అనేక ముఖాల నుండి అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయి. షరీఫ్ వాటిలో తన చోటు సంపాదించుకోవాలి. షరీఫ్ ఎదుగుతున్నాడు. ఇంకా ఎదగాలి.

వేంపల్లి షరీఫ్ ఇరవయ్యోకటవ శతాబ్ది తొలినాటి భారతీయ జీవిత వాస్తవికతకు ప్రతిబింబాలుగా తన కథల్ని మలిచారు. మరింత స్పష్టమైన ఆధునిక దృక్పథం ఏర్పడితే ఆయన ప్రజాకథకుడు కాగలడు. కావాలని కోరుకుంటున్నాను.

# కవిత



## కవిత్వం వాలిన చెట్టు

అయినంపూడి శ్రీలక్ష్మి
9989928562

అన్ని చెట్ల లాంటి చెట్టు కాదిది
కవిత్వం వాలిన చెట్టు ఇది
సాహిత్యాన్ని ఆవాహన చేసుకున్నచెట్టు ఇది

◆

దశాబ్దాల కాలంగా
ఆకాశవాణి ద్వారం ముందు సహజ తోరణం ఇది
కవులకు గొడుగు పట్టి
సృజనకారులకు తలవాల్చి
పదాల మువ్వలను తొడుక్కున్న పాదాల అడుగులకి
ఆహ్వానం పలికిన నిలువెత్తు వసంతం ఇది
అక్షరాలన్నీ రెక్కలు కట్టుకుని ఎగిరొచ్చి వాలిన గూడు ఇది
నిస్తంత్రీ స్వరాల ప్రాంగణమిది
హైదరాబాద్ ఆల్ ఇండియా రేడియో హృదయమిది

సృజన సాగరానికి పొరుగునే ఉన్నందుకేమో
ఈ చెట్టుకు భాషా భేషజం బాగానే అబ్బింది
నిలయ కేంద్రం లోంచి గాలిలోకి వెళ్ళే ప్రసారాన్ని వినే
తొలి శ్రోత కదా
శాస్త్రీయ సంగీతాన్నీ- గాత్ర వాయిద్యాన్నీ- ఫిల్మీ మ్యూజిక్‌నీ
మేధావుల విశ్లేషణనీ - కథా పారాయణాలనీ - కవితా గానాలనీ
వింటూ వింటూ పెరిగిన కళారాధకురాలు కదా

ప్రతీ ప్రసారానికీ--
సంభ్రమమై చిగుళ్ళను మొలిపించి
పరవశమై పత్ర హరితాలను అదిలించి
వికసితమై పూలను పూయించి - కలవరమై కాయలు కాయించి
వేళ్ళు కదపకుండానే ఆనంద తాండవమాడిన
సాహితీ ప్రేమిక అయింది

గాలిలోకి అలలు అలలుగా ఎగసిన సిగ్నేచర్ ట్యూన్ తొలి నాదానికి
చటుక్కున కళ్ళు తెరుచుకుని
సుప్రభాత ప్రసారానికి ఒళ్ళు విరుచుకుని
శ్రవణం ద్వారా పొందిన స్వర జ్ఞానాన్ని-
మననం నుండి అందిన మనోల్లాసాన్ని
వేళ్ళ గుండా లోలోపలికి వెదజల్లి
మట్టికి కూడా అనుభూతిని అందించిన జ్ఞానర్షి అయింది
రేడియో తరంగాలలోంచి
మహాకవులు చిలకరించిన వాక్య వర్షం లో తడిసి తడిసి
నిలువెల్లా కవిత్వాన్ని ఒంట పట్టించుకున్న పచ్చని పద్యం అయింది
కొమ్మల నిండా అదృశ్య ఛందస్సుని
ఆకుల నిండా ఉపమానాలనీ
కాండం అంతటా భావాల బెరడునీ పెంచుకున్న
సతత హరిత కావ్యం  అయింది
ఆపాద మస్తకం వాణీ నాదాన్ని నింపుకున్న గ్రంథం అయింది

నీకిది తెలుసా...
ఆకాశ స్వరానికీ - నేల మీది చెట్టుకీ ఏళ్ళ కాలపు అనుబంధం
ప్రతీ వేకువ జామున
ప్రసార తొలి స్పర్శకి పులకించడం చెట్టుకి తెలుసు
ఆ పులకింతలని మురిపెంగా చూడటం ఆకాశ స్వరానికి తెలుసు
అందుకేనేమో --
నగరం లోని ఏ చెట్టుకీ లేని అరుదైన గౌరవం
తనకే దక్కిందని గర్వంగా ఊగేది - గొప్పగా తలెత్తేది
వినయంగా ఒదిగేది -విధేయంగా మసలేది

◆

సహ పాదచారీ,
ఈ గ్లోబలైజేషన్ సీజన్‌లో
మహానగరం ఏం చేసినా గుండె కోతే
ఎవరో ఒకరికి ఏదో ఓ చోట విపత్తే
ఆఖరికి దాని స్వప్నం కూడా ఓ వైపరీత్యమే
మల్టీ లెవెల్ మెట్రో స్వప్నం మహా వృక్షాలని పెళ్ళగించి
బాటసారి షెల్టర్‌లని HMDA మ్యాప్‌పై చెరిపేసింది
కోట్లాది జ్ఞాపకాలను అపురూపంగా దాచుకున్న చెట్టు బతుకుని
తెల్లారక ముందే తెల్లారేలా చేసింది
పచ్చని పాటని చిదిమేసి- వెచ్చని నీడని మాయం చేసింది

ప్రసారంలో అంతరాయానికి కనీసం చింతనైనా వ్యక్తం చేస్తాం
ప్రకృతిలోని ఈ అంతరాయానికి రవంతైనా ఆలోచించం
డెవలప్ మెంట్ కుట్రకి మెస్మరైజ్ అయిపోయి
వేలాది చెట్లను దగ్గరుండి చితిపైకెక్కిస్తాం
మనం కూచున్న కొమ్మని మనమే నరుక్కుంటాం

వందేళ్ళ చెట్టుకు నూరేళ్ళు నిండాయి
శ్రోతలలో వృద్ధ శ్రోతకు ఆఖరి శ్వాసలు పోయాయి
నూరు శాఖల చెట్టు నేల మట్టం అయింది
నూరేళ్ళ అనుభూతి ముక్కలై రాలింది

◆

ఇప్పుడు ప్రతీ ఉదయం
ఆకాశవాణి తొలి ప్రసార స్వరం
చెట్టు స్పర్శ అందక బావురుమంటోంది !!!

**(మెట్రో రైల్ కోసం ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం ముందు ఉన్న చెట్టు నిర్దాక్షిణ్యంగా బలవడం చూసి ... )**

## కథ



# తేనెటీగలు

- ఉదయమిత్ర
9985203376

**"గోయిందా ...వెంకట రమణా.... గోయిందా... గో.. హో... విందా"**
**"ఎత్తుండ్రి... ఎత్తుండ్రి..."అరేయ్... ఆల్లోల్లు ఎవరున్నరో ముందుకు రాండ్రి.... అరేయ్ రాములుగా... నువ్వుముందరవట్టు. అరేయ్‌కిష్టిగా నువ్వు గా పక్కన ఇగలేపుండ్రి.."**

అందరూ తువ్వాళ్లు నెత్తిన జుట్టుకొని, పాడెలేపడాన్కి సిద్ధమయినారు.

ఇంతలో "జర్ర ఉండుండ్రి." అంటూ వొకాయిన వొచ్చి, "అన్నా.. పోస్ట్ మార్టమ్ జేసిన్రు గాని – తలకు కుట్లు సరిగా ఎయ్యలే... కుట్లల్లకెల్లిరక్తం వొస్తున్నది. నెత్తికింద గడ్డి, మెత్తవెట్టాలె" అంటూ గుసగుసగా జెప్పాడు.

అప్పుడు జూశాను తలవైపు "తలకు ఆదరాబాదరాగ కుట్లేసి పంపినట్లున్నారు.. కదిలిస్తే చాలు. కుట్ల నుండి బొడ బొడా రక్తం కారుతోంది. నలుపు ఎరుపుగల్సిన రక్తం!

ఎవరో లోపల్నుండి ఇంతగడ్డీ, మెత్త దీసుకొచ్చారు. తలను మెల్లగా మెత్త మీదుంచారు.

"సరిపోయిందా.."

"ఊ.."

"ఇగ ఎత్తుండ్రి.."

"గోయిందా... ఎంకటరమణా... గో..యింద"

డప్పులమోతల మధ్య, ఆడోల్ల ఏడ్పులమధ్యన పాడెముందుకు సాగింది.

--00--

పాడెసందుదాటి.. రామ్‌మందిర్ చౌరస్తా దగ్గరికొచ్చింది.. ఈ లోపున నాకు బదులుగ ఒకాయన పాడెబట్టుకొని, నాకు కాస్త "రిలీఫ్"ని ఇచ్చేడు. నేనాయనవైపు ఓసారి కృతజ్ఞతగా జూసి, మెల్లగా మా బామ్మర్ది బాలయ్య పక్కన జేరిపోయ్యాను. ఐదు నిముషాలు మౌనంగా పక్క పక్కనే నడిచాము.. ఏమీ మాట్లాడుకోలేదు..

శవంమీద జల్లిన చిల్లరపైసల్ని లాగుజెక్కుకుంట పోరలు ఏరుకుంటున్నారు. పోటీలు పడ్తున్నారు. నాకు చిన్నప్పటి నా అనుభవం జ్ఞాపకమొచ్చి నవ్వుకున్నాను.

పాడెముందు నడుస్తున్న తల్లి ఎంకటమ్మ, ఒట్టికట్టెకు పానం బోసినట్టుగా ఉంది. జీవితంలో ఇంత శాంతికోసం వెతికివెతికి వేసారినట్టున్నది. డప్పుల మోతలు.. మధ్య మధ్య ద్యాన్సులు. ఉండుండి ఏడ్పులు.. అన్నీ కలగల్సి ఓ విషాదదృశ్యం..

"చూడు బావా... ఎట్లాంటిపోరడు.. ఎట్లయిపాయె." మా బాలయ్య ఉపోద్ఘాతం మొదలెట్టాడు.

"ఏమయ్యింది బాలన్నా.." కుతూహలంగా అడిగాను.

"ఏముంది బావా... పోరడు... సోరదుడ్డెగాడు.. పెండ్లయిన ఆర్నెల్లకే కాటికి వోవట్టె. గీకాలమెంత ఘోరాలది? గీమనుషలెంత

ఘోరాలోల్లు? తల్లి ముందర నడ్సుడేంది? కొడుకు కాటికి బోవుడేంది? నిర్వేదంగా మాట్లాడేడు బాలన్న.

"యా సంగతీ.. నాక్కూడ సమఝుయితలేదు.. ఏమన్న జదివిండా పోరడు? ఏం పనిజేస్తుండే?" మరింత దగ్గరగా జరిగాను.

"ఆ... తండ్రి బతికి ఉన్నన్ని దినాలు పోరడు సక్కగనే జదివిండె... తండ్రిసచ్చినాంక... సదువు చట్టుబండలయ్యింది. తల్లి ఉన్నముగ్గురితో ఏగలేక... ఈన్ని సరిగ్గ పట్టించుకోలే.. పోరడు మంచోడే.. కాని ఎంగలిమంగలిగ దిరుగవట్టిండు... ఆడతిరిగి ఈడ దిరిగి మెల్ల మెల్లగ... దొంగతనాలకు షురువు జేసె..." కొంచెం ఆగి అటూఇటూ జూసిండు బాలన్న..

"గదేందీ? ఈడు దొంగతనం జేస్తే తల్లేం జెప్పేదిగాదా? బెదిరిచ్చేది గాదా?" మరింత కుతూహలంగా అడిగేను.

మా మాటలు లోతుల్లోకి పోతున్నాయి. ఎందుకయినా మంచిదని కాస్త వెనుకబడినడువడం మొదలెట్టాము.

"తల్లా.. తల్లేంజేస్తది? ఆదో ఎర్రిబాగుల్ది... అదిజెప్పితే ఎవడిన్నడు గనుక... మొగడున్నప్పుడు మొగడినకపాయె... కొడుకులు పుట్టినంక కొడ్కులినకపోయిరి.. దానిదో ఎర్దం బత్కుబావా".



"మరయితే?"

"అయితే ఏంది? ఎవనిదో లంగసోపతి పట్టిండు... తొలుత కడుపు నింపనీకే దొంగతనాలు జేసినా... తర్వాత్తర్వాత ఆడు పోలీసోల్ల జేబులు నింపనీకె దొంగతనాలు జేసిండు! ఈ మాటలంటున్నపుడు బాలన్న గొంతుమరీ చిన్నదయ్యింది. చుట్టు పక్కల అట్లాంటి వారున్నారెమొ జాగ్రత్తగా గమనించి సంభాషణ కొనసాగించాడు.

పాడె గాంధీ చౌరస్తా దగ్గరకొచ్చి ఆగిపోయ్యింది. పాడె ముందర డ్యాన్సులు మొదలయ్యాయి. ఈ మధ్యన ఇదో కొత్త కల్చర్ మొదలయ్యింది. పాడెను మధ్యమధ్యన ఆపి... డప్పులు గొడుతూ ఉంటే... తాగిన యువకులు డ్యాన్సులు జేస్తుంటారు. పక్కనుండి పైసలు జల్లుతుంటారు. మనిషి చచ్చిపోతే.. ఈ పిచ్చిడ్యాన్సు లేమిటో నాకర్థమయిచావలేదు. పైగా వీళ్లెవరూ వాడు బతికున్న సమయాన, ఇంత చాయదాపిన పాపాన పోరు. మనిషి బతికి ఉన్నప్పుడు లెక్కజేయక. చచ్చింతర్వాత ఈ డ్యాన్సులు.. ఈ ఘన సంస్కారాలేమిటో నాకర్థంగాదు...

◆◆◆

''ఏంది బాలన్నా... నాకర్థమయిత లేదు.. పోలీసుల కడుపునింపనీకె దొంగతనాలు జేసుడేంది? నాకు దెలుస్తలేదు. "అని మల్లీ అడిగాను. "అవ్‌బావా... తల్లిగొట్టినా.. తిట్టినా.. ఈడు ఇనకపాయె... సదువు సట్టుబండలాయె.. పనికి ఎక్కడా కుదురుగ నిల్వలేదు. ఈలోపున దొంగతనాలు మానుమని నల్గురు జెప్పిన్రు... కొంతకాలం నిజంగానే మానిండు. మంచిగ బత్కుతనని అందరితో జెప్పిండు... గాని.. గీపోలీసోల్లు.. యమీనోల్లు ఊకుంటరా?"

"అంటే?"

"కథశాన జర్గింది.. ఊల్లయాడ దొంగతనం జర్గినా.. ఈన్ని బులావు... పోరణ్ణి లోపలేసి ఉతికెటోల్లు.. ఆల్లకులేని సొమ్ము ముట్టజెప్పాలె... ఏం జెయ్యాలె.. మల్ల దొంగతనాలు జెయ్యాలె.. ఆ సొమ్ముదెచ్చి ఈ అయ్యలకియ్యాలె... ఆల్లకు సొమ్ముకుసొమ్ము దొర్కినట్టయితది.... ఈన్కి దెబ్బలు తప్పినట్టయితది.. ఏది ఏమయినా ఆల్ల రికార్డులల్ల మాత్రం ఈన్కి "దొంగ" అని పేరుపడ్డది. ఇగదాంట్లకెల్లి బటపడనీకె మార్గమే లేకపాయె.. కోమటి శాంతమ్మ ఇంట్ల దొంగలువడతే... ఈణ్ణి బులావ్... పక్క ఊల్ల దొంగలువడినా... ఈణ్ణి బులావు... ఎంతమొత్తుకున్నా... ఇనేటోల్లుగారు... ఇంకేం జెయ్యాలె.. ఈడు బలిజెనాగమ్మ ఇంట్ల దొంగతనంజెయ్యాలె.. ఈల్లకియ్యాలె.. ఆల్లు ఇంతదిని... ఇంత కోమటి శాంతమ్మకు ముట్టజెప్పెటోల్లు.. ఆల్లు.. ఈల్లు మంచిగున్నరు గాని... ఈడు "దొంగరాముడు" లెక్కనే మిగిలిపోయ్యిండు.."

"అంటే బాలన్నా... ఈన్ని గొట్టి ఇడ్సిపెడ్తుండిరా.. లేక కేసు వెడ్తుండిరా.."

"కేసు పెట్టేటోల్లు... అప్పుడప్పుడు. కాని ఈడుపోరడు గదా... ఆల్లకేదో ఏరే జైలుండేదంట... పిల్లల్నిపంపే జైలేందో ఉందట.. గది..గాడికి పంపెటోల్లు..."

"ఆ తర్వాత.."

''ఏముంది.. గాపోరలజైలుకెల్లి వొచ్చినాంక.. కుదురుకుందమని.. యాదో ఒకపనికి కుదుర్తుండె.. అంతలోనే ఊల్ల యాదో ఒక దొంగతనం జర్గుతుండె.. మల్లా ఈన్ని బులావ్.. పట్కపోవుడు.. తన్నుడు... ఆల్లబాధవడలేక... యాణ్ణన్న దొంగతనం జేషుడు.. "మల్ల దొంగతనాలు – మల్ల దొంగతనాలు"... ఎన్నన్న జెప్పుబావా.... ఆల్లు ఈన్ని జెనిగెల్లాగ పీక్క తిన్నరు... ఎంతజేసిన.. ఊబిలకెల్లి బయటికి రానీయకపోయిరి."

"అదిసరే... పెద్దయ్యాక... యాడికన్నా పారిపోయి.."

"ఆ..ఆ.. అదీ జర్గింది బావా.. అక్కోల్ల ఇంటికి పారిపోయి... హైద్రాబాద్‌ల పనికి గుదిరిండు. డబ్బానెట్టిండు.. చాపలు ఫ్రైజేసి అమ్మిండు..గా పోలీసోల్లకు దెల్వకుండా ఉంటదా? ఆడు బంగారు బాతేనాయె... సిలసిల దీసెటోల్లు – కేసులల్ల ఇరికిచ్చెటోల్లు.. ఛలో.. మల్ల దొంగతనాలు. మల్ల..పాతకథలు... పోలీసోల్ల దెబ్బ అంటే గొల్కొండ అబ్బ... "అంటూ మల్లీ కొంచెం ఆగి బీడీ ముట్టించిండు..

పాడెమల్లీ ఆగింది...

మల్లా డ్యాన్సులు మొదలయ్యాయి.. సినిమా టాకీస్‌కాడ వచ్చే పోయ్యే జనాలు. నేను మల్లీ పాడె పట్టాను. "బాగా బరువుగా ఉంది". ఎందుకో శవాలు బరువుగా ఉంటాయంటారు. పైగా యువకుడు కూడా.. పాడెవట్టిన అందరివైపూ జూశాను. వాళ్లు బాగా తాగి ఉన్నారు. కాబట్టే వాళ్ళకు బరువు తెల్సి రాలేదు.

చుట్టూ డప్పులు మోగుతుంటే.. మధ్యలో యువకులు డ్యాన్సులు జేస్తున్నారు. డప్పుల దరువులు పెరిగిన కొద్దీ.. డ్యాన్సుల జోరు పెరుగుతోంది.. అదోపిచ్చిలోకం..

నాకెవరో "రిలీఫ్"నిచ్చారు. నేను తువ్వాలు దులుపుకొని బాలన్న పక్కకు జేరాను.. ఊరేగింపు హైస్కూల్ రోడ్డు పట్టింది. శ్మశానం ఇంకా దూరం ఉంది..

◆◆◆

"ఊ.. చెప్పు.. బాలన్నా.. అయితే ఈ పెద్దసార్లు.. అక్క దగ్గెర గూడ బత్కనీయకపోయిరా? – మళ్లా అడిగాను.

"అక్కదగ్గెరగాదు బావా... నీవు బొక్కల దాక్కున్నా ఇడువరు.. గీమొత్తం భూమండలం మీద యాడ దాక్కున్నా ఆల్లు బతుకనీయరు.. పట్నంబోయిండు బులావ్... కరీంనగర్ వోయిండు... బులావ్..బొంబాయి వోయిండు... బులావ్.. పల్లెలు దిర్గిండు.. పట్నంల దిర్గిండు... బులావ్.. బులావ్.. బులావ్.. ఆడు బంగారుబాతు... ఎట్లుఇడుస్తరు చెప్పు.. పైగా దిక్కుమొక్కలేనోడు... చదువుసంధ్యలేనోడు."



"పెద్దయినాంక కేసులు జేసెటోల్లా?"

''ఊ.. ఎందుకు జేయరు? దొంగసొమ్ము దెచ్చిఇచ్చినాంక ఇడ్సిపెడ్తే బద్నాంగారూ? సొమ్ములకు సొమ్ము మింగుతుర్రి... కేసులకు కేసులయితుండె... అయితే.. సిన్నకేసులు వెడుతుర్రి... కొన్నాల్లు నిజమాబాద్ జైల్లగూడ ఉండొచ్చె.. మొన్ననే వొచ్చిండుపోరడు. ఏం లంచం బోసిర్రోగాని... కొన్ని దినాలు... ఈ అయ్యలు ఆని జోలికిరాలె.."

"అయితే గండం గడ్సిందన్నమాట."

"ఆ.. ఒకగండం గడ్సింది. ఇంకో గండం మెదలయ్యింది"

"అదేం గండం?"

"ఆనికి" పెండ్లం గండం" వట్టింది"

"అంటే?"

"పెండ్లామ్ ఈన్కి గండమయి కూసుంది"

"ఎట్ల?"

"ఎట్లంటే. ఈన్కి దొంగ అని పేరువడ్డదిగదా.. పిల్లనెవ్వరిస్తరు..? ఆఖరికి లారెంట రాయచూర్‌పోతే, ఆడోపిల్లను జూసిండట.. ఇద్దరు ఇష్టపడ్డరు.. పెండ్లిజేసుకున్నరు. కులం దెల్వదు.. తలం దెల్వదు.. అక్కడ్నెగ్గెరికి వొయినాంక. సెరోపనిల వెట్టింది.. నాల్గు దినాలు మంచిగనేగడ్సినట్టాయే.. మధ్యన పోరడు ఫట్‌మన్నడు."

"అంటే కొంపదీసి.. వొచ్చిన పెళ్ళాం.. ఏమన్నా జేసిందా..ఏం?

"అదే..గాపెండ్లామే పానం దీసిందంటరు. పెండ్లయిన రెండు మూడు రోజులకు అయ్యలొచ్చి పట్క పోయిర్రు. పెండ్లయ్యిందన్న ముద్దూ ముచ్చట లేకపాయె. మెత్తగా జేసి పంపిర్రు.. ఇట్ల రొండుమూడు సార్లయ్యింది. గాపిల్ల ఏమనుకున్నదో ఏమో.. ఈనితోటిగాదనుకున్నది.. ఇంకోన్కి మరిగింది. ఈడికి ఆసంగతి దెల్సింది? ఇంకేముంది. పట్టుకోవోయిండు... చెట్టుకుశవమై తేలిండు... బంగారమసొంటిపోరడు.. దిక్కలేని సావు జచ్చె..!"

"మరి ఆపిల్ల?"

"రాత్రికి రాత్రే ఆణ్ణిదీస్కొని ఫరారయ్యింది"

◆◆◆

పాడెశ్మశాన వాటికవైపు మళ్లింది..

కుడివైపు అగ్రవర్ణాల దహన వాటిక..

ఎడంవైపు నిమ్నకులాలవాల్ల శ్మశాన వాటిక

దహన వాటికకు చక్కటి సిమెంటు రోడ్డు ఉంది.. మధ్యలో చక్కటి బోర్ ఉంది. చక్కటి విశాల ప్రాంతంలో పటిష్టంగా ఉందా దహన వాటిక... ఎంతయినా.. బతుకులోనూ.. చావులోనూ.. వాళ్లు సుఖజీవులే...

ఎడమవైపున్న శ్మశాన వాటిక చూడ్డానికి దుర్భరంగా ఉంటది. చాలా ఇరుకైన స్థలమది. ఒకరిబొందతీసి.. మరొకరిబొంద పెట్టే పరిస్థితి. అక్కడక్కడా శిధిలమైన పుర్రెలూ, ఎముకలూ కనబడ్తుంటాయి. వాటిని పక్కకు దీసేసి అంత్యక్రియలు జరిపేస్తారు. ఇది చాలదన్నట్లు ఇక్కడికి రావాలంటే ఓ పెద్ద మురికి కాలవ దాటుకుని రావాలి. వాళ్లది బతకులోనూ, చావులోనూ పెనుగులాటేనాయె.

దింపుడుగల్లం దగ్గర పాడె ఆగింది. పాడెచుట్టూ తిరుగుతూ కుండలోని పసుపు అన్నం చల్లింది తల్లి... అతని దగ్గర దింపుడుగల్లం ఆశ (బంగారం) లేనందువల్ల... తిరిగి పాడెనెత్తుకొని బొంద దగ్గరకి నడిచేరు...

◆◆◆

మిట్టమధ్యాహ్నం... ఎండ పగవాడిలాగ విజృంభిస్తోంది.. ఎటుజూసినా.. పిట్ట పిసుక్కుమనడం లేదు. భయంతో బిగుసుకు పోయిన పిల్లాడిలా.. ఆకులు అల్లాడడం లేదు. ఎక్కడో ఓ కాకి అరుచుకుంటూ పోయింది.

తల్లి కుండనిండా నీళ్లు దెచ్చింది.. ఒక్కొక్కచుట్టూ తిరుగుతూ ఉంటే.. వెనక బ్యాగరి సీకుతో బొక్కలు పొడుస్తున్నాడు. అయిదుచుట్లయి పోయింది. ఇక శవాన్ని బొందపెట్టడమే తరువాయి.

"మనసుట్టాలొస్తున్నార్రా?" అన్నారెవరో వ్యంగ్యంగా.. అటు జూస్తే ముగ్గురు పోలీసులు.. " ఏయ్...ఆగండ్రా" అంటూ హడావిడిగా బొందదగ్గరకి వొచ్చారు. ఆ సమయాన అక్కడున్న వాళ్లకి ఓవిధమైన భయమూ, ఆశ్చర్యమూ కలిగాయి.. ఈ సమయాన... ఈడికి పోలీసులెందుకొచ్చినారబ్బా? అంటూ ఊపరి

బిగబట్టుకొని ఎక్కడి వాళ్లక్కడ నిల్చిపోయారు..

"ఏయ్... ఈడికి గావల్సి నోల్లెవర్రా?" ఓ గారపల్ల పోలీసు ప్రశ్నించేడు...

"ఎందుకుసారూ?" తల్లి అడిగింది అసహనంగా..

"పనుంది... నువ్వేంగావాలె ఈసచ్చినోడికి? మరో పోలీసు రెట్టించాడు..

"నేను తల్లిని." చెప్పిందామె..

"ఓ.. నువ్వేనా తల్లివి.. నీకొడ్కుతెచ్చిన బంగారం యాడ దాసినవే? ఇరవైతులాల బంగారం దొంగిలించిండని.. అది మీదగ్గరనే ఉన్నదని మాదగ్గర రిపోర్టున్నది... గా సంగతి దేలాలే.." మరో యువపోలీసు అసలు విషయం జెప్పాడు.

"బంగారమా... మాకా బంగారం దెల్వదు.. రాగిదెల్వదు.. ఈని బొంద ఖర్చులకే... కన్నోని కాల్లువట్టుకున్నసారూ... గా బంగారమే ఉంటే... గీ తకిలీబు ఎందుకువద్త సెప్పున్రి..." అంటూ కళ్లనీళ్లెట్టుకుంది తలి.



"ఏయ్ముసల్దానా... గదంత దెల్వదు.. బంగారంగావాలె... మాసారు జెప్పిండు.. అస్సలు మిమ్ములను దవాఖాన్లకెల్లి శవాన్ని ఎవడు దెమ్మన్నడే... లంచమిచ్చి ఎత్తుకొచ్చిన్రు. కేసుపెడ్తం ఖబడ్దార్.. ఆడుదొంగసొమ్ము దెచ్చి మీకిచ్చినట్టు.... మాకు పక్కాదెల్సు..లం..క తల వడొద్దు.. సంగతి దేలకాపోతే ఈనెంబడే మీరు గూడ పాడెక్కుతరు. "అంతదాంక శవాన్ని ముట్టేదిలేదు." అని ఖరాఖండిగా జెప్పి ఓ చెట్టు నీడన కూచున్నారు వాళ్లు...

వాళ్లకేమీ తోచటం లేదు. లేని బంగారమడ్గుతున్నారు.. "ఎక్కడ్నుంచి తీసుకురావాలె?" అని తర్జన భర్జన పడ్తున్నారు. డబ్బులన్నా ఇద్దామంటే... ఎవనిదగ్గరా ఏమున్నాయనీ?

ఎండమండుతున్నది... ఆకలి మండుతున్నది... విపరీతమైన అలసట. ఈ తతంగమేదో అయిపోతే.. ఇంత చాయనన్న దాగుదామనుకుంటే.. మధ్యన వీళ్లు సైంధవుల్లాగ వొచ్చిపడ్డారు.

"మరెట్ల సారూ?" ఒకామె గట్టిగానే అడిగింది

"గీబొందకాడ గూడ గిట్లజేస్తే మేమేగావాలె సారూ.. సావాల్నా... బతుకాల్నా... గాముసల్దాని ముఖం జూసన్నా... గీ పని గానియ్యున్రి" – ఇంకో ముసలాయన వేడుకున్నాడు".

"బతికినప్పుడు బత్కనియ్యకపోతిరి – సచ్చినపుడు బొందగూడ పెట్టనిస్తలేరు.. గిదేం న్యాయం సారూ?" ఇంకో స్త్రీ అడిగింది.

"ఏయ్... మాటలు జాస్తిగొస్తున్నయి.. ఈడు బంగారం దెచ్చి మీకిస్తే.. మీరు ముర్సుకుంట దిరిగితే... మేం కేసులకోసం దిరుగాల్నా? యాడదాచిన్రో... తీసుకురాన్రి... అంతదాంక ఈ తంతు జరుగనిచ్చేది లేదు." ప్రశ్నలేసి విక్రమార్కుడు చెట్టెక్కినట్టు వాళ్లు మళ్లీ చెట్టునీడను జేరారు..

◆◆◆

పేదోల్లకు పెద్ద సంకటమేవొచ్చిపడ్డది... నిజానికి వాళ్లకు ప్రతిచిన్నదీ.. పెద్ద సంకటమే.. లేని బంగారం ఎక్కడ దేవాలో అర్థంగావటం లేదు... లేదా పెద్ద మొత్తంలో డబ్బులు ముట్టజెప్పాలె"

పాడెమీద శవం అట్లాగే ఉంది.. అందరూ అసహనంగా మాట్లాడేస్తున్నారు. ఎండమాడిపోతోంది.. ఎండకన్నా ఎక్కువగా వాళ్ల గుండెమండుతోంది.. డబ్బిస్తేగాని.. వాళ్లుకదలరు.. కదిలితేగాని.. శవాన్ని పూడ్చేవీల్లేదు. ధర్మసంకటమేదో వొచ్చిపడ్డది...

కొందరు యువకులు ముందుకొచ్చి "పూడ్చిపెడ్దాం... ఏంజేస్తారో చూద్దాం" అన్నారు. పెద్దలు వారించారు – వాళ్ల కాసేపు పోలీసోల్లతో రగడాయించుకున్నారు. ఏదీతేలేట్టులేదు. అవతలవాళ్లుకదిలేటట్టులేరు. పోలీసువాళ్లకి "దింపుడుగల్లం" ఆశబాగానే ఉన్నట్టు వాళ్లను చూస్తోనే తెల్సిపోతుంది.

◆◆◆

వొదిలించుకోవాలి... వీళ్లను వొదిలించుకోవాలి... లేని బంగారం తెచ్చేటట్టులేదు... కోరుకున్న డబ్బు ఇచ్చేటట్టులేదు. శవాన్ని ముట్టేటట్టులేదు. అంతావిసుగ్గా, అసహనంగా ఉంది... చూసి చూసి వేసారి కొచ్చిన కాకి ఎక్కడికో ఎగిరిపోయింది.

దగ్గర్లో ఉన్న ఎముకల్ని కట్టెతో పక్కకు జరిపి... చెట్టునీడన గూచున్నాడు గొల్లబీమడు... వాడికీ ఏం తోచటం లేదు... తొందరగా ఇంత మన్నేసి పోదామంటే... వీళ్లు సైంధవుల్లాగ దాపురించారు. చనిపోయిన మనిషి తనకు దగ్గరి చుట్టంకూడా... తనతో చాలా స్నేహంగా ఉండెటోడు... ప్రతి దసరా పండుగకు తనకు 'జమ్మి' ఇచ్చి అలయ్‌బలయ్ దీసుకునెటోడు.. పైగావాని చావుకు వీళ్లేకారణం గదా... ఇంకా ఎంతకాలం?

ఏమితోచక... ఎందుకోవాడు చెట్టుపైకి చూశాడు. చెట్టు కొమ్మల్లో ఒకచోట తేనెతుట్టె కనిపించింది. దానిసైజుని బట్టి అదిపెద్ద తేనెతుట్టె అని వాడికర్థమయిపోయింది. వాడికది తుట్టెలాగా కాక అదేదో వటాలం లాగ అన్పించింది. అనుకోకుండా జేబుతడుముకున్నాడు. జేబులో గులేర ఉంది. వాడికి మెరుపులాంటి ఓ ఆలోచన వొచ్చింది. దాన్ని రహస్యంగా పక్కవాడికి చేరవేశాడు. సంకేతం అందరికీ అందిపోయింది. అందరి కళ్లూ అదోరకంగా మెరిశాయి. అందుకు అనుగుణంగా అందరూ తయారయ్యేరు.

◆◆◆

మాట్లాడుతున్న వాళ్లంతా నిశ్శబ్దమయ్యేరు. ఆడాళ్లంతానెత్తిన కొంగేసుకున్నారు. జరుగబోయేది అర్థం చేసుకున్న మగాళ్లు నెత్తిన తువ్వాలో చేతిరుమాలో వేసుకున్నారు. అంతదూరాన ఎవరో గడ్డితో మంటరాజేశారు.

అందరూ ఏదోయుద్ధానికి సిద్ధమయినట్టున్నారు. ఓసారి పోలీసులు వైపు జూశారు. వాళ్లు ఇవేమీ పట్టించుకునే స్థితిలోలేరు. ఏవో జోకులేసుకుంటూ... పడిపడి నవ్వుతున్నారు.

◆◆◆

గొల్లభీమడు చురుగ్గా కదిలాడు... వాడు చక్కటి గురేటికాడు... ఇప్పటి దాంక జూసి కొట్టిందేదీ ఫెయిల్‌గాలేదు... చిటారు కొమ్మన్న మామిడిపండును గొట్టి అది కిందపడకముందే "క్యాచ్" పట్టగలడు..

మెల్లగా ఒక్కొక్కరూ జారుకుంటుంటే... మెల్లిగా వాడు చెట్టుచాటుకు వెళ్లాడు. మెల్లిగా మూత్రం పోస్తున్నట్టుగా నటించి... గులేర్ చేతిలోకి దీసుకున్నాడు. "రయ్"మని గులకరాయి తేనెతుట్టెను తాకింది...

క్షణంలో దృశ్యం భీభత్సంగా మారింది. ఒక్క ఉదుటున తేనెటీగలు పైకి లేచాయి. ''ఝయ్ ఝయ్''మని అవి మనుష్యులమీద పడ్డాయి... వాళ్లా సన్నివేశానికి అప్పటికే సిద్ధమై ఉన్నారు. ''వొచ్చెరా... వొచ్చెరా...'' "ఉర్కుండ్రా... ఉర్కుండ్రా..." అని అరుస్తూ తలో దిక్కుపరుగులు దీశారు. ఆడవాళ్ళు దగ్గరున్న గుడిసెలోకి వెళ్లి తలదాచుకున్నారు. కొందరు నీటిమడుగులోకి దూకారు. కొందరు మంట దగ్గరిజేరారు... ముసలోల్లు ముడిగోల్లు అప్పటికే అక్కడున్న గుడిసెల తల దాచుకున్నారు.



◆◆◆

అంతారెప్పపాటు కాలం!

పిచ్చెక్కిన తేనెటీగలు పోలీసులమీద పడ్డాయి. వాళ్లకు విషయం అర్థమయ్యేలోపున...అందిన చోటల్లా కుట్టడం మొదలెట్టాయి.. అసలవి ఎంతకోపంగా ఉన్నాయంటే ఈ బీదజనాలే తేనెటీగల్లోకి పరకాయ ప్రవేశం జేసి కుడుతున్నాయేమోనన్నట్లున్నాయి. వాళ్లు మఫ్టీలో ఉన్నారు. ఇక అవి ఇష్టారాజ్యంగా కుట్టిపడేశాయి. ఒకడి బట్టతలమీద... ఐదారు తేనెటీగలు సూదులు గుచ్చినట్టు గుచ్చాయి. ఎవరో తన కపాలాన్ని పైకి లేపుతున్నట్టుగా భయపడ్డాడట...

పత్తిచేనుకు అడ్డం పడి పరుగెత్తు తున్నారు. తేనెటీగలు మాత్రం విడిచిపెట్టడం లేదు. ఒకడు పత్తి చెట్టు పీకిగిరగిరా తిప్పాడుగాని... అతడినీ వొదిలిపెట్టడం లేదు.

అసలేవాళ్లు సిటీలో పుట్టిపెరిగినోళ్లు.. ఇట్లాంటి సంకట పరిస్థితిని ఎదుర్కోవడం వాళ్లకు ఎంతమాత్రం తెలియదు.

దూరంగా గమనిస్తున్నవాళ్లకి ఇదంతా విడ్డూరంగా అనిపించింది. సాధారణంగా పోలీసులు వెంటబడితే... తాము పరుగెత్తడం తెల్సు. కాని ఇలా తేనెటీగలు వెంటబడితే వాళ్లు ఉరకడం వాళ్లలో ఏదో ఆనందం కల్గించినట్టుంది - వాళ్లలా పరెగెడ్తుంటే.. శవం కూడా నవ్వుతున్నట్టుంది. మొత్తం మీద ప్రజలు చెయ్యలేని పనిని తేనెటీగలు జేశాయి.

పాపం... వాళ్ల పరిస్థితి దయనీయంగా తయారయింది. ముఖాలకు, కాళ్లకు చేతులకు బెందులొచ్చి.... వాళ్లు అన్నిరకాల నరకాల్ని ఏకకాలంలో చూసినట్టుగా తయారయ్యేరు. పారిపోయి... ఆపసోపాలుపడుతూ... ఎప్పుడు ఊరు చేరారో వాళ్లకే తెలీదు.

◆◆◆

మంటపొగకు తేనెటీగలు పారిపోయాయి... చుట్టూ లేచిన మంటపొగలే రక్షణగా వాళ్లు శవాన్ని పూడ్చిపెట్టారు.

తల్లికళ్లలో ఓ వింతతృప్తి!

జీవితంలో తనూ.. తనకొడుకూ... తనవాళ్లూ... చేయలేని పనిని ఈ తేనెటీగలు చేయగలిగాయి. నిజానికి తనకంటూ ఓ జన్మ ఉంటే.. తేనెటీగగా పుట్టి... ఇట్లాంటికుట్టే అవకాశాన్ని ఇవ్వాలని దేవుణ్ణి మనసారి కోరుకుందావె. అందరికళ్లలోనూ ఓవిధమైన ఆనందం.. జీవితంలో మొట్ట మొదటసారిగా వాళ్లు పారిపోవటంజూశారు...

◆◆◆

బయల్దేరడాన్కి అందరూ సిద్ధమయ్యారు..

''మనకన్నా గీ తేనెటీగలే నయంరా..." అన్నాడు బాలయ్య తువ్వాలు దులుపుకుంటూ...

"ఔన్రా.. మనమేమొ అందర్నిజూసి భయపడుతం... గీల్లేమొ తేనెటీగలజూసి భయపడ్డరు" అన్నాడు కుర్వశీను.

"అవ్‌మల్ల... ఎట్లయినజెప్పున్రి... మనం గూడ సమయమొస్తే గీ తేనెటీగలోలె తయారు గావాలె... కొడకులను కుట్టికుట్టిపడెయ్యాలె..." నవ్వుతూ అన్నాడు మంగలి సాయన్న.

''అవున్రా... నీవన్నదీ కరెక్టే.. తప్పుజేస్తె తలొంచుకోవాలె.. లేకుంటే ఎవడన్నా మీదికొస్తే... ఆనమ్మ. మనం గూడ తేనెటీగలం గావలె" - అన్నాడోయువకుడు"

"ఔనౌను.. లేకపోతే.. మనబత్కుగూడ... గీసచ్చినోని తీర్గ కుక్కలు జింపిన ఇస్తరయితది" - మరోయువకుడందుకున్నాడు"

మొత్తం మీద వాళ్లకు తేనెటీగలు మోక్షప్రదాల్లాగ అన్పించాయి. దిక్కూ మొక్కు లేని జనం తరపున అవి నిలబడి యుద్ధంజేసి గెలిపించినట్టుంది.

అందరూ గొల్లభీమని "గురి" నిమెచ్చుకున్నారు... వాడు తనజేబులో చేయిపెట్టుకున్నాడు.. గులేర్ వెచ్చగా తగిలింది...

## కవిత

# చివరి చూపు

డా॥ లంకా వెంకటేశ్వర్లు
9493890138

శవపేటికలో నిన్ను చూసినపుడు
నన్ను నేను చూసుకున్నట్టుంది
నీ కనుకొలకుల్లో ఘనీభవించిన చివరిచూపు
ఇప్పటికీ నన్ను వెంటాడుతోంది

కనులు పట్టని కల్లోల దృశ్యాల్ని
గుండెలో దాచుకుని చిరునవ్వుతో మూతవేశావు
నీకెన్ని గుండెలు
బిపి షుగరుల అణువిస్ఫోటనాన్ని
ఏ కన్నీళ్లు చల్లార్చగలవు

భుజాలపై చేతులేసుకొని కాడికింద నువునేను
ఎంత దు:ఖాన్ని దున్ని ఎన్నెన్ని సరదాలు
సాగు చేసుకున్నాం పోగు చేసుకున్నాం
ఇరవై ఏళ్ళ పాటు బాల్యపుటెండల్ని
కాచివడబోసుకున్నాం



పగలంతా ఆకాశాన్ని తెరిచి
ఆటపాటలతో కాలాన్ని కొలిచేవాళ్ళం
పలకల కొలనులో నల్లబల్ల వెన్నెలకురిసినా
బయట ఎండల్ని తాగి దాహం తీర్చుకునే వాళ్ళం
బడిలో ఉన్నన్ని గంటలు

బడిగంట వైపే మన చూపు నిలిపేవాళ్ళం
మనం నడుస్తున్నపుడు పొలంగట్టు

వళ్ళు వెదల్పు చేసుకునేది
దాహంతో చెరువులో వంగినపుడు
మన రెండు ముఖాల్ని ఒకే అల కడిగేది
తొలి వసంతానికి మొలకెత్తిన మొటిమలు
అద్దంలో చిట్లినపుడు ఒకే కల కలవరపెట్టేది

మనల్ని వేరు చేసి చూడాలనే
ఎందరో సూర్యుళ్ళను
మన నీడ ఒక్కటై వెక్కిరించేది
ఆకలి అలసట ఒకటైనపుడు
ఒక టీ రెండు గ్లాసులయ్యేది

నేలపై పాదం మోపినపుడే
ఉనికి రూపు కడుతుంది
మనం నేలగా మారి
నలుగురి కన్నీళ్ళతో తడిసినపుడు
ఉనికి జ్ఞాపకాల చెట్టవుతుంది
ఆకాశాన్ని పొదివిపట్టుకున్న చెట్టుకి
నీడగా మారి పదిమందికి పంచినపుడు
అది సెలయేరవుతుంది
నువ్వునేలగా మారి నాలో చెట్టుగా వ్యాపించావు
నన్ను సెలయేరును చేశావు.
*(ప్రాణ మిత్రుడు కళాచంద్రశేఖర్ స్మృతికి)*

---

# చల్తే చల్తే మేరే యే గీత్ యాద్ రఖ్ నా!

మామిడి హరికృష్ణ
9908844222

ఏదో ఓ ఘడియన
ఆకులన్నీ చెట్టుకి అల్విదా చెప్పి
భూమి పొరల్లో కన్నెప్పులని వాల్చేసి
మట్టిగా రూపాంతరిస్తాయి

ఆ నిర్దయ నిమిషాన్నే
ఎక్కడో ఏ చెట్టు నీడనో
ఖండిత హృదయం వెక్కి వెక్కి దిగులు పడుతుంది
ఎక్కడో ఏ గోడ చాటునో
ఒక దుఃఖిత నీడ సూర్యున్ని ఆవిరి చేస్తుంది
ఎక్కడో ఏ వాడ మలుపునో
ఒక అవాంఛిత అడుగు జాడ సముద్రాన్ని దిగమింగుతుంది
ఎక్కడో ఏ మేడ మెట్లనో
ఒక అస్ఖలిత జ్ఞాపకం జారిపడి తల బద్దలు చేసుకుంటుంది
ఎక్కడో ఏ ఎడారి తీరాన్నో
ఒక జ్వలిత గాయం ఇసుక తుఫానై సుళ్ళు తిరుగుతుంది
ఏదో ఒక ఘడియన
చినుకులన్నీ మబ్బులకి అల్విదా చెప్పి



గాలి జారుడుబండలోంచి
నేల పైకి దూకేస్తాయి

ఆ దయార్ద్ర సమయాన్నే
ఎక్కడో ఏ తడారిన గొంతుల్లోనో
ఒక వ్యధిత స్వరం పాటై ఎగురుతుంది
ఎక్కడో ఏ శిశిర కొమ్మ కళ్ళలోనో
ఒక వసంత పుష్పం పల్లవిస్తుంది
ఎక్కడో ఏ క్షతగాత్ర యుద్ధ భూమిలోనో
ఒక నిశాంత శాంతి వెన్నెలలా కురుస్తుంది
ఎక్కడో ఏ బెంగపడిన గుండెల్లోనో
ఒక హరిత స్పందన కొత్త జీవితమై పుడుతుంది

చల్తే చల్తే మేరే యే గీత్ యాద్ రఖ్ నా
ఇరు ఘడియల అంచుల దాకా వ్యాపించిన
కాలం నువ్వు
రెండు అల్విదా ల మధ్య పెండ్యులం
నేను...... !

## పరిశీలన

# తెలుగు మాండలిక పదసేకరణ విధానం - అనుభవాలు


డా.యస్.చంద్రకిరణ్

9703311304




**తెలుగు భాషా పరిరక్షణలో భాగంగా తెలుగు విశ్వ విద్యాలయం చేపట్టిన ఈ ప్రాజెక్టులో క్షేత్ర పరిశోధకునిగా పనిచేయడం నాకు దక్కిన అత్యంత గౌరవం. సేకరించిన పదాలను జిల్లాలవారీగా మాండలిక పదకోశాలను చేయవచ్చు, ప్రాంతాలవారీగా తులనాత్మక పదకోశాన్ని నిర్మించవచ్చు అంతేగాకుండా రికార్డు చేసి సేకరించిన జానపద గేయాలను, మనిషి జీవన చక్రాన్ని, ఆచార వ్యవహారాలను అంతర్జాలంలో ఉంచినట్లయితే పరిశోధకులకు ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుంది.**

**భా**వ వ్యక్తీకరణకు ఉపయోగపడే అర్థవంతమైన కంఠధ్వనుల సముదాయమే భాష. మాండలిక భాష అంటే ఒక మండలం లేదా ప్రాంతంలో మాట్లాడే భాష అని అర్థం. ప్రపంచీకరణ, కంప్యూటరీకరణ వంటి ప్రక్రియలలో దూసుకుపోతున్న మానవ జీవన విధానంలో భాషలో కూడా మార్పులు చోటుచేసుకుంటాయనే చెప్పాలి. జీవద్భాషకు మార్పు అనేది సహజంగానే వస్తుంది. ఈ మార్పు వల్ల భాషలో బహురూపత, వైవిధ్యాలు ఏర్పడతాయి. ఈ విధంగా ఏర్పడ్డ భాషావైవిధ్యాలను/భేదాలను మాండలికాలు అంటాం. భాష ఏదైనా దానికి మౌలికమైన, మూలమైన సంభాషణా విధానం ఒకటుంటుంది. రాష్ట్రాలలో పల్లె జన పదాలెక్కువ. వాటిలో జన సందోహం స్వతస్సిద్ధంగా, అనుశ్రుతంగా వస్తున్న పదాలతో, వాక్యాలతో మాట్లాడుకుంటారు. ఆ మాటలకు నగ్న స్వరూపాలు, నగిషీలూ, అలంకరణలూ వుండవు. ఆ స్వరూపం పల్లెల్లో వీచే పైరగాలంత స్వచ్ఛంగా, మధురంగా వుంటుంది. తెలుగు భాషనే తీసుకొంటే ఒక్కో జిల్లాకు ఒక్కో మాండలికం వుంది. భాష లిపి, తీరు ఒకటే అయినప్పటికీ మాటల తీరు వేరువేరుగా ఉంటుంది. ఇలాంటి తీరును 'మాండలికం' అంటారు. భాషలో మొదట ఉండేది మాండలికమే. ఒకే భాషకు చెందిన భిన్న భిన్న ప్రాంతాలలోని భేదాన్ని మాండలికాలుగా పిలుస్తారు. ప్రతి రాష్ట్రానికి ఉండే ప్రధాన భాషకు ఆ రాష్ట్ర మండలాల్లో మాట్లాడే భాషకు కొంత వ్యత్యాసం ఉంటుంది. కాబట్టి మాండలిక భాషను ఉపభాష లేదా ప్రాదేశిక భాష అనవచ్చు. భాషలో ధ్వనుల ఉచ్చారణ, వాక్యనిర్మాణం, వ్యాకరణ నిర్మాణం, పదజాలం, వాక్య ఉచ్చారణలో ఎన్నో ప్రాంతీయ భేదాలు ఉంటాయి. చారిత్రకంగా ఒక మాటకు మండల భేదాన్ని బట్టిగానీ వర్గ భేదాన్ని బట్టిగానీ వ్యవహర్తల ఉచ్చారణలో ఏర్పడ్డ రూప భేధాలను మాండలికం అంటారు.

మాండలిక నిఘంటువులు వచ్చినపుడే సంపూర్ణ దేశ్య నిఘంటు నిర్మాణం సాధ్యమవుతుంది. భావప్రకటనకు భాష ముఖ్యమైతే – ఆ భాషకు ప్రాణం మాండలికం. ఇదే అసలైన తెలుగు. మాండలికాలు భాషకి సజీవ చిహ్నాలు. మాండలిక పదాల స్వరూపాలవల్ల ప్రాచీన కావ్యాల్లోని కొన్ని పదాలకు స్పష్టంగా అర్థనిరూపణ చేసే వీలు కలుగుతుంది. ఎందుకంటే ప్రాచీన కవులు ఎంతటి ఉద్ధండ పండితులైనా సందర్భోచితంగానో, కావాలనో, ఛందస్సు కోసమో. కారణమేదైనా మాండలికాలను ప్రయోగించారు. తెలుగు అకాడమీ జిల్లాలవారీగా మాండలిక వృత్తి పదకోశాలను ప్రచురించింది. డా.అక్కిరాజు రమాపతిరావు సంకలనకర్తగా తెలుగు అకాడమీ 1985లోనే 'మాండలిక పదకోశం' ప్రచురించింది. అయితే ఈ కృషి కొనసాగకుండా ఆగిపోయింది. పైగా మాండలికాలంటే తెలుగులో నాలుగే వున్నాయన్న అభిప్రాయం స్థిరపడింది. ఎపుడో కోస్తా, తెలంగాణ, ఉత్తరాంధ్ర, రాయసీమ మాండలికాలని వర్గీకరించారు. ఇవాళ ఇదే నిశ్చయం కాదు. కోస్తాలో గోదావరి మాండలికం వేరు, గుంటూరు మాండలికం వేరు. రాయలసీమలో చిత్తూరు, కడప మాండలికాలు వేర్వేరు. ఇలా

ఇంకా లోతుగా అధ్యయనం చేయవలసివుంది. మన తెలుగు పదాలు చాలా పదాలు నిఘంటువులోకి ఎక్కలేదు. ముఖ్యంగా ఈ పల్లెటూళ్ళలో చాలా చిన్న చిన్న కులాల్లోనూ, వృత్తుల్లోనూ మాట్లాడే వాళ్ళ పదాలు కొన్ని విస్మరించబడ్డాయి. క్షేత్ర పర్యటనకు వెళ్ళినపుడు అక్కడి ప్రజలు ఎన్ని రకాల చేపలు, పక్షుల పేర్లు చెప్పారు. మట్టగిడిస, కొర్రమేను, బొమ్మిడాయి, శీలావతి, గొరక, ఇంగిలాయి, జల్ల, బొచ్చ, జడ్డువాయి,చేదుపరిగె, వాలుగ, పండుకప్ప, గండిబొడిగి, కొయ్యంగ, మునగపాము, గుడగ్గాయి, చామరాయి, పొట్టిదిలాసు, కట్టినెరసు, బుడపార,చాకిరొయ్య, గడ్డికొయ్య, మాలతప్పడాలు, ఏటిజల్ల, మార్పులు, పల్లెంకాయ, పాలజల్ల, పారాటాయి ఇలా ఎన్నో పేర్లు. అనునిత్యం చేపలు పట్టుకుంటూ ఈ చేప ఇది, ఈ చేప ఇది అని దాని నిర్మాణాల్ని బట్టి దానికి పేరు పెట్టుకున్నారు. అలాగే పక్షుల పేర్లు పరజ, ఆసాబాతు, కళాయి, చేతేనబాతు, నల్లముక్కలు, సముద్రపు చిలక, నత్తకొట్టుడు ఇలా చాలా ఉన్నాయి. ఈ భాషా పదాలు ప్రజల వ్యవహారంలో ఉన్నపుడు ఇవన్నీ నిఘంటువుల లోనికి చేరవలసిన అవసరం ఉంది. తెలుగు భాష మరింత సుసంపన్నం కావాలంటే మామూలు ప్రజల భాషల్లోంచి పదాలను తీసుకొని ఒక మహానిఘంటువును తయారు చేయాల్సిన అవసరం ఉంది.

> **పక్షుల పేర్లు పరజ, ఆసాబాతు, కళాయి, చేతేనబాతు, నల్లముక్కలు, సముద్రపు చిలక, నత్తకొట్టుడు ఇలా చాలా ఉన్నాయి. ఈ భాషా పదాలు ప్రజల వ్యవహారంలో ఉన్నపుడు ఇవన్నీ నిఘంటువుల లోనికి చేరవలసిన అవసరం ఉంది**

నేటి అవసరాల దృష్ట్యా తెలుగు భాషకు ప్రాముఖ్యత పెరిగింది. శాస్త్ర, సాంకేతిక, పరిపాలన, విద్య, సాహిత్య రంగాలలో తెలుగు వాడుక పెరిగింది. సమాచార సాధనాలు కూడా తెలుగును ఎక్కువగా ఉపయోగిస్తున్నాయి. తెలుగు భాషా వైశాల్యాన్ని దర్శించడానికి, భాషకు ప్రజా జీవితానికి గల పరస్పర సంబంధ పరిణామాలను అవగాహన చేసుకోవడానికి, తెలుగు భాషను ప్రామాణీకరించడానికి, దేశ్య పదజాలాన్ని ప్రమాణ భాషలో పునరుజ్జీవింపజేయడానికి, మాతృభాషలో కొన్ని సామాన్య శాస్త్ర గ్రంథాలు రచించడానికి, వయోజనవిద్యా వ్యాప్తికి తెలుగు పరిసర భాషలతో గల సంబంధాన్ని నిరూపించడానికి మాండలిక పదసేకరణ చేయాలి. వృత్తి మాండలిక పదకోశాలను ఇదివరకే తయారు చేశారు. తెలుగు పద సంపద సంపూర్ణంగా ఉండాలంటే వాడుకలో ఉన్న సామాన్య మాండలిక పదాలను సేకరించి సంపూర్ణ మాండలిక పదకోశం అంతర్జాతీయ ప్రమాణాలతో తయారు చేయడం నేటి అవసరాల దృష్ట్యా అత్యంత ఆవశ్యకం. తెలుగు భాషలోని అన్ని రకాలైన పదాలతో కూడిన సమగ్ర, సంపూర్ణ మాండలిక పదకోశం తయారుచేసి భావితరాలకు అందించాలనే సంకల్పంతో 'తెలుగు మాండలిక పదసేకరణ' అనే ప్రాజెక్టును ఆచార్య కె. ఆశీర్వాదం, ఆచార్య నడుపల్లి శ్రీరామరాజు గారి పర్యవేక్షణతో భారతీయ భాషల కేంద్రీయ సంస్థ (సి.ఐ.ఐ.ఎల్) మైసూరు వారి సహకారంతో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం చేపట్టి పూర్తి చేయడం తెలుగు జాతి గర్వించదగ్గ విషయం.

తెలుగు భాషలోని సొగసు, మాధుర్యం, నాదం, ఆత్మ, ఆత్మీయత, సృజనాత్మకత, మౌలికత, సార్థకత, మట్టివాసనలు ఆవిష్కరించడానికి ఈ మాండలిక పద సేకరణ ప్రాజెక్టు ఎంతగానో ఉపయోగపడింది. భాషకు సంబంధించిన రహస్యాలు ఎన్నో ఈ క్షేత్రపర్యటనవలన తేటతెల్లమయ్యాయి. మన పూర్వీకులు వాడిన, మనకు తెలియని పదాలు, తెలిసినా ఆసక్తి లేక, పదాలకు సరిగా అర్థం తెలియక మరుగున పడిన అనేక పద రత్నాలు ఈ పర్యటనలో బయట పడ్డాయి.

పదసేకరణ విధానం: ఆంధ్రప్రదేశ్ లోని తెలుగు మాండలిక పద సేకరణ కొరకు బహు భాషావేత్తలైన, నిఘంటు నిర్మాణదక్షులైన ఎనిమిది మంది క్షేత్ర పరిశోధకులను ఎంపిక చేయడం జరిగింది. వీరు ఆంధ్రప్రదేశ్ లోని అన్ని జిల్లాలలోనూ పర్యటించి ప్రశ్నావళిని నింపడంతోపాటు సంభాషణలను రికార్డు చేయడం ద్వారా పదసేకరణ చేయటం జరిగింది. భాషలో సజీవంగా ఉన్న సాక్ష్యాలను గుర్తించి ఆయా మాండలికాల వ్యవహర్తలతో భాషను రికార్డు చేయడం జరిగింది. అలాగే అవసరమున్న చోట ప్రతి సన్నివేశాన్ని కెమెరా ద్వారా చిత్రీకరించడం జరిగింది. వృత్తి పరంగా, ఆర్థిక స్థాయి వల్ల, విద్యా పరంగా, వయస్సు రీత్యా భాషలో వచ్చిన వైవిధ్యాలను ఆడియో, వీడియోల ద్వారా కూడా పద సేకరణ జరిగింది.

పదసేకరణకు ఎంచుకున్న సామాజిక వర్గాలు: తెలుగు పలుకుబళ్లతోనే కొత్త తలంపులకు మాటలు కల్పించే శక్తి జానపదుల సొమ్ము. తెలుగు భాషా స్వరూపాన్ని సమగ్రంగా దర్శించడానికి జానపదుల వాడుకలోని మాటలన్నిటిని సేకరించి కోశరూపంలో సంకలనం చేయటంలో ఎక్కువ శాతం యాభై సంవత్సరాలు పైబడినవారినే వ్యవహర్తలుగా ఎంపిక చేయడం జరిగింది. అధిక సమాచారం సేకరించడం కొరకు వివిధ కులాలవారు, వివిధ మతాలకు చెందిన వారు, స్త్రీలు, పురుషులు, చదువుకున్నవారు, చదువు లేనివారు,

బాలురు, బాలికలు, ద్విభాషీయులు, శ్రామిక వర్గాలు, ధనిక వర్గాలు, సాంస్కృతిక వర్గాలు, కళాకారులు, స్వాతంత్ర సమరయోధులు, మైదాన ప్రాంతాలవారు, అటవీ ప్రాంతాలవారు, నదీతీర ప్రాంతాలవారు, సముద్ర తీర ప్రాంతాలవారు, కొండలు గుట్టలలో నివాసముండే ప్రజలు మరియు సామాజిక సాంస్కృతిక అంశాలను పరిగణనలోకి తీసుకున్నాము. మూఢనమ్మకాలు, డ్రామాలు, వీధినాటకాలు, బుర్రకథలు, స్త్రీల పాటలు, జోలపాటలు, లాలిపాటలు, గొబ్బి పాటలు, నలుగు పాటలు, బత్కమ్మ పాటలు, నారేత పాటలు, శ్రామిక గేయాలు, సోదె చెప్పేవారి మాటలు, చిలుక జ్యోస్యం చెప్పేవారి మాటలను రికార్డు చేసి వాటిలో వచ్చే మాండలిక పదాలను సేకరించాలని నిర్ణయించుకున్నాము. ఇరుగు పొరుగు భాషా ప్రాంతాలలో తెలుగుదేశానికి చిరకాలంగా ఉన్న సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక సంబంధాలవల్ల ఆయా భాషలలో ఉండే ఆటలు ఎన్నో సరిహద్దులను దాటి నాలుగు మూలలనుండి తెలుగు భాషలోనికి ప్రవేశించాయి. అందుకనే సరిహద్దు జిల్లాల్లో నివసించే ప్రజల వ్యవహారం వల్ల మిగిలిన ప్రాంతాలకంటే విలక్షణంగా ఉంటుంది కాబట్టి సరిహద్దు గ్రామాలలో కూడా మాండలిక పదసేకరణ చేయడం జరిగింది.

**సరిహద్దు జిల్లాల్లో నివసించే ప్రజల వ్యవహారం వల్ల మిగిలిన ప్రాంతాలకంటే విలక్షణంగా ఉంటుంది కాబట్టి సరిహద్దు గ్రామాలలో కూడా మాండలిక పదసేకరణ చేయడం జరిగింది.**

**క్షేత్ర ఎన్నిక విధానం:** ఆంధ్రప్రదేశ్ లోని అన్ని జిల్లాలలోనూ తెలుగు మాండలిక పదసేకరణ జరిగింది. ఒక జిల్లాను ఎంచుకున్నపుడు ఆ జిల్లాలోని మండలాలను ఎంపిక చేసుకొని మండలంలోని దగ్గరగా ఒక గ్రామం, దూరంగా ఒక గ్రామం ఎంపిక చేసుకున్నాము. ఉదాహరణకు చిత్తూరు జిల్లాను ఎంపిక చేసుకున్నపుడు ఈ జిల్లాలో 66 మండలాలు ఉన్నాయి. ఎనిమిదిమంది క్షేత్ర పరిశోధకులు ఒక్కొక్కరు మూడు మండలాలచొప్పున ఎంపిక చేసుకొన్నాము. మండలాల ఎంపికలో జిల్లా మధ్యలో ఉన్న మండలాలు, జిల్లాలు, రాష్ట్రాల సరిహద్దులలో ఉన్న మండలాలను ఎంపిక చేసుకోవడం జరిగింది. మండలంలోని ఏయే గ్రామాలలో యాస ఎక్కువ ఉందో తెలుసుకుని ఆయా గ్రామాలకు వెళ్ళి పదసేకరణ చేశాము.

**తీసుకున్న జాగ్రత్తలు:** వ్యవహర్త వయస్సు 50 సంవత్సరాలు పైబడి ఉండాలి.

అదే గ్రామంలో పుట్టి పెరిగినవాడై ఉండాలి.

ఇతర ప్రాంతాలలో ఎక్కువకాలం ఉండి మళ్ళీ వచ్చినవారిని పరిగణనలోకి తీసుకోలేదు.

వీలైనంతవరకు వ్యవహర్త మాట ఉచ్చారణ స్పష్టంగా ఉండాలి. పళ్ళు ఉండాలి

వీలైనంతవరకు వ్యవహర్త సమీప నగర సంపర్కం ఉండకూడదు.

సేకరించవలసిన పదజాలం పరోక్షంగా రాబట్టాలి

ప్రత్యేకంగా తయారుచేసిన చార్టులలోని బొమ్మలను చూపించడం ద్వారా పదసేకరణ సేయడం జరిగింది

జీవన చక్రం, ఆచార వ్యవహారాలు, వంటలు తయారుచేసే విధానం, వ్యవసాయం చేసే పద్ధతి, కథలు, జానపద గేయాలు వంటివాటిని రికార్డు చేసి అందులో ఉండే పదజాలాన్ని సేకరించడం జరిగింది.

**ప్రశ్నావళిలో పొందుపరచిన వివరాలు:** గ్రామదేవతలు, దేవతలు, పండుగలు, జాతరలు, ఆటలు-సాధనాలు, చెట్లు (పూల మొక్కలు, పండ్లచెట్లు), జంతువులు (పెంపుడు జంతువులు, క్రూర జంతువులు), పక్షులు (పెంపుడు పక్షులు, నీటి పక్షులు, వలస పక్షులు), రోగాలు (మనుషులకు, పశువులకు, పక్షులకు వచ్చే రోగాలు), క్రిములు, కీటకాలు, శరీర భాగాలు (మనుషులు, జంతువులు, పక్షులు), ఇంట్లో వాడే వస్తువులు (వంటగది, పడకగది, స్నానాలగది మొదలైనవి), వంటలు-చేసే విధానం, (పిండివంటలు, మాంసాహారం, శాఖాహారం), రుచులు, బంధువాచకాలు, అలంకరణ సామగ్రి (పురుషులు, స్త్రీలు), తూనికలు-కొలతలు, సంఖ్యాపదాలు (మనుష్యులకు,వస్తువులకు, జంతువులకు) వృత్తికి సంబంధించిన విషయాలు (వ్యవసాయం, చేనేత, కుమ్మరం, కమ్మరం, వడ్రంగి, చెప్పులు కుట్టడం, తోళ్ళపదును, మేదర, తాపీ, మంగలి, కల్లుగీత, లోహపు నగిషీ, కలంకారీ, వడ్డెర, శిల్పం, గాజుల తయారీ, బెల్లం తయారీ, సున్నం తయారీ, ఇటుకల బట్టీ, పెంకుల తయారీ, నూనె తీయడం, దూది ఏకడం, దూదితీయడం, బొమ్మల తయారీ, వంటలు చేయుడం, బట్టలు కుట్టడం మొదలైనవి), ప్రకృతికి సంబంధించిన విషయాలు (భూమి, ఆకాశం, వాతావరణం), కాలాలు-కార్తెలు, రంగులు, లోహాలు, చారిత్రక ప్రదేశాలు, ప్రయాణ సాధనాలు, తిట్లు, జాతీయాలు, సామెతలు, పొడుపుకథలు, మానవ జీవన చక్రం (పుట్టినప్పటినుండి చనిపోయేవరకు వివిధ దశలలో చేసుకొనే కార్యక్రమాలు), ఆచారాలు, మూఢనమ్మకాలు, ఉప సంస్కృతి, క్రియలు-వాటి అన్వయాలు, చిన్నపిల్లల భాష, భావోద్రేకాలు మొదలైనవి ప్రశ్నావళిలో పొందుపర్చడం జరిగింది.

సేకరించిన పదాలను వృక్ష వర్గ పదావళి(ఆకు

కూరలు, కాయలు, కూరగాయలు, చెట్లు, ఔషధమొక్కలు, దుంపలు, గడ్డలు, ధాన్యాలు, పండ్లు, పూలు), జీవ వర్గ పదావళి (కీటకాలు, కప్పలు, చేపలు, జంతువులు, జంతువుల ఆహారం, జంతువుల రోగాలు, జంతువుల అవయవాలు, పక్షులు, పాములు), మనుష్య వర్గ పదావళి (బంధు వాచకాలు, మనుషుల రోగాలు, శరీర భాగాలు, హోదా తెలిపేవి, తిట్లు), పర్యావరణ వర్గ పదావళి (ఆకాశం, కార్తెలు, కాలాలు, భూమి, రంగులు, లోహాలు), జానపదవర్గ పదావళి (ఆభరణాలు, ఆటలు, దేవతలు, గ్రామ దేవతలు, వాద్యాలు, పండుగలు, జీవన చక్రం), సాంఘిక వర్గ పదావళి (కొలతలు, నాణెములు, ప్రయాణ సాధనాలు, వస్త్రాలు, కులం), వృత్తివర్గ పదావళి (వ్యవసాయం, చర్మకారులు, వడ్రంగం, తాపీపని, కుమ్మరం, మేదరి, కంసాలి, చాకలి, మంగలి, వ్యాయామం, కుస్తీ, చేనేత, కల్లుగీత మొదలైనవి), గృహ-గ్రామ వర్గ పదావళి (ఆహారం, పిండివంటలు, మాంసాహారం, నూనెలు, వెచ్చాలు, రుచులు, వంటపాత్రలు, ఇల్లు-ఇంటిపరిసరాలు, గ్రామం-గ్రామంలో వస్తువులు), భాషావర్గ పదావళి (క్రియలు, నామాలు, విశేషణాలు, అవ్యయాలు, వ్యాకరణ పదావళి, రూపాంతరాలు, జంటపదాలు), సాహిత్య వర్గ పదావళి (సామెతలు, పొడుపు కథలు)గా వర్గాలుగా విభజించి కంప్యూటర్ లో నిక్షిప్తం చేయడం జరిగింది.

ప్రశ్నావళి, నోట్ బుక్, నోట్ ప్యాడ్, టేప్ రికార్డర్, క్యాసెట్లు, వివిధ వర్గాలకు చెందిన చార్టుల ఫైలు, మ్యాపులు, కెమెరా, పెన్నులు, పరిశీలనలో రాసుకోవడానికి చిన్న నోటుబుక్కు మొదలైన సరంజామాతో క్షేత్రపర్యటనకు బయలుదేరేవాళ్ళం. ప్రయాణంలో పక్కన కూర్చున్న వారితో మాటలు కలిపి ఒకవేళ ఆ వ్యక్తి ఆ ప్రాంతానికి చెందిన వ్యక్తి అయితే అనేక వివరాలను అడిగి తెలుసుకునేవాళ్ళం. వారు మాట్లాడేటపుడు వచ్చే పదాలను జాగ్రత్తగా గమనిస్తూ ప్రత్యేకమైన మాండలిక పదజాలాన్ని రాసుకునేవాళ్ళం. బస్సులోని వారి సంభాషణలను వింటూ పదజాలాన్ని రాసుకోవడం జరిగింది. శ్రీకాకుళం జిల్లా మాండలిక పదావళిని సేకరించడానికి బస్సులో వెళ్తున్నపుడు ఒక అబ్బాయి కిటికీ నుండి తల బయటకు పెట్టినపుడు ప్రక్కన ఉన్న అబ్బాయి తల్లి బుర్రొక్కదుద్ది అన్నది. అంటే తల బయట పెట్టకు తలకు రంధ్రం పడుతుంది అనే అర్థంలో వాడింది. మరొక సంధర్భంలో తూర్పు గోదావరి జిల్లా పర్యటనలో బస్సు ప్రయాణంలో కండక్టరు ఒక వ్యక్తికి టికెట్ ఇచ్చాడు. ఆ టికెట్ ను ఆ వ్యక్తి కింద పడేసుకొని నువ్వు నాకు టికెట్ ఇవ్వలేదని కండక్టర్ ను దబాయించాడు. ఆ కండక్టరు అతన్ని బూకరిత్తున్నావేటి అన్నాడు. అంటే అబద్ధం చెబుతున్నావేమిటి అనే అర్థంలో ఉపయోగించాడు. నెల్లూరు పర్యటనల లాడ్జిలో దిగినప్పుడు అక్కడి మేనేజరుకు అడ్వాన్సుగా 500 రూపాయల నోటు ఇచ్చినపుడు పెద్దకాగదం ఇస్తున్నారు నా దగ్గర అన్నీ బందాలే ఉన్నాయి అన్నాడు. కాగదం అంటే నోటు అనీ బంధాలు అంటే నాణేలు అనీ అర్థం అయింది. అక్కడ పనిచేసే వారి దగ్గరి నుండి కూడా సమాచారాన్ని రాబట్టి వాటిలో నుండి మాకు కావలసిన మాండలిక పదాలను సేకరించేవాళ్ళం. గ్రామాలకు వెళ్ళినపుడు ముందుగా సర్పంచిని గానీ స్కూలు ఉపాధ్యాయులను గానీ, ఆ ఊరి పెద్దలను గానీ కలిసి మాండలిక పదసేకరణ గురించి చెప్పేవాళ్ళం. మనం మాట్లాడుతున్న భాష తెలుగే అయినప్పటికీ రాయలసీమ, తెలంగాణ, కళింగాంధ్రలలో వివిధ యాసలతో మాట్లాడుతున్నారు కదా. ఇలా మాట్లాడే పద్ధతిని మాండలికం అంటాం. ఈ పదాలను మన ఊరి పెద్దలను అడిగి రాసుకోవడానికి వచ్చాం. ఒక వస్తువును వివిధ ప్రాంతాలలో వివిధ పేర్లతో పిలుస్తారు. ఉదాహరణకు ఇంద్ర ధనుస్సును కాముదు భీముడు, కాముడిబిళ్ళ, వక్రం, బాణం, కొరుదు, కొర్రు, అరిల్లు, హరివిల్లు, అరివిల్లు, వానవిల్లు, సింగిడి అని అనేక పేర్లతో వ్యవహరిస్తున్నారు. అలాగే గోంగూరను తెలంగాణాలో పుంటికూర అనీ, రాయలసీమలో గోగాకు అనీ, శ్రీకాకుళంలో జనపకూర అనీ, తూర్పుగోదావరిలో గోంగూర లేదా పుల్లకూర అనీ పిలుస్తారు. వీటిని మన ప్రాంతంలో ఎలా వ్యవహరిస్తామో తెలుసుకుందామని వచ్చామని చెప్పేవాళ్ళం. యాభై సంవత్సరాలకు ముందు మాట్లాడిన మన తెలుగు భాష ఇప్పుడు మారింది. ఇక యాభై సంవత్సరాల తర్వాత మాట్లాడే భాషలో మార్పు రావచ్చు. కాబట్టి మన భాషా సంస్కృతులను భావి తరాలకు అందించాలంటే ఇప్పటి మన భాషను గ్రంథస్థం చేసినట్టయితే మనం భావితరాలకు వేలు చేసినవారమవుతామని చెప్పినపుడు వారు బాగా స్పందించి ఉత్సాహంతో మరిన్ని కొత్త సంగతులను తెలియజేసేవారు. పరోక్షపద్ధతి ద్వారా ప్రశ్నలను అడిగి ప్రశ్నావళిని నింపేవాళ్ళం. వ్యవహర్తకు పని ఉంటే వేరే వ్యక్తిని పరిచయం చేసి వెళ్ళేవాడు. తిరిగి అతడు ఆ పని పూర్తి చేసుకొని వచ్చే వరకు అక్కడే కూర్చొని రాసుకొంటుండడం చూసి అతను చాలా ఆశ్చర్యానికి

**నెల్లూరు పర్యటనల లాడ్జిలో దిగినప్పుడు అక్కడి మేనేజరుకు అడ్వాన్సుగా 500 రూపాయల నోటు ఇచ్చినపుడు పెద్దకాగదం ఇస్తున్నారు నా దగ్గర అన్నీ బందాలే ఉన్నాయి అన్నాడు. కాగదం అంటే నోటు అనీ బంధాలు అంటే నాణేలు అనీ అర్థం అయింది.**

లోనే మమ్మల్ని అభినందించేవాడు.

అలాగే మానవ జీవన చక్రానికి సంబంధించిన అన్ని విషయాలను రికార్డు చేసేవాళ్లం. అందులో శ్రీమంతం, పురుడు, ఊయలలో వేయడం, అన్నప్రాసన, అక్షరాభ్యాసం, సమర్త, పెళ్ళి, చావు మొదలైన మనిషి జీవన చక్రంలోని ఆచార వ్యవహారాలను అడిగి సాధ్యమైనంత ఎక్కువ సమాచారాన్ని రికార్డు చేసేవాళ్ళం. వ్యవహర్తను అడుగుతున్నపుడు వాళ్ళకు గుర్తుకురాని విషయాలను వారి ఇంటిలోనివారిని అడిగి తెలుసుకొని మరీ చెప్పేవారు. మిగిలిన విషయాలను వారి ఇంటిలోని స్త్రీలు ముందుకు వచ్చి కావలసిన సమాచారాన్ని ఇచ్చేవారు.

పండుగలు జరుపుకునే విధానం, ఆచార వ్యవహారాలను రికార్డు చేసేవాళ్ళం. సమాచారాన్ని మరిచిపోయినపుడు సందర్భాలను గుర్తుచేసి సమాచారాన్ని రాబట్టుకునేవాళ్ళం. గర్భవతి అయింది అనడానికి నీళ్ళోసికుంది, కడుపుతో ఉంది, యాకటయింది, నెల తప్పింది అని వివిధ ప్రాంతాలలో అంటారు. సమర్త అయింది అనడానికి పుష్పవతి అయింది, రజస్రాలు అయింది, రుజువయింది, ఎదిగింది, పెదమనిషయింది, గండిబగిలింది, చేతికచ్చింది అని వ్యవహరిస్తారు. కేశఖండనాన్ని పుట్టెంటుకలు దీయడం, మునిదేవర, ఎంటికలు దీనుడు అని, శోభనాన్ని పరుబ్బటించడం, గర్భదాన మూర్తం, పల్దానం అని అంటారు.

ఆ ఊరిలో జానపద గేయాలు పాడేవారు ఉన్నారా అని అడిగి వారిదగ్గరికి వెళ్ళి లాలిపాటలు, జోలపాటలు, శ్రామిక గేయాలు, కూలిపాటలు, గొబ్బి పాటలు, బతుకమ్మ పాటలు, పెళ్ళిపాటలు మొదలైన ఎన్నోరకాల పాటలను రికార్డు చేసుకునేవాళ్ళం. ఆ సమయంలోనే పాటలలో వచ్చే మాండలిక పదావళిని రాసుకునేవాళ్ళం. భక్తి పాటలు పాడేటపుడు పూలపేర్లు, ఆభరణాల పేర్లు ఎక్కువగా వచ్చేవి.

వివిధ వృత్తులవారిని కలిసి పనిముట్ల పేర్లను రాసుకొని అవసరమైతే వారి మాటలను రికార్డు చేసుకునేవాళ్ళం. బంధువాచకాలలో నాయనమ్మను అమ్మాయి, అవ్వ, జేజమ్మ, జేజి అని వ్యవహరించేవారు. తాతను జేజినాయన అని వియ్యంకున్ని యారకాడు, యీయలకావు, యియ్యంకుడు, బిగుడు అని వ్యవహరించేవారు. తోడికోడలిని యారాలు అని, మేనత్తను బాప్ప అని, అక్కను అప్ప అని పిలుస్తారు. ఆభరణాల విషయానికొస్తే వడ్డాణాన్ని డావు అని, బెల్టును ముడ్డోర అని, చేదబావిని గిలకబావి అని, చేదర బాయి, మంచినీళ్లబాయి అని పిలుస్తున్నారు. తోమడం అంటే తిక్కడం అని, వెంట్రుకలను ఈకలని పిలుస్తున్నారు. తూనీగను తుమ్మీగ, తూనిక్కట్టి, దువ్వెన, బూగ, తూరింగ అని, దోమను గొొయిక అనీ, నల్లతేలును మండ్రగబ్బ, నండ్రగబ్బ, ఇన్పతేలు, ఇంగిలీకం, పొట్ట అని, గవేలాను ఇన్పగుల్ల, టకార అనీ వ్యవహరిస్తున్నారు. బొద్దింకను లచ్చిందేవి పురుగు, రిల్ల, పరడ, లచ్చిమి పురుగు అనీ, వ్యవహరిస్తున్నారు. కళింగాంధ్ర మాండలికాలలో కాపీనం అంటే అత్యాస, కోరిక అనీ, కాయిదా అంటే కాపలా అనీ, కారం అంటే చాకలిసోడా అనీ, కిల్లలు అంటే దెబ్బలు అనీ, బేగి అంటే తొందర అనీ, బైపోతు అంటే ముంగిస అనీ, బైసి అంటే పరువు అనీ, వర్ర అంటే కారం అనీ, వాజీబు అంటే అలవాటనీ, సొన్నారి అంటే స్వర్ణకారుడు అనీ పిలుస్తున్నారు. అలాగే కొలతల విషయానికొస్తే జోడ అంటే రెండు అనీ, పుంజిడు అంటే నాలుగనీ, చెయ్యి అంటే అయిదు అనీ, నాలుగు చేతులు అంటే ఇరవై అనీ వ్యవహరిస్తున్నారు. ఇంకా సామెతలు, పొడుపుకథలకు కొదువేలేదు.

**కొలతల విషయానికొస్తే జోడ అంటే రెండు అనీ, పుంజిడు అంటే నాలుగనీ, చెయ్యి అంటే అయిదు అనీ, నాలుగు చేతులు అంటే ఇరవై అనీ వ్యవహరిస్తున్నారు. ఇంకా సామెతలు, పొడుపుకథలకు కొదువేలేదు.**

**క్షేత్రపర్యటనలో ఎదుర్కొన్న ఇబ్బందులు:** పదసేకరణ కొరకు బాగా వెనుకబడిన గ్రామాలను ఎంపిక చేసుకొనేవాళ్లం కాబట్టి ఒక్కోసారి గ్రామాలకు నేరుగా బస్సులు ఉండేవికాదు. రోడ్డులో దిగి చాలాదూరం నడవాల్సివచ్చేది. దారిలో గ్రామస్తులతో మాటలు కలిపి వారిద్వారాకూడా పదసేకరణ చేయడం జరిగింది. వ్యవహర్తను ఎంపిక చేసుకొన్న తర్వాత ఆ వ్యవహర్త ఎక్కువ సమయం మాతో ఉండేవాడుకాదు. దానివల్ల మరొక వ్యవహర్త కొరకు వెతకవలసి వచ్చేది. వ్యవహర్తలు మనకు కావలసిన సమాచారాన్ని ఇచ్చి జానపద గీతాలు పాడిన తర్వాత డబ్బును ఆశించేవారు. కొందరు మాకేమి లాభం అంటూ తప్పించుకొనేవారు. కొన్ని గ్రామాలలో మధ్యాహ్న భోజనం దొరికేదికాదు కాబట్టి చాలా ఇబ్బందిగా ఉండేది. కులపిచ్చి ఇంకా అక్కడక్కడా ఉండడం వల్ల కొంత ఇబ్బందిపడ్డాము. ఈ ఇబ్బందులన్నీ చాలా తక్కువ గ్రామాలలో మాత్రమే పడ్డాం. మాతృభాషపట్ల పూర్తి మమకారంతో వెళ్ళిన ప్రతిచోటా అక్కడి గ్రామస్తులు అందించిన సహకారం మరువలేనిది. భోజన సమయం అయినపుడు భోజనం పెట్టి ఆదరించేవారు. కొన్నిసార్లు పదసేకరణ నిమిత్తం రాత్రి వరకు ఆ గ్రామంలోనే ఉండవలసి వచ్చేది. ఎందుకంటే వ్యవహర్తలు ఎక్కువగా తమ

## కవిత



# బతుకు ప్రయాణం

- షేక్. ఇబ్రహీం
9533336227

**నా** జీవిత నాణేనికి
బొమ్మ పేదరికమైతే
బొరుసు ఆకలికేక
ఇవి నా బతుకు ప్రయాణంలో
ముళ్ళ కంపను తోవకడ్డంగా వేసి
సైతానులా కోరలుచాచి

నా జిందగీ పై ప్రళయతాండవమాడుతున్నాయి
నాతో పాటూ నిద్రపోయిన నా ఆకలి
సూర్యుడి కన్నా ముందే లేచి
ముడ్డి పైన తన్ని మరీ
నన్ను కూడా నాల్గింటికే నిద్రలేపుతుంది

ఇల్లిల్లూ తిరిగి పేపర్ వేయడం తెలుసుగానీ
అందులో నాలుగు ముక్కలేమున్నాయో తెలియనోన్ని
సైకిల్‌కు పంచర్ వేయడం తెలుసుగానీ
జీవితానికి పడే గాయాల్ని మాన్పడం తెలియనోన్ని
పాన్ బీడా నుంచి మటన్ షాపు దాకా
నా నీడను నేనే చూసుకుంటునోన్ని
గోడ గడియారం కన్నా వేగంగా పరిగెత్తితే గానీ
ఇంట్లో అందరి చేతులు కంచంలో కదలవు

నా కాళ్ళు చేతులు
ఒక్క రోజు విరామం తీసుకున్నా
ఇంట్లో అందరూ ఆ రోజు రోజానే

రోజా ఏమోగానీ
రోజు రోజుకు మెత్తబడుతున్న నా శరీరాన్ని చూసుకుంటుంటే
నా పిల్లల భవితవ్యం గుర్తొస్తోంది
కళ్ళల్లో పెట్టుకోవాల్సిన పిల్లల్ని కూడా
ఖార్ఖానాల్లోకి పంపించాల్సి వస్తోంది

కన్న పిల్లల ఆకలిమంటను ఆర్పడం కోసం
అక్కా చెల్లెల షాదీల కోసం
ఖండాంతరాలను కన్నీటితో దాటాను

ఏళ్ళ తరబడి బంధాలకు దూరమయ్యాను
సొంత గూటికి చేరుకొన్నాక
నేను పైకెగరేసిన నాణేనికి
బొమ్మ బొరుసులు మారలేదు.

---

పనులనుండి సాయంత్రం, రాత్రి సమయాలలోనే లభించేవారు. పదసేకరణ చేసుకొని రాత్రి అయినపుడు బస్సు సౌకర్యం లేనపుడు వారి వాహనం ద్వారా లాడ్జి దగ్గర దిగబెట్టడం వరకు వారి సహకారం మరచిపోలేని మధురానుభూతి. తెలుగు భాషా పరిరక్షణలో భాగంగా తెలుగు విశ్వ విద్యాలయం చేపట్టిన ఈ ప్రాజెక్టులో క్షేత్ర పరిశోధకునిగా పనిచేయడం నాకు దక్కిన అత్యంత గౌరవం.

సేకరించిన పదాలను జిల్లాలవారీగా మాండలిక పదకోశాలను చేయవచ్చు, ప్రాంతాలవారీగా తులనాత్మక పదకోశాన్ని నిర్మించవచ్చు అంతేగాకుండా రికార్డు చేసి సేకరించిన జానపద గేయాలను, మనిషి జీవన చక్రాన్ని, ఆచార వ్యవహారాలను అంతర్జాలంలో ఉంచినట్లయితే పరిశోధకులకు ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుంది.

జాతికి జీవనాడి, సంస్కృతికి కేంద్ర బిందువు, సమాజానికి దాని ఉనికికి మూలం అయిన మాండలికాన్ని తెలుగు రచయితలు, కవులు విస్తృతంగా వాడి, మాండలికాన్ని, తెలుగు భాషను, భాషా సంస్కృతిని, పరిరక్షించుకోవలసిన అవసరం ఎంతైనా వుంది. మాండలికం చిగురులు వేసి కొమ్మలు, రెమ్మలై విస్తరిస్తే తెలుగు భాష అభివృద్ధి, విస్తృతి జరిగినట్లే! తెలుగు భాషను మాండలికాన్ని బ్రతికించుకొని పెంచి పెద్ద చేసే మార్గంలో తెలుగు ప్రజలమైన మనం నడవాలని ప్రతిజ్ఞ తీసుకొందాం.

మాండలికాల కోసం ఉద్యమించడం తెలుగు భాషని ప్రేమించేవారి తక్షణ కర్తవ్యం. అవును. మాండలికాల్లో రచనల కోసం, అధ్యయనం కోసం జీవభాషను ప్రేమించేవారు ఉద్యమించాలి.

పరిశీలన

# శాంతినారాయణ కథల్లో వస్తువైవిధ్యం

- జి. శ్రీధరన్

9441911160



*డాక్టర్ శాంతినారాయణకు దాదాపు నాలుగు దశాబ్దాల సాహిత్యజీవితముంది. వీరు ఇదివరకు నాలుగు కథా సంకలనాలను అందించారు. ఇప్పటికీ వీరి కథా రచన కొనసాగుతూనే వుంది. శాంతినారాయణ తొలి కథా సంపుటి "రక్తపుముద్ద పిలిచింది" (1974), రెండవది "రస్తా" (3 కథలు), మూడవది "పల్లేరు ముళ్ళు" (15 కథలు), నాలుగోది "నమ్ముకున్న రాజ్యం", (10 కథలు) 2004లో ప్రచురితమైంది.*

ఏ రచనకైనా "వస్తువు" వెన్నెముక. శరీరానికి వెన్నెముక ఎంత ముఖ్యమో, కథకు "వస్తువు" అంతే ముఖ్యం. ఇతివృత్తం సహజంగా ఉంటేనే కథ రాణిస్తుంది. చదివే పాఠకునికి కథ ఒక దృశ్య కావ్యంలా కదలాలి. కథ ముగిసిన తరువాత కూడా కథలోని సంఘటనలు పాఠకుణ్ణి వెంటాడాలి. సామాజిక, వాస్తవిక జీవితాన్ని చిత్రిస్తూ, పాఠకునిలో ఆలోచనలు రేకెత్తించాలి. అలా ఉంటేనే ఇతివృత్తం లేక వస్తువు రాణించినట్లు లెక్క. ఇలాంటి వస్తువులు సాంఘికంగా, సంఘటనలకు సంబంధించిన అనుభవం నుంచి రావాలి. ఒక జీవితం నుంచి రావాలి, కల్పనలు కాకూడదు.

డాక్టర్ శాంతినారాయణకు దాదాపు నాలుగు దశాబ్దాల సాహిత్యజీవితముంది. వీరు ఇదివరకు నాలుగు కథా సంకలనాలను అందించారు. ఇప్పటికీ వీరి కథా రచన కొనసాగుతూనే వుంది. శాంతినారాయణ తొలి కథా సంపుటి "రక్తపుముద్ద పిలిచింది" (1974), రెండవది "రస్తా" (3 కథలు), మూడవది "పల్లేరు ముళ్ళు" (15 కథలు), నాలుగోది ''నమ్ముకున్న రాజ్యం'', (10 కథలు) 2004లో ప్రచురితమైంది.

పై కథలన్నీ పరిశీలిస్తే, సామాజిక అధ్యయనంలోనూ, దాన్ని కథానికగా మలచడంలో, శాంతి నారాయణ పరిణతి, వికాసం తెలుస్తుంది. వస్తువు విషయంలో శాంతి నారాయణ మొదటి నుంచీ తీవ్రమైన విషయాలకే ప్రాధాన్యత ఇచ్చారు. కాలక్షేపలక్షణం ఆయనలో ఎక్కడా, ఎప్పుడూ కనిపించదు. సాహిత్యాన్ని సామాజిక విమర్శకు ఆయుధంగా, నూతన సమాజ నిర్మాణానికి నాందిగా చక్కగా ఉపయోగించుకొన్నారు.

ముఖ్యంగా శాంతినారాయణ కథల్ని ఐదు భాగాలుగా వర్గీకరించవచ్చు. అవి : 1. రైతాంగ జీవిత చిత్రణ, 2. దళిత స్పృహ, 3. స్త్రీవాద స్పృహ, 4. సామాజిక స్పృహ, ఇందులో లంచగొండితనం. భక్తి పేరుతో మోసం, దోపిడీ, వరకట్నం, విద్యారంగ సమస్యలు, మానవీయకోణాలు ఉపశీర్షికలుగానూ, చివరిగా స్త్రీ-పురుష సంబంధ కథలకు ఐదవ భాగంగా చెప్పవచ్చును.

***సీమ రైతాంగ జీవిత చిత్రణ :***

సామాజికంగా, సాంస్కృతికంగా వైవిధ్యమైన ప్రాంతం రాయలసీమ. రైతులు దేశానికి వెన్నెముకవంటివారు. పల్లెసీమలు దేశప్రగతికి పట్టుగొమ్మలు. కానీ రాయలసీమ ప్రాంతంలో అతి తక్కువ వర్షపాతం కలిగి ఉండడం వల్ల తీవ్రమైన దుర్భిక్ష ప్రాంతంగా వుంది. అతి తక్కువ భూగర్భజలాలు కలిగి ఉండడం రైతులు కేవలం వర్షం పైనే ఆధారపడడం సహజంగా ఇక్కడ ఉన్న పరిస్థితి. నిత్యం కరవు కాటకాలతో సతమతమయ్యే రైతాంగం, ఇక్కడ మనకు

కనిపిస్తుంటుంది. సీమంతటా రైతు నిత్యం కఠినతరమైన జీవనపోరాటం చేస్తూనే కనిపిస్తాడు. సహజంగానే ఇక్కడి రచయితలు ఇక్కడి రైతుల వెతలనే ఇతివృత్తాలుగా మలుచుకొని కథలు రాయడం జరుగుతున్నది. ముఖ్యంగా సింగమనేని నారాయణ, మధురాంతకం రాజారాం, కేతు విశ్వనాథ రెడ్డి, పులికంటి కృష్ణారెడ్డి తదితర రచయితలు తమ కథల్లో సీమరైతు వేదనల్ని చిత్రీకరించారు. సీమ రైతు జీవిత చిత్రణలో కె.సభా (పాతాళగంగ), కేతు విశ్వనాథరెడ్డి (వాన కురిస్తే 1971), జప్తు (1972), నమ్ముకున్న నేల (1982), సింగమనేని నారాయణ (జూదం 1978), ఊబి, అడుసు, ఉచ్చు, విముక్తి కథలు, బండి నారాయణ స్వామి (వానరాలే) చిలుకూరి దేవపుత్ర (మన్నుతిన్న మనిషి) ముఖ్యంగా చెప్పవచ్చు.


డా. శాంతినారాయణ

శాంతినారాయణ అచ్చంగా రైతుబిడ్డ కావడంతో ఆయన రచనల్లో చాలా భాగం రైతాంగ జీవితచిత్రణ ఇతివృత్తాలుగా చేసుకొని అనేక రచనలు చేశారు. శాంతి నారాయణ కథల్లో చాలా కథలు రాయలసీమలో రైతులు పడే కష్టాలూ, ప్రభుత్వాల నిర్లక్ష్యం, దళారీ వ్యవస్థ ఎలా పీల్చి పిప్పి చేస్తుందో ఇవన్నీ ఇతివృత్తాలుగా కనిపిస్తాయి.

“పల్లేరుముళ్లు” కథా సంకలనంలో దాదాపు ఐదు కథల్లో సీమరైతాంగ జీవితచిత్రం వస్తువుగా కనిపిస్తుంది. అందులో “దళారి” ఒక కథ. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు మంచి ధర కోసం ఎదురుచూసి, మధ్యలో దళారీల వల్ల భంగపడ్డ ఒక పేద రైతు దీనావస్థను మన కళ్ళకు కట్టినట్లు ఈ కథలో శాంతి నారాయణ చూపాడు. ఈ కథలోని “రామప్ప” సీమ పేద రైతుకు ప్రతినిధి. టమోటో, ఉల్లిగడ్డలు పండించి మార్కెట్లో అమ్ముకోవడానికి బ్రోకర్ సుబ్బారాయుడి దగ్గరకు వస్తాడు. లారీకోసం వచ్చాడని తెలుసుకున్న సుబ్బారాయుడు లేని కొరతను సృష్టిస్తాడు. ఫోన్ చేసి రేటు కనుక్కుంటున్నట్లు నటిస్తాడు. రైతుకు ఆశ కల్పించి, రెండు వైపులా కమీషను గుంజి రైతును పీల్చి పిప్పిచేస్తాడు. దళారీ వ్యవస్థ రైతాంగ జీవితానికి ఎంత తీవ్రమైన కష్టాన్ని, నష్టాన్ని కలిగిస్తున్నదో ఈ కథ మనముందు ప్రత్యక్షంగా చూపుతుంది. దేశంలో ప్రతి వ్యాపారీ తన వస్తువును ఎంతకు అమ్ముకోవాలో నిర్ణయించుకొనే అవకాశాన్నిచ్చిన ప్రభుత్వం, రైతులకు మాత్రం అమ్ముకొనే ధరను వారినే నిర్ణయించే అవకాశాన్ని ఇవ్వకుండా, కష్టపడకుండా పేద రైతుల్ని రక్తం పీల్చి వారి శ్రమను దోపిడీ చేసే దళారీ వ్యవస్థకు ఊతమివ్వడం ఎంత క్షమించరాని నేరమో తెలియజేస్తున్నది.

“పల్లేరుముళ్లు” కథా సంకలనంలో దాదాపు ఐదు కథల్లో సీమరైతాంగ జీవితచిత్రం వస్తువుగా కనిపిస్తుంది. అందులో “దళారి” ఒక కథ. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు మంచి ధర కోసం ఎదురుచూసి, మధ్యలో దళారీల వల్ల భంగపడ్డ ఒక పేద రైతు దీనావస్థను మన కళ్ళకు కట్టినట్లు ఈ కథలో శాంతి నారాయణ చూపాడు.

మరోకథ “కల్లమాయిపాయ” లో మల్లప్ప అనే పేదరైతు వ్యవసాయంలో కష్టనష్టాలకు గురై, వ్యవసాయం గిట్టుబాటుకాక, భూమిని నమ్ముకున్న అతడి కుటుంబం చివరకు వలసకూలీలుగా మారిపోవడం జరుగుతుంది. “పల్లేరుముళ్లు” కథలో నారపరెడ్డి అనే రైతు వర్షాలు సరిగా పడక, కరెంటు కష్టాలు ఒకవైపు, ప్రభుత్వ అధికారుల ఉదాసీనత ఎరువుల కొరత, ప్రయివేటు బ్రోకర్ల దోపిడీదారీతనం, కమీషన్ ఏజంట్ల ఆగడాలు ఇలా అడుగడుగునా మోసపోతాడు.

“ఎండమావి” కథలో ప్రభుత్వాలు, దళారులే కాక ప్రకృతి కూడా తన ప్రకోపాల్ని పేదరైతులపై చూపించడం వల్ల రైతు ఎంత కృంగిపోతున్నాడో కళ్ళముందు నిలుపుతుంది. రైతుకు వ్యవసాయం ఎప్పటికీ అందని “ఎండమావే” అని ఋజువు చేస్తుందీ కథ.“నమ్ముకున్నరాజ్యం” అనే కథలో కష్టజీవులైన సుగాలీలు వారి శ్రమ విఫలమై, కరువు తీవ్రతతో వ్యవసాయం చేయలేక, ప్రభుత్వాలు వారిని, విస్మరించడంతో చివరకు బతకడానికి పిల్లల్ని, అమ్ముకొని బతకవలసిన కఠోర సత్యాన్ని మనం చూడవచ్చును.

***దళితస్పృహ :***

నేడు ఆధునిక సాహిత్య ఉద్యమంగా “దళిత” ఉద్యమం కొనసగుతున్నది. ప్రాచీన సమాజం నుండి కుల వివక్షను ఎదుర్కొని, కులాల పేరిట అంటరానివారిగా చూడబడుతూ, తరతరాలుగా అస్పృశ్యతా జాడ్యంలో మరిగిపోతున్న వర్గం, తమను బానిసలుగా చూచే వర్గాలతో పోరాటం ఆరంభించింది. వివక్ష కూకటివేళ్ళతో తొలగి, సమసమాజం ఏర్పడాలని దళితవర్గం భావిస్తున్నది. దళిత స్పృహను కలిగించడానికి ఎందరో రచయితలు “దళితస్పృహ”తో రచనలు చేస్తూ, తమవారిలో చైతన్యం తేవడానికి ప్రయత్నిస్తున్నారు. గుఱ్ఱం జాషువా “గబ్బిలం” దళితులకు ఒక కొత్త మార్గాన్ని చూపింది. శాంతినారాయణ కూడా వెనుకబడిన వర్గంలో నుంచి వచ్చినవారే కావడంతో తన రచనల్లో దళితస్పృహ ఎక్కువ. అస్పృశ్యతకు సంబంధించిన కథలెన్నో రచించారు. వాటిలో “జీవనాడులు” కథ ఒకటి. తక్కువ కులాల వారిని అగ్రకులాలు తమ పెత్తనాన్ని చూపి ఎలా అణగ దొక్కుతున్నాయో కళ్ళకు కట్టినట్లు చిత్రిస్తుందీ కథ. ‘‘రెడ్డిపల్లి’’ గ్రామంలో మాదిగగంగడు ఆ ఊరి ప్రెసిడెంట్ కొండారెడ్డికి పెద్దపాలెకాడుగా వుంటాడు. తన కూతురికి పెళ్ళి చేస్తాడు. అందుకు అడుగడుగునా వానికి వాని కులం అడ్డొస్తుంది.

బ్యాండుమేళం కోసం మంగలి రామన్న దగ్గరకెళితే అతడు కులంపేరు చెప్పి నిరాకరిస్తాడు. కుర్చీలు, బెంచీల కోసం స్కూలుకెళితే హెడ్మాస్టర్ కుల ప్రసక్తి తెచ్చి ఇవ్వడానికి నిరాకరిస్తాడు. ఊరేగింపుతో ఊర్లోకి వచ్చినందులకు ప్రెసిడెంట్ తమ్ముడు నానా మాటలతో బాధపెడతాడు చివరికి నమస్కారం చేయడానికి ఇంటి వద్దకు వచ్చిన గంగని కూతురు, అల్లుడిని అవమానించి పంపుతాడు. అందరూ సమావేశం ఏర్పాటు చేసి, అగ్రకులాల వారు తమను, తమ బ్రతుకుల్ని ఎలా అణచివేస్తున్నారో చెప్పుకుంటారు. అగ్రకులాల వారు తమ స్వార్థానికి తక్కువ కులాల వారిని, వాడుకోవడం, వారు ఎదిగితే సహించలేకపోవడం, ప్రతిసారి తక్కువ జాతి వారి ఆత్మ విశ్వాసాన్ని పోగొట్టడం ఎలా జరుగుతున్నదో, వారి పైశాచిక ఆనందం ఎలా ఉంటుందో ఈ కథ మనకు తెలియజేస్తుంది.

అలాగే మరోకథ "ఉక్కుపాదం" సంఘంలోని అసమానతలనూ, రాజకీయ విష సంస్కృతినీ, అగ్రవర్ణాల అణచివేసే సంస్కృతినీ వేలెత్తిచూపుతుంది. కథకు పేరు తగినట్లుగానే అగ్రవర్ణాలు తమ ఉక్కుపాదాలతో దళిత వర్గాలను ఎలా అణగద్రొక్కుతున్నారో వివరిస్తుందీ కథ. "శివరాం" వారిది కొత్తపల్లి గ్రామం. పేద దళిత కుటుంబం. స్నేహితులు, గురువుల ఆదరణతో బాగా చదువుకొని లాయరవుతాడు. మంచిపేరు తెచ్చుకొని, రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటూ వుంటాడు. అదృష్టం కొద్దీ యం.ఎల్.ఏ.గా కావడం మంత్రిగా చేరడం జరుగుతుంది. దీన్ని జీర్ణించుకోలేని అగ్రవర్ణ పెద్దలు అడుగడుగునా శివరాంను అవమానపరుస్తారు. మంత్రి పదవి నుండి దింపే వరకూ నిద్రపోరు. బి.సి. వర్గానికి చెందిన ఒక ఇంటి యజమాని సైతం, యస్.సి. అయిన శివరాంకు ఇంటిని అద్దె ఇవ్వడానికి నిరాకరిస్తాడు. ఈ పరిణామాలకు శివరాం ఎంతగానో వేదన చెందుతాడు. ఆర్థిక సమానత్వం, రాజ్యాధికారం వస్తే అన్ని అసమానతలూ తొలగిపోతాయన్న తన చిన్నప్పటి స్కూలు టీచరు మాటలు గుర్తుకు వచ్చి మరింత వేదన పొందుతాడు.

***స్త్రీవాద స్పృహ :*** స్త్రీ, పురుషుల మధ్య లైంగిక, కౌటుంబిక, సామాజిక సంబంధాలను, సంస్కృతీ విలువలను, స్త్రీ అవసరాలను, ప్రయోజనాల రీత్యా వ్యాఖ్యానించే తాత్విక దృక్పథమే "స్త్రీవాదం". స్త్రీవాదం నేడు బలమైన శక్తిగా అంతర్జాతీయ స్థాయిలో అన్ని భాషల్లోనూ, రచనల్లో బలమైన స్వరాన్ని వినిపిస్తున్నది. ఎందరో రచయితలు, రచయిత్రులు స్త్రీవాద స్పృహతో రచనలు చేస్తూనే ఉన్నారు. శాంతినారాయణ స్త్రీ ప్రయోజనాల దృష్ట్యా, స్త్రీజాతి సమస్యలను, విశ్లేషిస్తూ, స్త్రీలు పడే అవస్థలను, స్త్రీలలో చైతన్యం కలిగించే కథలెన్నో రాశారు. అందులో "బొమ్మబొరుసు" అనే కథ ఒకటి. వ్యక్తిని బాధపెట్టే సాంప్రదాయాలు, మనుషుల మధ్య అగాధాలూ సృష్టిస్తున్న ఆర్థిక సంబంధాలే ఇందులోని ఇతివృత్తం. ఈ కథలో అరుణ భర్త ఉద్యోగాన్ని, డబ్బునూ రెండింటినీ కోరుకుంటుంది. తన అత్తగారికీ, మరిదికీ ఎటువంటి పరిహారం అందకుండా చేసి అందరినీ ఆశ్చర్యపరుస్తుంది. స్త్రీకి డబ్బు లేదా ఉద్యోగం మాత్రమే మంచి జీవితాన్ని అందించగలదని నమ్ముతుంది. డబ్బు,ఉద్యోగం లేకపోవడం వల్లే తన తల్లి ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నదని భావిస్తుంది.

***శాంతినారాయణ స్త్రీ ప్రయోజనాల దృష్ట్యా, స్త్రీజాతి సమస్యలను, విశ్లేషిస్తూ, స్త్రీలు పడే అవస్థలను, స్త్రీలలో చైతన్యం కలిగించే కథలెన్నో రాశారు. అందులో "బొమ్మబొరుసు" అనే కథ ఒకటి. వ్యక్తిని బాధపెట్టే సాంప్రదాయాలు, మనుషుల మధ్య అగాధాలూ సృష్టిస్తున్న ఆర్థిక సంబంధాలే ఇందులోని ఇతివృత్తం.***

అలాగే "నిర్ణయం" అనే కథలో "సీతాలక్ష్మి" పాత్ర ద్వారా చక్కటి సందేశాన్ని ఇచ్చారు. సీతాలక్ష్మిది సంప్రదాయ బద్ధమైన పేద బ్రాహ్మణకుటుంబం. సంపాదనలేక కుటుంబం రోడ్లోకి వస్తుంది. సీతాలక్ష్మి కుటుంబం కోసం, ఎన్నో త్యాగాలు చేస్తుంది. హోటల్ వ్యాపారం చేస్తుంది. ఇది ఇంట్లో ఎవరికీ నచ్చదు. అందరూ ఎంతగానో నిరుత్సాహపరుస్తారు, అవమానపరుస్తారు. కానీ పట్టుదలతో సీతాలక్ష్మి పేదరికం కంటే సాంప్రదాయపు ఉక్కు చట్రాలు తనను బాధ పెడుతున్నాయని గ్రహిస్తుంది. యేసుపాదం అనే దళితయువకున్ని పెళ్ళి చేసుకొని, హోటల్ నడిపి తన కుటుంబాన్ని ఆదుకొంటుంది.

"అద్దెతల్లి" అనే కథలో "సుజాత" పాత్ర ద్వారా కుటుంబ పరిస్థితులు తట్టుకోలేక, తన బిడ్డను బతికించుకోవడానికి "అద్దెతల్లి"గా మారిన వైనాన్ని చూపుతారు రచయిత. అద్దెతల్లిగా ఓడిపోయి, అమ్మతనంలో గెలవడం ఇందులోని ఇతివృత్తం.

***సామాజిక స్పృహ :*** రచయితలకూ బాధ్యత ఉంది. రచనలు చేసే రచయితలు తమ సాహిత్యం ద్వారా ఎంతో కొంత హితాన్ని సమాజానికి ఇవ్వాలి. బాధ్యతగల రచయితలు తమ కథా ఇతివృత్తాల్లో సామాజిక స్పృహ జోడించి పాఠకుల్ని రంజింపచేస్తారు. శాంతి నారాయణ అచ్చం ఈ కోవకు చెందిన వ్యక్తే. తన రచనల్లో సామాజిక స్పృహ తప్పక ఉంటుంది. సమాజం ముఖ్యంగా తన ప్రాంతపు ప్రజలు పడే కష్టాలు, బాధలూ ఇవన్నీ కథల్లో కనిపిస్తుంటుంది.

***లంచగొండితనం :*** "విజయ విహారం" అన్న కథలో సమాజంలో పెరిగిపోతున్న లంచగొండితనం, అవినీతి,

ఆఫీసుల్లో లంచాలు, మామూళ్ళు ఇలా ఎన్నెన్నో పేర్లతో పీల్చుకుతింటున్న వర్గాల వారి ప్రస్తావన కనిపిస్తుంది. ఒక సగటు ఉద్యోగి తను జీతం తీసుకొన్న గుమస్తా దగ్గర్నుండీ, బ్యాంకు మెసెంజరు, కానిస్టేబుల్, కరెంటు హెల్పర్, మండీ యజమాని, భక్తబృందాలు, రాజకీయ నాయకులు, పులివేషాలు, ఇలా అందరూ ఆయన్ని పీక్కుతింటారు.

"రొంపి" కథలో ప్రభుత్వ ఆసుపత్రుల్లోని అవినీతి కంపు, అపరిశుభ్ర వాతావరణం, డాక్టర్ల వ్యాపారపేక్ష, నర్సుల అటెండర్ల మామూళ్ళ ప్రహసనం, ఇవన్నీ కనిపిస్తాయి.

"తేడా" కథలో చదువుకోని పేదవాన్ని పోలీసులు పీల్చి పిప్పి చేసే వైనం కనిపిస్తుంది."మనిషినయినందుకు" కథలో డబ్బుకోసం మనిషి ఎలా క్రూరంగా తయారవుతున్నాడో తెలుస్తుంది. వ్యవస్థలోని లోపాలు, సాక్ష్యం ఇచ్చిన వ్యక్తిని చంపడం, మాసిపోతున్న మానవ సంబంధాలకు సజీవ సాక్ష్యంగా కనిపిస్తుంది.

***భక్తిపేరుతో మోసం :*** "స్వాములు" అన్న కథల్లో భక్తి తెర వెనుక ప్రజల్ని ఇబ్బంది పాలుజేసే దుష్టుల్ని చూపిస్తుంది. మనిషి తన దుర్మార్గాలను మార్చుకోవడానికి ఏ వేషమూ అవసరం లేదని తెలుపుతుంది.

దోపిడీ : "ఎటుచూస్తే అటు" అనే కథలో కింది స్థాయి వర్గంలోని వారికి కూడా దోపిడీ చేయాలనే ఆలోచన ఉండడం, కష్టపడకుండా సంపాదించాలనే కోరిక ఉండడం, పేదవాడిని, పేదవాడే దోచుకోవడం ఇందులోని ఇతివృత్తం. బస్సులో అమాలీలు పేదవారిని చిన్నచిన్న ఉద్యోగుల్ని, ఏ విధంగా మోసం చేస్తారో ఇందులో తెలియజేయబడింది.

వరకట్నం :"శాలిని" కథలో ప్రేమకు కూడా ఖరీదు కట్టే షరాబులనూ, పురుషస్వామ్య సమాజం స్త్రీల పట్ల చూపుతున్న చిన్నచూపు ఇందులో ఇతివృత్తం. శాలినిని ప్రేమించిన సోమశేఖర్ పెళ్ళి అప్పుడు కట్న కానుకల కోసం, శాలిని తల్లిదండ్రులను వేధిస్తాడు. సహించలేని "శాలిని" విడాకులకు సైతం సిద్ధపడుతుంది.

విద్యారంగ సమస్యలు :విద్యా వ్యవస్థలో నెలకొన్న దుస్థితిని "బలిపశువులు" కథ ఒక ఒక్కటి ఉదాహరణ. లెక్చరర్ల బాధ్యతా రాహిత్యానికి విద్యార్థులు బలికావడం ఇందులో మనకు కనిపిస్తుంది. "తులసీవనంలో తుమ్మచెట్లు" అన్న కథలో విద్యా విలువలు ఉన్నప్పటికీ, మానవత్వాన్ని మరిచే వారికి ఈ కథ చక్కటి ఉదాహరణ. మద్దూరి రంగస్వామి పేద దళితుడు. తల్లి, గురువుల సహాయంతో పి.జి. వరకూ చదువుతాడు. వీని చదువుకోసం తల్లి చిన్న కొడుకును కూలీకి పంపిస్తుంది. ఒక ప్రొఫెసర్ సాయంతో ప్రొఫెసర్ ఉద్యోగాన్ని, ఉద్యోగం చేసే భార్యనూ ఒకేసారి పొందుతాడు. సమాజంలో ఉన్నత స్థానాన్ని చేరినప్పటికీ, తల్లిని, తోబుట్టువులనూ మరచిపోతాడు. తల్లిదండ్రులను నిరాదరణకు గురిచేసేవారికి ఈ కథ చెంపపెట్టు.

***మానవీయకోణం :*** యం.యన్.రాయ్ మొదలుకొని గురజాడ వరకు ఎందరో ప్రతి మనిషిలో మానవత్వం వుండాలంటారు. జాలి, కరుణ, దయ మొదలైనవి మానవునికి ఉండవలసిన ముఖ్యమైన లక్షణాలు. మానవత్వాన్ని, మానవున్ని వేరుచేసి చూడలేం. శాంతి నారాయణ తన రచనల్లో ఈ మానవీయ కోణాన్ని ఇతివృత్తాలుగా తీసుకొని మంచి రచనలు చేస్తూ, సమాజంలో మాయమైపోతున్న మానవీయతను బతికించే ప్రయత్నం చేస్తున్నారు. మంచి రచనలు కూడా మనుషుల్లో పరివర్తననూ, మంచి నడవడికనూ, ఇవ్వగలదని నమ్ముతున్న శాంతి నారాయణ ''మట్టిమరకలు'', "గర్భస్రావం" కథల్లో ఎంతో చక్కగా మానవీయ కోణాల్ని చూపించారు.

> ***వైవిధ్యమైన ఇతివృత్తాలతో చక్కటి కథలను శాంతినారాయణ తెలుగు సాహిత్యానికి అందించారు. పాఠకుల మనసును చూరగొన్నారు. సమాజంలో ఉన్న సమస్యల్ని ఇతివృత్తాలుగా మలుచుకొని, వాస్తవ జీవిత చిత్రణలను మాండలిక భాషలో చక్కగా చిత్రించారు.***

''మట్టిమరకలు'' కథ పవిత్రత, శీలం అనేవి శరీరానికి సంబంధించినవి కావనీ, మనసుకు సంబంధించినదని తెలియపరుస్తుంది. గౌతమరావు లెక్చరరు, అతని భార్య అహల్య. ఒక చిన్న సంఘటన వారి దాంపత్యంలో చిచ్చు తెచ్చిపెడుతుంది. వాళ్ళు ఒక రోజు రాత్రి సినిమా చూసి వస్తుంటే కొందరు దుండగులు దాడి చేస్తారు. భర్తను రక్షించడం కోసం అహల్య తన మానాన్ని పోగొట్టుకుంటుంది. ఎలాగో ప్రాణాలు రక్షించుకుంటారు. తన గర్భాన్ని మరియు ఎప్పటికీ తల్లి అయ్యే భాగ్యాన్ని కోల్పోతుంది అహల్య. లోలోపల చాలా కుములుతుంటుంది. విశాల హృదయుడైన గౌతమరావు భార్యను ఓదారుస్తాడు. ఆమెకు అన్ని విధాల నచ్చచెప్పి, ఆమెలో పరివర్తన తెస్తాడు. తన దాంపత్యాన్ని కొనసాగిస్తాడు.

"గర్భస్రావం" అనే కథలో ముఠాకక్ష్యలు, రాజకీయ కార్పణ్యాలు, అధికార కాంక్ష, పురుష అహంకారం ఇవన్నీ మానవీయతను దెబ్బతీసే అంశాలు, ఒక స్త్రీకి గర్భస్రావాన్ని కలిగిస్తుంది. మానవీయత లేకపోవడమే ఇందులకు కారణమని రచయిత ఈ కథలో తెలియజేస్తాడు.

స్త్రీ – పురుష సంబంధాలు :ప్రకృతిలో స్త్రీ-పురుషులిద్దరికీ ఎంతో ప్రాధాన్యం ఉంది. ఒకరు లేకపోతే మరొకరు ఉండలేరన్నది సత్యం. అనాదిగా పురుష అహకారంతో స్త్రీలు ఎన్నో బాధలు అనుభవించారు. కాలక్రమేణా స్త్రీ శక్తిని,

## కవిత

# చరవాణి


శంకరయ్య దామరకుంట
9440876788


ఇంటి కొక్కటి కూడ
కంట కనిపించలే
నేడు మనిషికొక్కటి కాదు
రెండు మూడు

ప్రాత: కాలాన
కాంక్రీట్ సౌదాన
కోడికూతవై నిద్ర లేపుతావు!

చిక్కు లెక్కలు చేయ
సమయమాదాచేయ
క్యాలిక్లేటరవై సహకరిస్తావు

ముఖ్య విషయాలను
గుర్తు చేయుటలోను
మైండును నువ్వే రివైండు చేస్తావు!

మాటాడ లేనపుడు
మదిలోని భావాలు
యస్ యం యస్ ద్వారా చేరవేస్తావు!

టైంపాస్ కు
గేమ్స్ ఆడుటకు
ఒంటరికి నువు జంట అవుతావు!

మదిదోచె దృశ్యం
అవుతుంది నా వశం
కెమరవై నువ్వు బంధింప చేస్తావు!

మరపు రానట్టి
మధుర స్మృతులు
వీడియో కెక్కించి భద్ర పరుస్తావు!

అంతర్జాలమై
భూగోళము చుట్టే
యంత్రమౌతావు!

మిస్ కాల్తో కొత్త
బంధమేర్పరుస్తావు
దానితోనే ఒకరి
బ్రతుకు తెంచుతావు!

ఫేస్ బుక్, ట్విట్టర్లు
పేరున్న సైట్లతో
ఆప్స్ అన్ని నీలోనే!

నీవు లేనివాడు నామోషి పడుతుండు
నిండు ప్రాణాలను బలి తీసుకుంటుండు

చేతుల్లో నువ్వే
చెవుల్లో నువ్వే
చదువు ఎనుకకు నెట్టు సహచరివి నువ్వే!

పని సమయంలోన పాటవైనావు
బస్సు ప్రయాణంలో నీతోనే బంధము



శబ్దాన్ని నిశ్శబ్దంగా
వీనులకందించు తంత్రులు
నాడి తంతుల నడ్డి విరుస్తున్నా!

జేబులు చిల్లైన జేజేలు నీకే!
ప్రమాద గంటలు మ్రోగ పరుగు నీవెంటే!
ధరణిని చెరబట్టిన నరహంతకి.

---

స్త్రీ విశిష్టతను, స్త్రీ విలువలను నేటి తరం కొద్దికొద్దిగా గ్రహిస్తూ వస్తున్నది. గత కాలంకంటే స్త్రీలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో దూసుకువెళుతున్నారు. స్త్రీ-పురుష సున్నితమైన, పవిత్రమైన సంబంధాల్ని శాంతినారాయణ ఎంతో రమ్యంగా చిత్రించారు.

"రక్తపు ముద్ద పిలిచింది" కథలో ప్రేమకు సహజంగా పెద్దలు అడ్డు చెప్పడం, ప్రేమికుల్ని విడదీయడం, జరుగుతుంది. శ్రీకాంతం, లీలావతి ప్రేమికులు. వారి మధ్య అంతస్తుల్లో, ఆస్తుల్లో చాలా బేధముంటుంది. పెద్దలు వాళ్ళిద్దర్ని విడదీసినా, వారి ప్రేమ పవిత్రం కావడం వల్ల మధ్యలో ఎన్ని అవాంతరాలు అడ్డొచ్చినా చివరకు ఒకరినొకరు కలుసుకోవడంతో కథ ముగుస్తుంది.

''బాటసారి కోసం'' అనే కథలో కూడా ఊహల ప్రపంచంలోనున్న ఇరువురు ప్రేమికులు నిజజీవితంలో కలవక ఒకరికోసం ఒకరు జీవితాన్ని త్యాగం చేసుకొని బతకడం ఇందులోని ఇతివృత్తం. ఈ కథలో కూడా స్త్రీ-పురుష సంబంధాలు మధ్య ఉన్న ప్రేమ, అనురాగం, త్యాగం ఇవన్నీ కనిపిస్తాయి.

అలాగే ''అమృతమూర్తులు'' ''అదేవారి పర్యవసానం" కథల్లో కూడా శాంతినారాయణ స్త్రీ-పురుష సంబంధాలను చక్కగా చిత్రించారు.

ఈ విధంగా వైవిధ్యమైన ఇతివృత్తాలతో చక్కటి కథలను శాంతినారాయణ తెలుగు సాహిత్యానికి అందించారు. పాఠకుల మనసును చూరగొన్నారు. సమాజంలో ఉన్న సమస్యల్ని ఇతివృత్తాలుగా మలుచుకొని, వాస్తవ జీవిత చిత్రణలను మాండలిక భాషలో చక్కగా చిత్రించారు. మునుముందు కూడా వారి కలంలో నుండి మరిన్ని మంచి కథలు రావాలని కోరుకుందాం. అనంతపురం జిల్లా స్థితిగతుల్ని, అక్కడి రైతుల వెతల్ని తెలియజేస్తున్న శాంతినారాయణను అనంత జిల్లా ఆణిముత్యంగా చెప్పవచ్చు.

కథ



# దిబ్బయజమాని


హిందీ మూలం : మోహన్ రాకేష్
తెలుగు : డా॥ యార్లగడ్డ నిర్మల
9014656539


**ఏడున్నర సంవత్సరాల తర్వాత వాళ్ళు లాహోర్ నుండి అమృత్‌సర్ వచ్చారు. హాకీ మ్యాచ్ ఒక వంక మాత్రమే. ఏడున్నర సంవత్సరాల క్రిందట దేశ విభజనతో వాళ్ళకు పరాయివి అయిపోయిన ఇళ్ళు, బజార్లు తిరిగి చూడడమే వారి రాకలోని అసలు ఉద్దేశ్యం. అమృత్‌సర్ రోడ్లమీద ముస్లింలు గుంపులుగ తిరుగుతూ కనిపిస్తున్నారు. వాళ్ళు అమృత్‌సర్‌లోని ప్రతి అంగుళాన్ని ఎలా చూస్తున్నారంటే, అది ఒక మామూలు నగరంలా కాకుండా ఎన్నో ఆకర్షణలున్న ఒక మాయా నగరమేమో అనిపిస్తుంది.**

ఇరుకు సందుల్లో నుండి వెళుతూ వాళ్ళు ఒకరితో నొకరు పాత జ్ఞాపకాలను పంచుకుంటున్నారు.

“చూడు, చూడు ఫతహద్దీన్! ఒకప్పుడు జోరుగా పటికబెల్లం అమ్మే బజార్లో ఇప్పుడు ఆ దుకాణాలే లేవు. ఆ సందు మొదట్లో ఒకప్పుడు బొగ్గుల బట్టీ ఉండేది. ఇప్పుడు అక్కడొక పాన్ దుకాణం వెలసింది.”

“ఖాన్‌సాహెబ్! ఒకప్పుడు ఇక్కడి బజార్లలో ఉప్పు అమ్మే స్త్రీల గురించి ఏమి చెప్పాలి ఆహా”

చాలా సంవత్సరాల తర్వాత అమృత్‌సర్ బజార్లలో తుర్కీ టోపీలు, వాటిమీద పంజాబీ తలపాగాలు దర్శనమిచ్చాయి. లాహోర్ నుండి వచ్చిన ఈ ముస్లింలు విభజన సమయంలో నిస్సహాయ పరిస్థితుల్లో అమృత్‌సర్ వదలి వెళ్ళినవారే. ఏడున్నర సంవత్సరాలలో అమృత్‌సర్‌లో వచ్చిన మార్పులను వారు ఆవేదనతో, ఆశ్చర్యంతో పరికిస్తున్నారు.

“ఏంటీ! ఇటువైపున ఇళ్ళన్నీ తగలబడిపోయాయా? ఇక్కడ హకీమ్ అసిఫ్ అలీ దుకాణం ఉండేది కదా! ఇప్పుడు ఒక చెప్పులు కుట్టేవాడు దాన్ని ఆక్రమించుకున్నాడు”

“వలీ! మసీదు అలాగే ఉంది. వీళ్ళు దాన్ని గురుద్వారా చెయ్యలేదు” అక్కడక్కడా ఇలాంటి వ్యాఖ్యానాలు కూడ వినిపిస్తున్నాయి.

పాకిస్థాన్ నుండి వచ్చిన ఈ ముస్లింల గుంపులు వెళుతుంటే అమృత్‌సర్ పౌరులు వారివైపు ఆసక్తిగా చూస్తున్నారు. కొందరు వారిని తప్పుకొని వెళుతుంటే, కొందరు వారికి ఎదురుగా వెళుతున్నారు. ఎక్కువమంది వారిని లాహోర్

గురించి అడుగుతున్నారు.

లాహోర్‌లో షాలిమార్ గేటును పునర్మించారా? అక్కడి రిష్వత్‌పురా (లంచాలపురం) నిజంగా లంచాలతో నిర్మించిన వీధా? లాహోర్‌లోని కృష్ణనగర్‌లోని ఏమి మార్పులొచ్చాయి? పాకిస్థాన్‌లో ఇప్పుడెవరూ బుర్ఖాలు ధరించడం లేదంట నిజమేనా? ఈ ప్రశ్నలతో ఎంత ఆత్మీయత ఉందంటే, లాహోర్ ఒక పట్టణం కాకుండా, వారి బంధువైనట్టు, అతని యోగ క్షేమాలు వీరు తెలుసుకుంటున్నట్టు, ఆ రోజు లాహోర్ నుండి వచ్చిన వారు అమృత్‌సర్ పట్టణానికి అతిథులైపోయారు. వారితో మాట్లాడడం చాలామందికి సంతోషాన్ని కలిగించింది.

అమృత్‌సర్‌లోని బాసా బజార్లో విభజనకు ముందు ముస్లిం పేదవర్గాలు ఎక్కువగా నివాసముండేది. అక్కడ ఎక్కువ వెదురు, వెదురు వస్తువులు తయారీ దుకాణాలుండేవి. విభజన అల్లర్లలో అవన్నీ అగ్నికి ఆహుతి అయిపోయాయి. అప్పుడు ఆ బస్తీలో చెలరేగిన మంటలకు మొత్తం అమృత్‌సర్ తగలబడిపోతుందేమోనని ప్రజలు భయపడ్డారు. ఆ మంటల్లో ఆ బస్తీలోని ముస్లింల ఇళ్ళన్నీ, కొన్ని హిందువుల ఇళ్ళు కూడ కాలి బూడిదయ్యాయి. ఈ ఏడున్నర సంవత్సరాలలో చాలా ఇళ్ళు పునర్మించబడ్డాయి. కాని కొన్నిచోట్ల శిథిలాలు అలాగే ఉండిపోయాయి. కొత్తగా నిర్మించిన ఈ ఇళ్ళమధ్యలో ఈ దిబ్బలు చిత్రంగా కనిపించేవి.



విభజన ఘర్షణల్లో బాసా బస్తీలో జరిగిన మారణకాండలో చాలామంది వారి ఇళ్ళతో పాటు అమరులయిపోయారు. అక్కడి నుండి ప్రాణాలతో పారిపోయినవారు తిరిగి వచ్చే ధైర్యం చెయ్యలేదు. కాని ఈ రోజు లాహోర్ నుండి వచ్చిన ఒక వృద్ధుడు ఆ బస్తీలోని క్రొత్త ఇళ్ళు వాటి మధ్య ఉన్న శిథిలాలలో దారి తప్పినవాడిలా తిరుగుతున్నాడు. ఎడమవైపు ఒక సందులోకి తిరగబోయి అతడు సంకోచినట్లా అక్కడే ఆగిపోయాడు. తను వెళ్ళాలనుకుంటున్న సందు ఇదేనా కాదా అని అతడు సందిగ్ధంలో పడిపోయాడు. సందులో కొందరు పిల్లలు ఆడుకుంటున్నారు. ఇద్దరు మహిళలు పెద్దగా అరుచుకుంటూ తిట్టుకుంటున్నారు.

" అంతా మారిపోయింది. తిట్లు మాత్రం మారలేదు, చేతికర్ర సాయంతో నిలబడుతూ ఆ వృద్ధుడు తనలో తను అనుకున్నాడు. అతని పైజామా మోకాళ్ళ వద్ద చినిగిపోయి ఉంది. పైన ధరించిన షేర్వానీలో అక్కడక్కడా అతుకులున్నాయి. ఒక బాలుడు ఏడుస్తూ సందులో నుండి వచ్చాడు. ఆ వృద్ధుడు

"ఇలారా బిడ్డా! ఎందుకేడుస్తున్నావు, నీకు పైస ఇస్తానురా! అని ఆ బాలుడిని బుజ్జగించాడు. అలా అంటూ అతను జేబులో చెయ్యిపెట్టి దేన్నో వెతికాడు. ఆ బాలుడు కాస్సేపు ఊరుకొని మళ్ళీ ఏడవడం ప్రారంభించాడు. ఇంతలో ఒక పదహారేళ్ళ బాలిక సందులో నుండి పరుగెత్తుకొచ్చి పిల్లవాడిని ఎత్తుకొని వెళ్ళిపోయింది. ఆ పిల్లవాడు ఏడుపు ఆపలేదు. ఆ అమ్మాయి

''ఊరుకో! లేకపోతే ఆ తురకవాడు నిన్ను ఎత్తుకుపోతాడు అని ఆ పసివాడిని ముద్దుపెట్టుకొంది."

ఆ వృద్ధుడు ఆ పిల్లవాడికివ్వడానికి జేబులో నుంచి తీసిన నాణాన్ని తిరిగి జేబులో వేసుకొన్నాడు. నెత్తిమీద టోపీ తీసి చంకలో పెట్టుకొన్నాడు. అతని గొంతెండి పోతుంది, మోకాళ్ళు కొంచెం వణుకుతున్నాయి. మూసి ఉన్న ఒక దుకాణం అరుగును ఆసరా చేసుకొని తిరిగి టోపి నెత్తిమీద పెట్టుకొన్నాడు. ఒకప్పుడు పెద్ద పెద్ద వెదురు కట్టలు ఉంచే స్థలంలో ఇప్పుడొక మూడంతస్థుల ఇల్లు వెలిసింది. ఎదురుగా ఉన్న కరెంటు తీగపై కాకులు కూర్చున్నాయి. కరెంటు స్తంభం వద్ద ఎండవైపు చూస్తూ అతను దేవుడా! అనుకొన్నాడు.

చేతిలో తాళాల గుత్తి తిప్పుకుంటూ ఒక యువకుడు సందువైపు వెళుతున్నాడు. వృద్ధుడిని చూసి

"చెప్పండి, మీరెందుకు ఇక్కడ నిలబడ్డారు" అన్నాడు.

ఆ వృద్ధుడి ఛాతీలో, చేతుల్లో కొంచెం వణుకు మొదలయ్యింది. అతను నాలికతో పెదవులు తడుపుకొని ఆ యవకుని వైపు పరిశీలనగా చూస్తూ

"బాబూ! నీ పేరు మనోరి కదా!" అని అడిగాడు. ఆ యవకుడు తాళాల గుత్తిని తిప్పడం ఆపి "నా పేరు మీకెలా తెలుసు" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఏడున్నరేళ్ళ క్రితం నువ్వు ఇంతుండేవాడివి" వృద్ధుడు చేత్తో చూపిస్తూ నవ్వే ప్రయత్నం చేసారు.

"మీరు పాకిస్థాన్ నుండి వచ్చారా"

''అవును ఒకప్పుడు మేము ఈ సందులోనే ఉండేవాళ్ళం. నా కొడుకు చిరాగ్‌దీన్, మీకు బట్టలు కుట్టే దర్జీ. విభజనకు సరిగ్గా ఆరునెలలు ముందు మేమిక్కడ కొత్త ఇల్లు కట్టుకున్నాము." వృద్ధుడు చెప్పాడు.

"ఓ అయితే మీరు గనీమియా అన్నమాట" ఆ యవకుడు గుర్తుపడుతూ అన్నాడు.

"అవును బాబూ! నేను గనీమియానే, ఇప్పుడు చిరాగ్‌దీన్‌ను అతని భార్యా పిల్లలను ఎలాగూ చూడలేను కనీసం ఒకసారి ఇల్లయినా చూద్దామని వచ్చాను." వృద్ధుడు టోపీ తీసి తలమీద చేయుంచుకొని వస్తున్న కన్నీటిని ఆపుకుంటూ అన్నాడు.

"నువ్వు విభజనకు చాలాముందే ఇక్కడి నుండి వెళ్ళిపోయావు కదా!" మనోరి సానుభూతి నిండిన స్వరంతో అన్నాడు.

"అవున్నాయనా! నా అదృష్టం కొద్దీ నేను ముందే ఇక్కడి నుండి వెళ్ళిపోయాను, ఇక్కడే ఉంటే వాళ్ళతో పాటు

నేను కూడా.. వృద్ధుడు తాను ఆ మాట అనకుండా ఉండాల్సింది అన్నట్టు మధ్యలో ఆగిపోయాడు. అతడు నోటిమాటను ఆపగలిగాడు కాని, కళ్ళలో వస్తున్న కన్నీటిని ఆపలేకపోయాడు.

"వదిలేసెయ్ గనీమియా! ఇప్పుడు ఆ సంగతులు తలచుకొని ఏమి చెయ్యగలం" ఆ యవకుడు గనీ చేతిని తన చేతిలోకి తీసుకొని

"పద నీకు మీ ఇల్లు చూపిస్తాను" అన్నాడు.

అప్పటికే బస్తీలో ఒక వదంతి వ్యాపించింది. ఒక ముస్లిం వృద్ధుడు రామదాసి కొడుకును ఎత్తుకెళ్ళే ప్రయత్నం చేసాడు. సమయానికి అక్కడి వచ్చి ఉండకపోతే, ఆ వృద్ధుడు ఆ బాలుడిని అపహరించుకుపోయేవాడే! ఈ మాట వింటూనే ఇళ్ళబయట పీటలు వేసుకొని కబుర్లు చెప్పుకుంటున్న ఆడవాళ్ళు వీధిలో ఆడుకుంటున్న పిల్లల్ని లోపలికి లాక్కుపోయారు.

గనీని తీసుకొని మనోరి సందులో ప్రవేశించేసరికి వీధిలో ఏదో అమ్ముకుంటున్న వ్యక్తి, నూతిగట్టు, ప్రక్కనున్న రావిచెట్టు క్రింద మొద్దులాపడి నిద్రపోతున్న రక్కే పహిల్వాన్ తప్ప సందులో అంతా నిర్మానుష్యంగా ఉంది. అయితే ఇంటి కిటికీల వెనుక నుండి చాలా మొహాలు వీధులోకి చూస్తున్నాయి. మనోరితో వస్తున్న వృద్ధుడిని చూసి వారిలో కొంత కుతూహలం కలిగింది. గడ్డం పూర్తిగా తెల్లబడిపోయినా, చిరాగ్‌దీన్ తండ్రి అబ్దుల్‌గనీని వారు సులువుగానే గుర్తుపట్టారు.



"అదే మీ యిల్లు" మనోరి దూరం నుండి ఒక దిబ్బను చూపిస్తూ అన్నాడు. గనీ క్షణం పాటు ఉలిక్కిపడి కళ్ళు విప్పార్చి అటువైపు చూశాడు. కొడుకు చిరాగ్‌దీన్, అతని భార్య పిల్లల మరణంనతో గనీ ఎప్పుడో రాజీ పడిపోయాడు. కాని తాము క్రొత్తగా కట్టుకొన్న ఇంటి పరిస్థితి అతనికి మింగుడుపడలేదు. ఈ దృశ్యాన్ని అతను ఊహించలేదు. అతని నాలుక తడారిపోయింది. మోకాళ్ళలో వణుకు ఎక్కువయ్యింది.

"ఈ దిబ్బా!" అతను నమ్మలేనట్టన్నాడు.

మనోరి ఆ వృద్ధుడి మనో భావాలను అర్థం చేసుకున్నాడు. అతని చేతిని ఇంకొంచెం గట్టిగా పట్టుకొని "ఆ రోజు మీ యిల్లు పూర్తిగా తగలబడిపోయింది" అన్నాడు.

గనీ తన చేతికర్ర సాయంతో ఆ దిబ్బను ఎలాగో చేరుకున్నాడు. అంతా మట్టే. అక్కడక్కడా కాలిన విరిగిన ఇటుకలు తొంగి చూస్తున్నాయి. ఇంటి ఇనుప, చెక్క సామాను ఏమీ కనిపించడం లేదు. ఎవరో ఎత్తుకుపోయినట్టున్నారు. ఎలా మిగిలిందో కాలిన ఒక తలుపు మాత్రం ఉంది. వెనకవైపున కాలిపోయిన రెండు అల్మారాల మీద నలుపుపోయి తెల్లని పొడి కనిపిస్తుంది. ఆ దిబ్బను చూసి గనీ ఇది మిగిలిందా అన్నాడు. ఇంక అతని మోకాళ్ళు సహకరించలేదు. అతను కాలిన తలుపును పట్టుకొని అక్కడే కూలబడిపోయాడు. తలను ఆ చెక్కపై అన్చి "అయ్యో! నా బిడ్డా! చిరాగ్‌దీన్" అంటూ హృదయ విదారకంగా రోదించాడు.

ఏడున్నర సంవత్సరాలు ఆ చెక్క దిబ్బలో నిలిచింది గాని, గనీ తల తగలగానే చెక్కపొడి రేణువులు గాలిలో ఎగిరాయి. కొన్ని గనీ టోపీ మీద జుట్టు మీద పడ్డాయి.

ఆ శిథిలాలలో నుండి ఒక తాబేలు చరచరా బయటకొచ్చి కాసేపు అటూ ఇటూ తిరిగి, రెండు మూడుసార్లు తలెత్తి చూసి మళ్ళీ శిథిలాల్లోకి వెళ్ళిపోయింది.

కిటికీల్లో నుంచి తొంగిచూసేవారి సంఖ్య పెరిగింది. ఈ రోజు ఏదో ఒకటి జరుగుతుందని వాళ్ళల్లో వాళ్ళు గుసగుసలాడుకున్నారు. చిరాగ్‌దీన్ తండ్రి గనీ వచ్చాడు. ఏడున్నరేళ్ళ క్రిందట సంఘటన తాలూకూ వాస్తవాలు ఇప్పుడు మళ్ళీముందుకొస్తాయి. ఆ దిబ్బే గనీకి జరిగిందంతా చెబుతుంది అని వాళ్ళనుకున్నారు.

ఆ రోజు రాత్రి చిరాగ్‌దీన్ పై గదిలో భోంచేస్తున్నాడు. అప్పుడు రక్కే పహిల్వాన్ వచ్చి, చిరాగ్‌దీన్ ఒక్క నిముషం క్రిందకు వచ్చి తన మాట వినాలని, పిలిచాడు. ఆ రోజుల్లో రక్కే ఆ బస్తీకి బాద్‌షా. అతనంటే హిందువులే భయపడేవారు. ఇక చిరాగ్‌దీన్ సంగతి చెప్పేదేముంది. అతనొక ముసల్మాన్. చిరాగ్ తింటున్న ముద్దను అలాగే వదలి క్రిందికొచ్చాడు. అతని భార్య జుబేదా, కూతుళ్ళు కిష్వర్, సుల్తానా కిటికిలో నుండి క్రిందకు చూస్తున్నారు. చిరాగ్ గడపదాటి బయటకు రాగానే రక్కే పహిల్వాన్ అతని చొక్కా కాలర్ పట్టుకొని వీధిలో క్రిందపడేసి అతనిపై కూర్చున్నాడు. చిరాగ్ కత్తిపట్టుకున్న రక్కే చేతిని పట్టుకొని "రక్కే పహిల్వాన్ నన్ను చంపొద్దు. అయ్యో! నన్నెవరైనా రక్షించండి" అని గట్టిగా అరిచాడు. పైనున్న జుబేదా, కిష్వర్, సుల్తానా కూడ అరుచుకుంటూ క్రిందికొచ్చారు. రక్కే పహిల్వాన్ అనుచరుడొకడు చిరాగ్‌ను పట్టుకొన్నాడు. పహిల్వాన్ తన మోకాళ్ళతో చిరాగ్ భుజాలను నొక్కిపట్టి "అరుస్తావెందుకురా దున్నపోతా! నేను నీకు పాకిస్థాన్ ఇస్తున్నాను. ఇదిగో తీసుకో పాకిస్థాన్'' అన్నాడు. జుబేదా, కిష్వర్, సుల్తానా వీధిగడపదగ్గరకొచ్చేటప్పటికే చిరాగ్‌కు పాకిస్థాన్ ఇవ్వబడింది. అప్పుడు చుట్టుపక్కల ఇళ్ళ కిటికీలన్నీ మూసుకుపోయాయి. ఈ దృశ్యాన్ని చూసిన కొందరు ఇళ్ళలోకి వెళ్ళి తలుపులు మూసుకొని జరిగిన సంఘటన పర్యవసానాల నుండి తప్పించుకొన్నారు. మూసిన తలుపుల నుండి కూడ వారికి చాలాసేపు జుబేదా, కిష్వర్, సుల్తానాల అరుపులు వినిపించాయి. రక్కే పహిల్వాన్ అతని అనుచరులు ఆ రాత్రి ఆ ముగ్గురు మహిళలకు కూడ పాకిస్థాన్ ఇచ్చారు. కాకపోతే ఇంకొంచెం వేరే పద్ధతిలో తర్వాత ఆ ముగ్గరి శవాలు చిరాగ్ ఇంటివద్ద కాకుండా దగ్గరలోని కాలవలో దొరికాయి.

ఆ తర్వాతి రెండు రోజులు చిరాగ్ దీన్ ఇంటిలో

సామాన్ల దోపిడి జరిగింది. తర్వాత ఎవరో ఆ యింటిని తగులబెట్టారు. ఇంటిని తగులబెట్టిన వారిని బతికుండగానే పాతేస్తానని రక్కే శపథం చేసాడు. ఎందుకంటే చిరాగ్ క్రొత్త ఇంటిని ఆక్రమించే ఉద్దేశ్యంతోనే రక్కే చిరాగ్‌ను అతని కుటుంబాన్ని అంతం చేసాడు. ఆక్రమించుకొనే ముందు ఆ తురకవాడి ఇంటిని శుద్ధి చేయడానికి రక్కే పహిల్వాన్ పూజాసామాగ్రిని కూడ సిద్ధం చేసుకున్నాడు. కాని ఆ ఇంటిని ఎవరు తగలబెట్టారన్న సంగతి అప్పటి నుండి ఇప్పటివరకు అంతుబట్టలేదు. ఈ ఏడున్నర సంవత్సరాల నుండి తగులబడ్డ ఆ ఇంటి దిబ్బను రక్కే తన ఆస్తిగా భావిస్తున్నాడు. అతని అనుమతి లేకుండా ఆ దిబ్బ వద్దకు ఎవ్వరూ వెళ్ళకూడదు, కనీసం పశువులను కూడా అక్కడ కట్టనివ్వడు.

జరిగిన సంగతులన్నీ గనీకి ఏదో విధంగా తెలుస్తాయని బస్తీ వాసులు ఆశిస్తున్నారు. దిబ్బను చూడగానే గన్నీ అన్నీ తెలుసుకుంటాడు అనుకున్నారు.

గనీ దిబ్బమీద మట్టిని తన చేతి గోళ్ళతో గీకుతూ తననెత్తి మీద చల్లుకుంటూ, "చెప్పు చిరాగ్‌దీన్ నువ్వెక్కడికి వెళ్ళిపోయావు అయ్యో కిష్వర్, అయ్యో సుల్తానా! నన్నెందుకు వదిలేసారమ్మా అంటూ ఏడుస్తున్నాడు.



చెట్టు క్రింద నిద్రపోతున్న రక్కే పహిల్వాన్‌ను ఎవరైనా లేపారో లేక అతనే లేచాడో తెలియదు కాని, అతనికి ఎవరో చెప్పారు పాకిస్థాన్ నుండి అబ్దుల్ గనీ వచ్చాడని ఆ దిబ్బ దగ్గర ఏడుస్తున్నాడని, రక్కే గొంతుకలో ఏదో అడ్డం పడినట్టయి గురగురలాడింది. అతను కాండ్రించి నూతిగట్టుమీద ఊసాడు. అతని గుండెలో కూడ ఏదో గురగురలాడింది. అతని క్రింద పెదవి ముందుకు సాగింది.

"గనీ దిబ్బ దగ్గర కూర్చున్నాడు" రక్కే అనుచరుడు లచ్చే అతనికి దగ్గరగా కూర్చుటూ అన్నాడు.

" ఆదిబ్బ అతనిదెలా అవుతుంది. ఆ దిబ్బ మనది." రక్కే కాస్త వణుకుతున్న స్వరంతో అన్నాడు.

"కాని అతను అక్కడే కూర్చున్నాడు" లచ్చే రహస్యం చెపుతున్నట్టు అన్నాడు. "కూర్చుంటే కూర్చోనియ్ నువ్వు నాకు చిలమ్ తీసుకురా!" రక్కే తన కాళ్ళు వెడల్పుగా చాపి, ఆఛ్ఛాదన లేని తొడలమీద చేతులుంచుకుంటూ అన్నాడు.

"మనోరి గనీకి అసలు సంగతి చెపితే" లచ్చే చిలమ్ నింపడానికి వెళుతూ అలాగే రహస్యంగా గొణిగాడు."

"ఈ మనోరికి ఏమి దాపురించింది." రక్కే అన్నాడు. లచ్చే వెళ్ళిపోయాడు. రావిచెట్టు నుండి నూతిగట్టుమీద రాలిన పాత ఆకులు చాలా ఉన్నాయి. రక్కే ఆకుల్ని తన చేతిలోకి తీసుకొని నలపడం ప్రారంభించాడు. లచ్చే చిలమ్ తెచ్చాడు.

రక్కే ఒక దమ్ము లాగి ''గనీలో ఇంకెవరైనా మాట్లాడారా?" అన్నాడు

"లేదు"

"తీసుకో" రక్కే చిలమ్ లచ్చేకిచ్చాడు.

మనోరి గనీ చెయ్యి పట్టుకొని దిబ్బనుండి తీసుకొస్తున్నాడు. లచ్చే కంగారుగా చిలమ్ నుండి దమ్ము లాగుతున్నాడు. అతని కళ్ళు గనీవైపు, రక్కే వైపు మార్చి మార్చి చూస్తున్నాయి.

మనోరి గనీ చెయ్యి పట్టుకొని అతని కంటె ముందు నడుస్తున్నాడు. గనీ రాతి గట్టుమీద కూర్చున్న రక్కే పహిల్వాన్‌ని చూడకుండా, కలవకుండా వెళ్ళాలని మనోరి ప్రయత్నం. కాని కాళ్ళు చూపుకొని కూర్చున్న రక్కేను గనీ దూరం నుండే గుర్తుపట్టాడు.

గనీ రెండు చేతులు చాచి, 'రక్కే పహిల్వాన్' అని అరిచాడు. రక్కే మెడఎత్తి, కళ్ళు కొంచెం చిన్నవి చేసి గనీవైపు చూసాడు అతని గొంతులో గరగర శబ్దం. కాని అతను మాట్లాడలేదు.

గనీ చేతులు దించుతూ "రక్కే పహిల్వాన్! నన్ను గుర్తుపట్టలేదా, నేను గనీని అబ్దుల్ గనీని, చిరాగ్‌దీన్ తండ్రిని" అన్నాడు.

రక్కే ఆ వృద్ధుడిని పై నుండి క్రిందివరకు పరీక్షగా చూసాడు. అతన్ని చూడగానే గనీ కళ్ళల్లో ఒక మెరుపు మెరిసింది. రక్కే క్రింద పెదవి కదిలింది.

'' ఆ విన్నాను గనియా'' అన్నాడు.

మళ్ళీ గనీ తన చేతులు చాపాడు. రక్కే నుండి ఎటువంటి స్పందన లేకపోవడంతో, గనీ చెట్టును పట్టుకొని నూతి గట్టు అంచుమీద కూర్చుండిపోయాడు.

ఇళ్ళ కిటికీల నుండి మళ్ళీ సంచలనం మొదలయ్యింది.

ఆ ఇద్దరూ ముఖా ముఖీ అయ్యారు. ఇక తిట్లూ శాపనార్థాలూ మొదలవుతాయి. ఇప్పటి పరిస్థితుల్లో రక్కే పహిల్వాన్ గనీని కొట్టే సవాలే లేదు. ఇప్పుడా దిబ్బ గనీది కాదు, రక్కేది కాదు, ప్రభుత్వానిది. మనోరి కూడ ఒట్టి పిరికివాడు. చిరాగ్‌దీన్‌ను, అతని భార్యా బిడ్డలను చంపింది రక్కే అని అతను గనీకి ఎందుకు చెప్పలేదు. రక్కే మనిషి కాదు ఆంబోతు. రోజంతా అచ్చేసిన ఆంబోతులా బస్తీలో తిరుగుతాడు. పాపం గనీ ఎంత చిక్కిపోయాడు. గడ్డం అంతా నెరసిపోయింది.

గనీ నూతిగట్టు అంచుమీద కూర్చుని "చూసావా రక్కే పహిల్వాన్ ఏమయ్యిందో! కళకళలాడుతున్న ఇంటిని వదిలెళ్ళాను. ఈ రోజున ఈ మట్టి దిబ్బను చూడ్డానికి వచ్చాను. నిండైన ఇంటికి గుర్తుగా ఈ మట్టి దిబ్బ మిగిలింది. నిజం చెప్పాలంటే ఈ మట్టిని వదిలెళ్ళాలంటే కూడా నా మనసొప్పడం లేదు. ఆ వృద్ధుని కళ్ళు మళ్ళీ నీటితో నిండిపోయాయి.

రక్కే కాళ్ళు దగ్గర పెట్టుకొన్నాడు. నూతిమీదున్న తువ్వాలు తీసి భుజం మీద వేసుకొన్నాడు. లచ్చే అందించిన చిలమ్ తాగుతున్నాడు.

"నువ్వు చెప్పు రక్కే ఇదంతా ఎలా జరిగింది?" గనీ తన కన్నీటిని ఆపుకుంటూ అడిగాడు. "మీరందరూ ఉన్నారు.

అందరి మధ్య సోదరుల మధ్య ఉండే ప్రేమ ఆప్యాయతలు ఉండేవి. చిరాగ్ ఎవరి ఇంట్లోనైనా దాక్కోలేకపోయాడా! వాడికామాత్రం తెలివి ఎందుకు లేకుండా పోయింది."

"అలా జరిగిపోయింది." రక్కే పహిల్వాన్‌కు తన స్వరం తనకే అసహజంగా అనిపించింది. అతని పెదవులు తడితో అతుక్కుపోయాయి. అతని మీసాల్లో నుండి చెమట అతని పెదవులపై కారుతుంది. అతని నెత్తిమీద ఏదో బరువు పడినట్టయింది. అతని ఎముకలు ఆసరా కోరుతున్నాయి.

"పాకిస్థాన్‌లో మీ పరిస్థితులు ఎలా ఉన్నాయి" రక్కే అడిగాడు. కాని అతని కంఠంలోని నరాల్లో ఏదో ఆందోళన. అతను తువ్వాలుతో చంకల్లోని చెమటను తుడుచుకున్నాడు. మళ్ళీ కాండ్రించి ఉమ్మాడు.

"ఏమి చెప్పను రక్కే! నా పరిస్థితి ఏమిటో ఆ భగవంతుడికే తెలుసు. నాతో చిరాగ్ ఉంటే అది వేరుగా ఉండేది. నాతో వచ్చేయమని వాడిని ఎంతో బతిమాలాను. కాని వాడు క్రొత్తగా కట్టుకొన్న ఇంటిని వదలిరానని మొండికేసాడు. ఇది మన బస్తీ, ఇక్కడ మనకెటువంటి ఆపాయం ఉండదని నాతో అన్నాడు. పిచ్చిపక్షి! బస్తీలో వాళ్ళు మనవాళ్ళయినా బయటవాళ్ళ నుండి ప్రమాదం రావచ్చని తెలుసుకోలేకపోయాడు. ఇంటికోసం నలుగురు ప్రాణాలు పోగొట్టుకున్నారు! రక్కే! నీవంటే చిరాగ్‌కు చాలా గురి, నమ్మకం రక్కే పహిల్వాన్ ఉండగా తననెవరూ ఏమీ చేయలేరనేవాడు. కాని ప్రాణాల మీద కొచ్చినప్పుడు రక్కే కూడా ఏమీ చెయ్యలేకపోయాడు."



రక్కే నిటారుగా కూర్చునే ప్రయత్నం చేసాడు. పొట్టలో నుండి ఏదో వచ్చి అతని శ్వాసను ఆపుతున్నట్టనిపించింది. అతని చర్మమంతా చెమటతో తడిచిపోయింది. అతని పెదవులు నాలుక మధ్య దూరం పెరిగినట్టయ్యింది. బట్టతో అతను తన పెదవులను తుడుచుకున్నాడు. అతని నోటి నుండి 'హే ప్రభూ! నీవే వున్నావు, నీవే ఉన్నావు' అనే మాటలు వెలువడ్డాయి.

పహిల్వాన్ పెదవులు ఎండిపోతున్నట్టు, అతని కళ్ళ క్రింద నల్లని చారలు లోతుకు పోయినట్టు గనీ గమనించాడు. గనీ పహిల్వాన్ భుజం మీద చెయ్యివేసి అలా జరగాలనుండి జరిగిపోయింది రక్కే! ఇప్పుడు వారిని ఎవ్వరూ వెనక్కి తీసుకురాలేరుగా! దేవుడు మంచివాళ్ళకు మంచి చేసి చెడ్డవాళ్ళను క్షమించుగాక! నేను వచ్చి మిమ్ములను కలిసాను. చిరాగ్‌నే కలిసాననుకుంటాను. అల్లా మీకు ఆరోగ్యమిచ్చుగాక!" అంటూ గనీ తన చేతికర్రసాయంతో లేచి నిలబడ్డాడు "వస్తారక్కేయా" అన్నాడు.

రక్కే గొంతులో నుండి ఏదో శబ్దం వచ్చింది. గనీ చుట్టూ మరొక్కసారి చూసి నెమ్మదిగా ఆ సందులో నుండి బయటకు వెళ్ళిపోయాడు.

ఇళ్ళ కిటికీల్లో నుండి మళ్ళీ కలకలం బయలుదేరింది. సందుబయట మనోరి గనీకి అసలు సంగతి చెపుతాడా! గనీ ముందు రక్కే ఎలా కుచించుకుపోయాడో! ఇప్పుడు కూడా ఆ దిబ్బ దగ్గర ఎవరైనా పశువులను కడితే అరుస్తాడా! పాపం జుబేదా ఎంతమంచిది. ఈ రక్కే వెధువకు ఇల్లూ, వాకిలీ లేదు. వీడికి తల్లీ, చెల్లీ అంటే తెలుస్తా?

కొద్దిసేపటికి ఆడవాళ్ళు ఇళ్ళల్లో నుండి వీధిలోకి వచ్చారు. పిల్లలు వీధిలో గిల్లిదండా ఆడుకోసాగారు. పన్నెండు పదమూడు సంవత్సరాల వయసున్న ఇద్దరు ఆడపిల్లలు దేనికో వాదించుకుంటున్నారు.

రక్కే బాగా చీకటి పడేవరకూ నూతిగట్టు మీదే కూర్చుని చిలమ్ తాగుతూనే ఉన్నాడు. అటుగా వెళ్ళిన కొందరు "రక్కే సాబ్! పాకిస్థాన్ నుండి ఈ రోజు గనీ వచ్చాడని విన్నాము" అని అడిగారు.

' ఆ వచ్చాడు' రక్కే అందరికీ ఒకే జవాబిచ్చాడు.

'అయితే'

'అయితే ఏమీ లేదు, వెళ్ళిపోయాడు'

ప్రతి రోజులాగే, ఆ సాయంత్రం కూడా రక్కే సందు ఎడమవైపున ఉన్న దుకాణం అరుగుమీద కూర్చున్నాడు. ప్రతీ సాయంత్రం అక్కడ కూర్చుని మెళుకువలు చెప్పేవాడు. కాని ఈ రాత్రి పదిహేనేళ్ళ క్రిందట తను వెళ్ళిన వైష్ణోదేవి యాత్రా విశేషాలను తన అనుచరుడు లచ్చేకు చెప్పాడు. లచ్చే వెళ్ళిపోయిన తర్వాత సందులో కొచ్చి, లోకుపండిత్ తన బర్రెను దిబ్బ దగ్గర కట్టేదయం చూసి అలవాటు ప్రకారం దాన్ని అక్కడ నుండి తోలేసాడు. అక్కడే మూత్ర విసర్జనకు కూర్చున్నాడు. సందులో నిశ్శబ్దంగా ఉంది. వీధి దీపాలు వెలిగించక పోవడంతో చీకటిగా ఉంది. దిబ్బ క్రింద ఉన్న కాలువ నుండి నీరు పారే శబ్దం వినిపిస్తుంది. చీకటి రాత్రి నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ దిబ్బలో నుండి చ్యూచ్యూ, చిక్‌చిక్, కిర్రకిర్ర్ వంటి రకరకాల శబ్దాలు వినిపిస్తున్నాయి. ఎక్కడి నుండో ఒక కాకి వచ్చి దిబ్బమీద వాలింది. కాకి అక్కడ వాలగానే దిబ్బ ఇంకోవైపు నుండి ఒక కుక్క భౌభౌ అని అరుస్తూ వచ్చింది. కాకి కావ్ కావ్ మంది. కాస్సేపటికి కుక్క అరుపుల ధాటికి తట్టుకోలేక కాకి రెక్కలు కొట్టుకుంటూ ఎగిరిపోయి రావిచెట్టు మీద వాలింది. కాకి వెళ్ళినపోయిన తర్వాత కుక్క దిబ్బ క్రిందికి దిగి వచ్చి రక్కే పహిల్వాన్ వైపు తిరిగి అరవడం ప్రారంభించింది. రక్కే దాని తోలడానికి పెద్ద గొంతుతో దుర్‌దుర్ర్ అని అరిచాడు. కాని కుక్క భయపడకుండా అతనికి ఇంకా దగ్గరగా వచ్చి అరిచింది.

రక్కే చిన్న రాయి తీసుకొని దానిపై విసిరాడు. కుక్క కాస్త వెనక్కి వెళ్ళింది. కాని అరవడం మానలేదు. రక్కే కుక్కతల్లిని తిట్టి నెమ్మదిగా నూతిగట్టు చేరుకొని అక్కడపడుకొన్నాడు. కుక్క అతనివెంటే వచ్చి దూరంగా నిలబడి అరవసాగింది. అలా చాలాసేపు అరిచి, వీధిలో ఎవ్వరూ తిరగడం లేదని నిర్ధారించుకొని ఆ కుక్క వెనక్కు దిబ్బ దగ్గరకు వెళ్ళి దిబ్బకు ఒక ప్రక్కన పడుకొని గుర్రు గుర్రు ప్రారంభించింది.

# కవిత

## భీమారి



- భూతం ముత్యాలు
9490437978

ఇంటిగోడపై - వేలాడే దిష్టిబొమ్మనై
నా దేశం ఎప్పుడో ఈ నేలపై ఖండ ఖండాలుగా
తెగిపడ్డ మాంసం ముద్దలు
నీకు నాకు మజ్జ కులకంచె చెరగని హద్దులు

బాల్యాన్ని చిదిమేస్తూ - జీవితాన్ని బలిస్తూ
కసాయి చేతిలో తల్వార్ కవాత్తు జేస్తుంది
కోల్పోయిన చూపు గాజుకళ్ల పుర్రె
అస్థిపంజరంలో యాదులుకెర్లి పురుడుపోస్కున్నయ్

మేమిక్కడే ఉంటాం, ఆదివాసులమై అనాగరికులమై
అస్పృశ్యులమై అంటరాని కడగొట్టు జాతులుగా ఖండించబడి

మా పుట్కే కారణం - వేనవేల వసంతాలూ ఎన్నకు ఎల్లి ఎతుక్కుంటాం
మా అస్తిత్వ అడ్డుజాడలు - గుర్తించిందెక్కడ ఎర్కుంటే చెప్పండి ఎవరైనా
నా యవ్వనం నీ కామదహనంలో కాలి బూడిదైంది
దేహాలు పంచనామ చేయండి, మృతుల మతలబేందో తెలుస్తది

ఆకలి కలిలో అరిగోసలు వింటిని
గడియ గడియకు బిక్కు బిక్కుమంటూ నల్గిన బత్కు ఎతకంటిని
నా జాతోళ్లె నా మీద కత్తులు దూస్తరు - నిందల అస్త్రాలు సందిస్తరు
నాకిపుడు పగలూ రేయి ఒక్కటే..
చీకటిని గతుకుంటున్న వారి ఉన్మత్త రాక్షస క్రీడలో దేహం
రుక్మతి మన్ను తీపి బాధలే బరాయించినా నిశ్శబ్ద గీతమై నను నేను ఆలపిస్తాను

నా దేహం ఇప్పుడు గాయాలతో పునీతమైంది
అశ్రుధారలతో శుద్ధత పొందింది
ఐనా ఇంకా వేటకాని గురిమల్లె వారి సూటి నా వైపే ఎక్కు పెట్టబడిఉంది
నా నీడై, తోడై, ఎండలో గొడుగై మండే దివిటి వెలుగై
నిరాయుధున్ని - నిస్సహాయున్ని - సాక్ష్యం గోడమీద శిలువెక్కింది
కుటిల లోకం బీమారిల నిజం మంచం బట్టింది
ఆశలు చలికాలపు రాలుతున్న ఆకులు
మొఖం సాటేసిన వసంతం వస్తదా?
మోడు దేహం జీవజల ఆశ ఇగురేస్తదా?

---

## మట్టి నానీలు

-నాంపల్లి సుజాత
9848059893

అరె! సారెమీంచి
పచ్చికుండ దించుతుండు
తాతా నీ చెయ్యికి
జోహార్లు !

ఘట వాయిద్యమని
మురిసిపోకు
ఈ పేద ఘటంలోంచే
పుట్టిందది.

ముండ్ల కంపమీది
కట్లపువ్వు మొల్ల
ప్రతి కూలత లెన్నైనా
వికసించింది



బింకి దెంత
వయ్యారమో
తాటి చెట్టు ఆకాశంలో
ఉయ్యాలలూగుతుంది

స్టీరింగ్ తిప్పుతానని
బడాయినీకు
కుమ్మరి సారె
తిప్పు చూద్దాం !

## భ్రమలు

- భూషి కృష్ణదాసు
040-27240213

అబద్ధాలు పేర్చి
వాళ్ళ బ్రతుకులు ఆర్పి
కట్టుకొన్న మేడ మీద కూర్చొని
ప్రపంచాన్ని జయించాలని చూస్తావు
కింద
గుడిసెలోళ్ళ గుండెల్లో పొయ్యి
రాజుకుంటోంది
రాజుగారి మేడైనా
కూలిపోవచ్చు



**విశ్లేషణ**

# అక్షర శ్రామికుడు - భాషా శాస్త్రజ్ఞుడు



**- తెలకపల్లి రవి**

***రాసినట్టే మాట్లాడాలని చెప్పడం తిరగబడిన తర్కం. కానీ అచ్చంగా మాట్లాడినట్టే రాయాలనడం ఆచరణ సాధ్యంకాని ఆదర్శం అని సోదాహరణంగా చెప్పడంలో ఆయన వాస్తవిక దృష్టి తెలుస్తుంది. రాత కూడా వందల ఏళ్లుపూర్తి చేసుకున్నాక కొన్ని సంప్రదాయాలు స్థిరపడిపోయాయి. వాటిని ఏ పేరుతోనైనా కృత్రిమంగా పెకలించి వేయాలనుకోవడం కుదిరే పని కాదు.***

చేకూరి రామారావును ఎలా అర్థం చేసుకోవాలి? చేరాతల రీతుల విలక్షణత ఏమిటి? 'మహాకవులు లోగడ చెప్పిందే మళ్లీ మళ్లీ చెప్పినట్టు' ఈ విషయంలో చెప్పాల్సింది ఇంకా అదనంగా ఏమైనా మిగిలివున్నదా?

ఆధునిక తెలుగు సాహిత్యంలో గత ఇరవయ్యేళ్లలో తెలుగు సాహిత్యానికి, భాషకు, విద్యాబోధనకు, జర్నలిజానికి, పుస్తక ప్రచురణకు ఆయన బహుముఖ సేవలందించారని చెప్పడం చర్వితచరణం. వీటన్నింటి ద్వారా ఒక విశాల చర్చకు, మేధా కార్యచరణకు ఆయన పెట్టిన వరవడి అంతకన్నా పెద్దసేవ. ఆవిధంగా చూస్తే చేరా చాలా అరుదైన అక్షర శాస్త్రజ్ఞుడు. అలుపెరగని శ్రామికుడు కూడా. తన ప్రతిభా పాండిత్యాలను జనరంజకంగానూ, అదే సమయంలో ఆలోచనా స్ఫోరకంగానూ ఉపయోగించడం ఆయన వలె చేతనైన వారు ఎందరో ఉండరు. భాషా చర్చకు గల సామాజిక పార్శ్వం తరచూ విస్మరించబడుతుంటుంది.

రాళ్లపల్లి నుంచి రారా వరకూ కొకు నుంచి కెవిఆర్ వరకూ మనకు ఎందరో ప్రసిద్ధ విమర్శకులున్నారు. నిజమే. కానీ సాహిత్యానికి కావలసింది విమర్శ మాత్రమే. కాదు. అంతకన్నా ముఖ్యమైంది ప్రోత్సాహం. కాళోజీలాటి వాళ్లు బాగా జయప్రదమైన కారణాలలో అదొకటి. ఆచరణలో కాళోజీ చేసిన పని అక్షరాలలో చేరా చేశారు. అదీ అనితర సాధ్యంగా. ఆంధ్రజ్యోతిలో కాలమ్‌గా రావడం వల్లనే చేరాతలకు అంత విలువ వచ్చిందని ఎవరైనా అనుకుంటే అది పాక్షిక సత్యం అవుతుంది. అదే నిజమైతే అంతకన్నా ప్రజాదరణ గల పత్రికలలో రాసేవారు కూడా అంత ప్రభావం ప్రసరించి ఉండాలి కదా. అలా జరగలేదని మనందరికీ తెలుసు. పథానికి, దృక్పథానికి సంబంధించిన సమస్య తప్ప ఇది పత్రికలలో రాయడం, రాయకపోవడం ఒక్కటే కాదు. అంత కాలం అంతమంది కవులను గురించి, రచనలను గురించి విస్తారంగా, విశ్లేషణాత్మకంగా రాయాలంటే సాహిత్యం పట్ల ఎంత నిబద్ధత ఉండాలి (చేరా అన్నట్లు ఆ మాట విరసం పుట్టుక తర్వాత వచ్చిందని అంగీకరించకపోయినా). అలాగే వాటిని తులనాత్మకంగా అధ్యయనం చేయడానికి మరెంతగా ప్రేమాభిమానాలు, శ్రద్ధాసక్తులు ఉండాలి ? అంతకు మించి మరెంత అవగాహన, అధ్యయనం కావాలి ? నవ్యతను గుర్తించగలిగిన సామర్థ్యం, వైవిధ్యాన్ని ఆహ్వానించగలిగిన సాహసం ఉన్నవారు మాత్రమే ఆ పని చేయగలరు.

చేరా ఈ పని చేసిన కాలం కూడా చాలా కీలకమైనది. సాహిత్యంలో అభ్యుదయ ఉద్యమాలు వెనకపట్టు పట్టి, స్వల్పకాలిక అనుభూతి పర్వం (ఒక వాదంగా) అనంతరం,

అనేక రకాల అస్తిత్వవాదాలు అల్లుకుంటున్న సంధి దశలో ఆయన ఈ కాలమ్ నిర్వహించారు. ప్రధాన పత్రికలు కొన్ని సాహిత్యానికి స్థలం కేటాయించని స్థితిలో ఒక పాపులర్ దినపత్రికలో ధారావాహికంగా రాయడం ద్వారా చేరా నవతరం కవులు, కవయిత్రుల ప్రయత్నానికి ఒక దిశానిర్దేశం చేయడానికి దోహదపడ్డారు. సాహిత్య విలువల కోణం నుంచి - సాంకేతికంగా చెప్పాలంటే టెక్చువల్ విమర్శ చాలా ఓపిగ్గా చేయడం ద్వారా చేరా ఆ కొత్తవారికి ఒక విశ్వాసాన్ని ఇవ్వడమే కాక వారిని ఇతరులు అర్థం చేసుకోవడానికి మార్గమేదో కూడా చూపగలిగారు.

***సాహిత్య విలువల కోణం నుంచి - సాంకేతికంగా చెప్పాలంటే టెక్చువల్ విమర్శ చాలా ఓపిగ్గా చేయడం ద్వారా చేరా ఆ కొత్తవారికి ఒక విశ్వాసాన్ని ఇవ్వడమే కాక వారిని ఇతరులు అర్థం చేసుకోవడానికి మార్గమేదో కూడా చూపగలిగారు.***

స్త్రీవాదం పట్ల అపార్థాలు, అసహనాలు అతి తీవ్రంగా ఉన్న దశలోనే చేరా కవయిత్రుల బాధావేదన స్వరాల తీవ్రతను, తీక్షణతను గుర్తించి అభినందించారు. వారిలో ఒక్కొక్కరి రచనల పైనా ప్రత్యేక పరిశీలన జరిపి తగు పాఠాలు నేర్పారు. వాణీ రంగారావు నుంచి విమల వరకూ, ఇద్దరు నిర్మలల వరకూ ఎవరూ ఆయన పరిశీలనా పరిధిలోకి రాకుండా పోలేదు. వారి కవితాంశాలనే గాక కవితా గుణాలను కూడా ఆయన సోపపత్తికంగా విశ్లేషించి కొన్ని కొలమానాలను ఏర్పరచగలిగారు. స్త్రీవాదాన్ని నీలి కవితలు అని తిట్టిపోస్తున్న దశలో ఈ పని చేయడానికి చాలా ధీమా కావాలి. ఈ విషయంలో ఆయన అభిప్రాయాలన్నిటితో ఏకీభవించినా, లేకపోయినా ఆయన నిర్వహించిన పాత్ర విస్మరించడానికి వీలు కానిది. స్త్రీల రచనలను ప్రోత్సహించడంలో ఆయన ప్రత్యేకాసక్తి గిట్టనివారు పరమ చౌకబారు దాడులకు దిగడం సాహిత్యకారులమనుకునే కొందరి అసంస్కారానికి నిదర్శనం. వాస్తవానికి చేరాతలలో ఉన్నది స్త్రీల రచనల పరామర్శేనా? నాయని, విశ్వనాథ, శ్రీశ్రీల నుంచి యాకూబ్ వరకూ కొన్ని తరాల కవులను ఆయన స్పృశించారు. పద్య, గేయ, వచన కవులెందరినో పరామర్శించారు. భావకవిత్వం నుంచి గద్దర్ పాటల వరకూ పరిచయం చేస్తూ వాటి విశిష్టతలు కళ్లకు గట్టారు. ఈ కోవలో దళిత కవిత్వాన్ని ఆయన లోతుగా పరిశీలించకపోవడానికి కారణాలేవైనా ఉండవచ్చు. అంతమాత్రాన రాసిన దాని విలక్షణత తగ్గదు. నచ్చిన వారిని ధారాళంగా పొగిడే ఒక లక్షణం చేరాలో ఉన్న మాట నిజమే కాని వారిలో లోపాలను, అనవసర వ్యవహారాలను కూడా ఆయన తప్పక ప్రస్తావిస్తారు. నవ్యతను రెండు చేతులా ఆహ్వానించే చేరా సంప్రదాయం వైపు, అలంకారశాస్త్రం వైపు, పద్యం వైపు మొగ్గుతున్నారా అని సందేహం కలిగించిన సందర్భాలు చాలా ఉన్నాయి. అయితే ఇవన్నీ ఆయన బహురూపితనాన్ని తెలియజేసేవే. అంతెందుకు? వట్టికొండ రంగయ్య, పలుపుల శివయ్య, తుమ్మల వెంకట్రామయ్య వంటి తొలి తరం ఉద్యమ కవులను గురించి ఎంతో విలువైన విశ్లేషణలు చేయడంలో చేరా చిత్తశుద్ధి గోచరమవుతుంది. అభ్యుదయవాదులం అనుకునే కొందరు కూడా అలాటి వారికి నమస్కార బాణం పెట్టడం తప్ప రచయితలుగా వారి శక్తిని పరిశీలించడానికి ప్రయత్నించకపోవడం ఒక వైపరీత్యంగా కొనసాగుతోంది. అచ్చసాహిత్యవాదిగానూ అభియోగాలను ఎదుర్కొనే చేరా వారిని సగౌరవంగా పేర్కొనడం ఈ కారణంగానే ప్రస్తావనార్హమవుతుంది. అకడమీషియన్‌గా ఆయన స్థాయి రీత్యానూ ఇది విశేషమే. తన జ్ఞాపకాలలోనూ ఆయన కమ్యూనిస్టు ఉద్యమకారుల గురించి, వారి స్ఫూర్తి గురించి ఉన్నతంగా రాస్తారు. రాజకీయంగా ఆయన కమ్యూనిస్టు సిద్ధాంతాలను ఉటంకించడం అరుదు. ఒక దశలో మార్క్సిస్టు మూల సూత్రాలను తన వాదనలకు మద్దతుగా తీసుకున్నట్టు కనిపిస్తుంది. కానీ ఎక్కువ భాగం స్వంత సూత్రీకరణలుగానే చెబుతారు. పైగా తనిప్పుడు కమ్యూనిస్టు సిద్ధాంతానికి గల పరిమితులను పరిశీలించే పనిలో ఎక్కువగా ఉన్నట్టు ఒక సందర్భంలో అభిప్రాయం వెలిబుచ్చారు. విప్లవ సాహిత్యం, రాజకీయాలు అనే చేరా వాటిని అకడమిక్‌గానో, అవసరార్థమో తప్ప కన్విక్షన్‌గా చెప్పకపోవడం గమనార్హం. భాషాశాస్త్రంపై రాసిన వాటిలో మాత్రం స్టాలిన్‌ను ఉటంకించి తన వాదన వినిపించారు. కమ్యూనిస్టులను గురించి చెప్పినప్పుడు కూడా వారి రాజకీయాలు వారివి అన్నట్టు చెప్పడం ఎక్కువ ...

వేర్వేరు రంగాలకు చెందిన వ్యక్తులను గురించి వివరంగా రాయడంలో చేరా మనుషులను ఎంత గౌరవించేదీ తెలుస్తుంది. వ్యక్తిగతంగా చేరాను చూసినవారికి ఇది తెచ్చిపెట్టుకున్న గుణంగా ఎంత మాత్రమూ అనిపించదు. తన తర్వాతి తరాలవారి ప్రతిభను గుర్తించే శక్తి ఉన్నట్టే తనకు ముందు, తనతోపాటు పనిచేసిన వారి గొప్పతనాన్ని గుర్తించగలిగిన నమ్రత ఆయనలో ఉంది. కనుకనే విదేశాల్లో భాషాశాస్త్రంలో తనతో పనిచేసిన వారి నుంచి ఇక్కడి సహచరులు, సీనియర్ల వరకూ పదే పదే ప్రస్తావించి ప్రశంసిస్తారు. అందులో ఆ స్థానం భద్రిరాజు

కృష్ణమూర్తిగారిదే. ఇలాటి చారిత్రక స్పృహ అందరిలో ఉండదు.

ముందే చెప్పినట్టు తెలుగుభాష రచనా, సంభాషణా సమస్యలను గురించిన చర్చను చేరా సరైన దృక్పథంలో ముందుకు తేగలిగారు. 1975లో తెలుగు మహాసభలకు తెలుగువాక్యం పుస్తకం తెచ్చినప్పుడు - అంటే నా కాలేజీ రోజులలో భాష పట్ల ఆసక్తి కలగడానికి ఆయన కారకులు. తర్వాతి కాలంలో బూదరాజు రాధాకృష్ణ, డి చంద్రశేఖరరెడ్డి, కేతు విశ్వనాథరెడ్డి లాంటివారు తెలుగుభాష గురించి చర్చ చేసినా ఇందులో గురుతర ముద్ర చేరాకే చెందుతుంది. అంతేగాక పాఠ్యపుస్తకాల్లో భాషను మార్చడంలోనూ, జగన్నాథ రథచక్రాల వంటివి తెలుగు పుస్తకాలలో ప్రవేశించేలా చేయడంలోనూ చేరా పాత్ర చాలా ఉంది. ఈ రీతిలోనే జర్నలిజంలో తెలుగు భాష సంతరించుకుంటున్న మార్పులను ఆయన ముందుగా పసిగట్టి భాష్యం చెప్పగలిగారు.

వ్యవహారికం, గ్రాంథికం, మాండలికం లాంటి రేఖలలోనే ఆలోచించకుండా ఆయన విశాల కోణం నుంచి భాషా సమస్యను చేపట్టగలిగారు. రాసినట్టే మాట్లాడాలని చెప్పడం తిరగబడిన తర్కం. కానీ అచ్చంగా మాట్లాడినట్టే రాయాలనడం ఆచరణ సాధ్యంకాని ఆదర్శం అని సోదాహరణంగా చెప్పడంలో ఆయన వాస్తవిక దృష్టి తెలుస్తుంది. రాత కూడా వందల ఏళ్లుపూర్తి చేసుకున్నాక కొన్ని సంప్రదాయాలు స్థిరపడిపోయాయి. వాటిని ఏ పేరుతోనైనా కృత్రిమంగా పెకలించి వేయాలనుకోవడం కుదిరే పని కాదు. 'బడు' వాడాలా, వద్దా అనేది మన ఇష్టాలను బట్టి ఉండదంటూ ఆ మాట వద్దన్న నండూరి రామమోహనరావుగారే ఎలా వాడారో చేరా ఉదహరిస్తారు. 'జరిగింది' అని మాట చివర చేర్చడం అనవసరమే కానీ కొన్ని సందర్భాల్లో ఆ అవసరం ఎలా వచ్చేది చెబుతారు. ఈ వివరణలన్నీ చేరా 'భాషానువర్తన' సజీవతను పట్టి చూపిస్తాయి. తమాషా ఏమంటే పదేళ్ల కిందటే మాతృభాషకు ప్రమాదం గురించి హెచ్చరించిన చేరా తర్వాత దశలో ఇంగ్లీషు వల్ల తెలుగుకు ఏ ప్రమాదమూ లేదని చెప్పడం ! ఆయన చెప్పిందంతా చదివితే విషయం తెలుస్తుంది గాని ఇందాక చెప్పినట్టు స్వీపింగ్ రిమార్కుల వల్లనే గజిబిజి ఏర్పడుతుంది. బహుశా అది పత్రికా సాంగత్యం వల్ల పట్టుబడిన సంచలనశీలత కావచ్చు. కమ్యూనిస్టులు వస్తు ప్రధానంగా చూడటం వల్లనే తెలుగు సాహిత్యం పాడైపోయిందన్నట్టు ఒక పత్రిక ఇంటర్వ్యూలో చేరా చేసిన వ్యాఖ్య కూడా గుర్తుండే ఉంటుంది. మాటల విలువ బాగా తెలిసిన ఆయన నుంచి అడపాదడపా ఇలాటి మాటలు వెలువడకుండా ఉంటే బావుణ్ణనుకున్నా ఆ వ్యాఖ్యల విలువను గౌరవించేవారు.

*సాహితీ స్రవంతి అపూర్వంగా నిర్వహించిన తొలి సాహిత్యశాలను 2005 లో విజయవాడలో ఆయనే ప్రారంభించారు. తర్వాత కూడా అనేక సభలకు వచ్చేవారు. ఒకసారి ఘంటసాల పాటల కార్యక్రమంలో నేను మాట్లాడితే ఎంతో సంతోషించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రానికి తన గ్రంథాలను బహూకరించారు.*

చేరా వ్యక్తిగతంగా ఏదో మేరకు ఇరవయ్యేళ్ల నుంచి నాకు పరిచయం. 1994లో నా వీక్షణ-సమీక్షణ పుస్తకం ఆయనకు పంపి ప్రతిస్పందన కోసం ఎదురుచూశాను. అనేకమంది యువ రచయితలకు మంచి విశ్లేషణనిచ్చిన చేరా ఒత్తిడి వల్ల కావచ్చు దానిపై స్పందించలేకపోవడం ఇప్పటికీ ఒక నిరుత్సాహంగా మిగిలిపోయింది. ఆయన ఎడిటర్‌గా ఎన్నో మంచి గ్రంథాలు తెచ్చిన హైదరాబాద్ బుక్ ట్రస్టు సుందరయ్యగారి వీర తెలంగాణా పోరాటం పుస్తకానికి బొమ్మారెడ్డి సంక్షిప్తీకరణను ప్రచురించినప్పుడు చేరా ముందుమాట రాశారు. గత మూడేళ్లలోనూ మా సాహిత్య ప్రత్యేక సంచికలకు చేరా ఇంటర్వ్యూ లేదా రచనలు అడిగి కుదరలేదు. వారివి వేయలేదని బయటవారు అన్నప్పుడు జవాబు చెప్పవలసి వచ్చేది. అయితే గత పదేళ్ళ నుంచి ఆయన వ్యక్తిగతంగానూ, సాహిత్యపరంగానూ దగ్గరయ్యారు. 2003లో మన చేరా పేరిట ఖమ్మంలో మిత్రుల ప్రోత్సాహంతో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ఆయన అభినందన సభ చాలా గొప్పగా జరిగింది. ఆయన పుస్తకాలు కూడా ఆ పేరుతో వచ్చాయి. ఆయన ఆప్తమిత్రులలో ఒకరైన హరి కోసమూ, తన పుస్తకాలకు సంబంధించీ కూడా చేరా ప్రజాశక్తి బుకహౌస్‌తో సంబంధం పెట్టుకోవడం బాగా పెరిగింది. సాహితీ స్రవంతి అపూర్వంగా నిర్వహించిన తొలి సాహిత్యశాలను 2005లో విజయవాడలో ఆయనే ప్రారంభించారు. తర్వాత కూడా అనేక సభలకు వచ్చేవారు. ఒకసారి ఘంటసాల పాటల కార్యక్రమంలో నేను మాట్లాడితే ఎంతో సంతోషించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రానికి తన గ్రంథాలను బహూకరించారు. అన్ని సంస్థల, తరగతుల గౌరవాభిమానాలు పొందిన ధన్యజీవి చేరా.

## కవిత

# వాళ్ళను ఉరితీద్దాం రండి ...

-అనిశెట్టి రజిత
9849482462

వాళ్ళను ఇన్నాళ్లూ దయతో
బతకనిచ్చాం
చిన్న చూపు చూస్తూనో
నిర్లక్ష్యం చేస్తూనో
వాళ్ళ ఉనికిని పశుప్రాయంగా
భావిస్తూనే ఉండనిచ్చాం
వాళ్ల దారిద్ర్యాన్ని
అడివికి ఆరతినిచ్చాం
వనశక్తులకు బలిచ్చాం ..



వాళ్ళను వేటాడుతూ
మోసగిస్తూ దోచుకుతింటూ
ఇష్టారాజ్యంగా ఉంటున్నాం
మైదానాల నుండి వచ్చాం
అని వాళ్ళ గూడాలపై దిగబడి
నాగరికత తెచ్చాం అని
నమ్మబలుకుతూ కులికాం
వాళ్ళ సంస్కృతిని కల్తీజేసి
బతుకుల్ని కొల్లగొట్టి
వాళ్ళ హక్కుల్ని కాలరాసాం ..

ఇంకా వాళ్ళ ఆటవీ భూముల్ని
అన్యాక్రాంతం చేసి బలిసిపోవడానికి
వాళ్ళపై గద్దలతో దాడులు చేయించి
భయభీతుల్ని చేసి చెదరగొట్టాం

అన్నెంపున్నెం ఎరుగని ఆడబిడ్డలపై
అత్యాచారాలు చేయించి
సాయుధ బలగాల శక్తిని
రుచి చూపించాం
పచ్చని ఆ గ్రామాలను
రాబందుల్లా తొక్కి పొక్కిళ్లు చేస్తాం
..

ఇంకా ఇంకా మనకేం కావలట
వాళ్ళను 'ముంపు'కు గురిచేయటం
వాళ్ళ ఆనవాల్లను 'జలసమాధి'
చేస్తూ

వాళ్ళను అడవినుండి విడగొట్టి
మృత్యుకుహరాల్లో కుక్కడం
అంతకన్నా మనమేం చేయగలం
పునర్నిర్మాణం చేతగాని
పుచ్చుమెదళ్ళతో నియంతల
నీడల్లో దుండగీల్లా
బయలు దేరిన వాళ్ళం ..

వాళ్ళ భరతం పట్టేందుకు
భారీ ప్రాజెక్టుల నిర్మాణాల దాకా ఎందుకు
వాళ్ళను అంచెలచెలుగా
ఉరితీద్దాం రండి!
మెల్లెమెల్లెగా ఉసురులు మింగేద్దాం రండి!
విధ్వంసానికి "అభివృద్ధి" అనే
బోర్డు తగిలించి
వినాశనాలకు తెర తీస్తూ
పునరావాసం! నష్టపరిహారమనే
అగ్నికీలలకు వారిని
ఆహుతిద్దాం రండి!

**(పోలవరం ముంపు బాధితుల పట్ల రాజ్యం, నాగరిక జనం వైఖరికి)**

---

# మాగ్గూడా బతకాలనుంది

- కన్నోజు లక్ష్మికాంతం
9246338115

క్షణికావేశపు వేడి ఊపిర్లవల్ల
చెత్తకుప్పల దగ్గర పాపలేడుస్తున్నప్పుడు
ఎత్తుకోవాలను కునేవారికి
ఎంగిలి కూడు ప్రస్తావనుండదు గానీ
పొత్తిళ్ళలోంచి ఎత్తిపడేసిన వారిని మాత్రం
కుత్తుక కోసినా లాభం లేదనిపిస్తుంది.
మేఘాలు ఒరుసుకుంటున్నప్పుడు
మెరుపూ, ఉరుము తప్పదని తెలిసినా
ముత్యాల చినుకులు సముద్రం పాలవుతున్నందుకే
తిమింగలాల గురించి ఆలోచించాలిమరి.
"చితికి" పోతున్న జీవితాల గురించి
కారణాలు వెతుక్కోడం కాదుగానీ
నమ్మించి మోసం చేస్తున్నవారిని
నడివీధిలో పాతరేయాలనిపిస్తోంది.
అదుగంటిపోతున్న ఆత్మీయతకూ



మానవ సంబంధాల ఊసే తెలియదు.
ఆప్యాయతలేని ఆలింగనాలకూ
అమ్మానాన్నల అనుభూతే దొరకదు
జీవితం క్షణం భంగురమే అయినా
కర్కశత్వపు రాక్షసుల కబంధహస్తాల్లో
ఊపిరి పోసుకోకుండానే
ఉసూరు మంటున్న నెత్తిటిముద్దలన్నీ
"మాగ్గూడా బతకాలని వుందంటు" రోదిస్తే
బండ మనసులు కరిగి దోసిళ్ళు పట్టినా
గుండెనిబ్బరంతో సంకెళ్లు తెగ్గొట్టినా
రాబోయేతరాలకు అమ్మ దొరుకుతుందీ..
లాలింపూ, ఓదార్పుల
ఆలంబనా దొరుకుతుంది.

## కవిత

# మట్టి మొలక

- ఒబ్బిని
9849558842



పూలమీద తేనెటీగలు వాలినట్లు కనబడే
చెట్ల గుబుర్ల వెనుక ముద్దుగారే పొద్దుటి సూర్యుడు
సాయంత్రానికి
మెట్రోరైలు ట్రాక్‌మీది
'యాడ్ పోష్టరు' అవుతున్నాడు!
కళల చంద్రుడు
రాత్రి నుండీ రొటేట్ అవుతూ, అవుతూ
వేకువజాముకి
తిరగబడ్డ 'యాంకర్'లా కనిపిస్తున్నాడు!
ప్రకృతి ఊసెత్తితే
మనం ఎప్పుడూ ఓడిపోతూనే ఉంటాం!
ఎవరు బతుకుతున్నారు? ఎవరెవరు బతుకుతున్నారు!
బతుకు బతుకుగా ఎంతమందికి అందుతుంది?
శిశిరం రాల్చిన ఆకుల పోగులు
చెంపలపై ఆరిన కన్నీటి చారికలవుతున్నాయి!
ఈనాటి లేచిగుళ్ల వృక్షాలు
చెరచబడ్డ స్త్రీలవుతున్నాయి!
ప్రతీచోటా భీతే నిత్యవసంతమవుతుంది!
పెళ్ళిళ్లూ, పేరంటాలూ
ప్రభుత్వాల దయాదాక్షిణ్యాలవడం వలన
పండుగలు గుర్తుకురావడం లేదు!
అసలు ఎవరు చిగురిస్తున్నారు?
అసలు ఎవరు పుష్పిస్తున్నారు? ఫల ప్రదమవుతున్నారు!
టాబ్లెట్లు విత్తనాలవుతాయా?
ఆఖరికి భాషకూడా బ్రతకడం లేదు!
ప్రకృతి కొండలన్ని పిండయిపోతూ
ఒకటీ రెండు నోట్ల కొండలు మొలుచుకొస్తున్నాయి!
వాటిమీద
ఒకటీ అరా మర్రిచెట్లు
మాత్రమే పెరుగుతున్నాయి!
వజ్రాల పూల షాండ్లియర్స్ లాంటి
వేపపూల గుత్తులూ,
వేసవి ఆకాశానికి
నిషాలా పని జేసే మల్లె సొగసులూ,
జడగంటల్లాంటి మామిడి పిందెలూ,
తిరునామాల్లాంటి మిరపపళ్లూ,
పసుపు కుంకాల రాశుల్లాంటి పూల పోగులూ.
పరిమళాలతో నిండిన
వసంతప్రీతి ఎవరినేత్రాల్లో నాట్యమాడుతుంది?
కందువాలన్నీ చెరకు గడలన్న భ్రమలని
కట్టిపెట్టమంటుంది కోయిల పాట!
ఎవరు బతుకుతున్నారు? ఎవరెవరు బతకుతున్నారు!
పిట్టల పాటలని
బతుకు పాటల తాళాలుగా ఎవరు పొందుతున్నారు?

మనిషి చిట్లాలి!
మనిషి చిట్లి మట్టి అవ్వాలి!
మట్టి నుంచి మొలకెత్తాలి!
వసంతాన్ని సొంతం చేసుకోవాలి!

ప్రస్థానం వెబ్‌సైట్: www. prasthanam.com

'ప్రస్థానం' కు చందా కట్టండి!
నెల నెలా మీ ఇంటికే ప్రస్థానం తెప్పించుకోండి!!

అయిదేళ్లకు : రు. 500 /-, పదేళ్లకు : రు. 1000/-,
సంవత్సర చందా (వ్యక్తులకు) : రు. 120/-,
సంవత్సర చందా (సంస్థలకు) : రు. 150/-
విడి ప్రతి : రు. 10/-



5,10 సం||ల చందా కట్టిన వారికి సుమారు 1000/-లు విలువ చేసే పాత ప్రస్థానం పుస్తకాలు ఉచితం.
■ ట్రాన్స్‌పోర్టు ఛార్జీలు అదనం

ఒక మంచి పత్రికకు చందా కట్టండి! - తెలుగు సాహిత్య కృషిని ప్రోత్సహించండి!!

ప్రస్థానం

ఎం. హెచ్. భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్టిసి కళ్యాణమండపం దగ్గర, హైదరాబాద్-20
వివరాలకు : 040-27660013, సెల్: 9490099059 ; ఇ.మెయిల్ : ssprasthanam_@gmail.com ; www. prasthanam.com

# స్వీకారం

## నవీన సుమతి శతకము




– డా॥ కాసల నాగభూషణం

వెల : రూ.30/– పేజీలు : 31

ప్రతులకు : 09444452344

ఆనాటి కాలమాన పరిస్థితుల కనుగుణంగా సుమతి శతకం వచ్చింది. అందులోని కొన్ని భావాలకు నేడు కాలం చెల్లింది. ఈనాటి కాలమాన పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఆనాటి సుమతి శతక పద్యాల రచనా విన్యాసాన్ని అందిపుచ్చుకొని నాగభూషణం గారు అనుసృజనాత్మక రచన చేశారు.

**- ఆచార్య వెలుదండ నిత్యానందరావు**

## బోయకొట్టములు పండ్రెండు




చారిత్రక నవల

– కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్ళె

వెల: రూ.180/– పేజీలు : 273

ప్రతులకు : 9502304027

దాదాపు రెండు వందల సంవత్సరాల కాల వ్యవధిలోనే ఆవిర్భవించి, విస్తరించి, అభివృద్ధి పొంది, ఒక వెలుగు వెలిగి కేవలం ఒకరోజులో మాత్రమే జరిగిన యుద్ధంలో సమూలంగా నేలమట్టమయిపోయి తిరిగి కోలుకోలేని విధంగా అంతరించిపోయిన బోయకొట్టముల విషాదగాథనే బాలసుబ్రహ్మణ్యం పిళ్ళె ఈ నవలలో చారిత్రక దృష్టితో చిత్రించడం ఎంతో ఆసక్తికరంగా ఉంది.

**- అంపశయ్య నవీన్**

## తెలంగాణోదయం




పద్య కవితా సంపుటి

– ఆచార్య మసన చెన్నప్ప

వెల : రూ.80/– పేజీలు : 77

ప్రతులకు : 9885654381

అక్షరంలో పరిమళం ఉంటుందని అతికొద్ది మంది విద్వాంసులకు మాత్రమే తెలుసు. ఆచార్య మసన చెన్నప్ప గారు విద్వాంసులు. వారికి ఆ పరిమళం తెలుసుననడంలో సంశయం లేదు. వారు చాలా గ్రంథాలు రాశారు. వారికి అక్షరపు పరిమళం తెలియును.

**- డాక్టర్ దాశరథి రంగాచార్య**

## కర్తవ్యం




(కవన కదంబం)

– మడిపల్లి భద్రయ్య

వెల : రూ.90/– పేజీలు : 206

ప్రతులకు : 9885830550

మడిపల్లి భద్రయ్య గారి జీవితానికి ఈ పుస్తకం ప్రతిబింబం లాంటిది. ఇతని మానవీయ విలువలకు నమూనా వంటిది. తన అనుభవాలతో పాటు, ఆదిలాబాద్ జనజీవితాన్ని కవిత్వమయం చేశాడు. తన యాస, భాష, తాను పుట్టిపెరిగిన గడ్డపై మమకారాన్ని వ్యక్తం చేశారిందులో.

**- డా॥ ఉదారి నారాయణ**

## ఇడుపు కాయితం




కవిత్వం

– డా॥ కాసుల లింగారెడ్డి

వెల : రూ.100/– పేజీలు : 112

ప్రతులకు : 8897811844

వచన కవిత్వం మొదట్లో శబ్దాలంకారాలతో, ఉపమాలంకారాలతో, రూపకాలంకారాలతో వెలువడుతూ వచ్చింది. వచన కవిత్వం రూపం పూర్తిగా మారిపోయిందనే గుర్తింపు చాలా మందికి తెలియడం లేదు. కేవలం చెవికి ఇంపుగా తోచే అలంకారాల నుంచి వచన కవిత్వం దూరమై సంపూర్ణమైన వచన కవిత రూపుదిద్దుకుంది. లింగారెడ్డి 'ఇడుపు కాయితం' లోని స్వీయానుభూతులకు సంబంధించిన కవితలు ఈ స్థాయిని అందుకున్నాయి.

**- కాసుల ప్రతాపరెడ్డి**

## నానీల చినుకులు




కవిత్వం

– బి. గీతిక

వెల : రూ.50/– పేజీలు : 48

ప్రతులకు : 7702600583

కలం కదులుతోంది/ కాగితం మీద./ ఏ కాంతి లోకాలకు/ దారులు తీస్తుందో...!

నీడలు/ అందంగానే ఉన్నాయి./ ఎలాగున్నాయో.. / వాటివెనుక నిజాలు..!

పిట్టలకి/ రెక్కలొచ్చాయి./ పుట్టిన గూటిని/ వదిలెయ్యడమే స్వేచ్ఛా..?

**-బి. గీతిక**

# స్వీకారం




## రాణీ పులోమజాదేవి కథలు

కథా సంపుటి

– రాణీ పులోమజాదేవి

పేజీలు : 194

ప్రతులకు : 9949384891

ఈ కథా సంకలనం కాలక్షేపం బఠానీ కాదు – కాలానుగుణంగా ఎన్నో మార్పులు మానవజీవితాల్లో చోటుచేసుకున్నా, మౌలిక బంధాలకు ప్రాముఖ్యతనిస్తూ, ఛాదస్తాలకు అతీతంగా, సాధారణ సమస్యలకు పరిష్కారాన్ని ఆలోచింపజేసే, "అవునా? మనమూ ఇంతేనా?" అనే ప్రశ్నలను మనకు మనం వేసుకుని, క్లిష్టమైన సమస్యలను వీలైనంత సరళ సమీకరణంగా మార్చుకునే ప్రయత్నం చేయించే ప్రయత్నం.

**- ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం**




## భావములో తరంగమై

– చక్రపాణి నరసింహమూర్తి

వెల : లేదు పేజీలు : 82

ప్రతులకు : 9440141745

వీరు పద్యము చెప్పుటలోనూ, గేయాన్ని మడతలు విప్పుటలోనూ సిద్ధహస్తులైనా, తొలికృతిని వర్తమాన ప్రక్రియ ఐన వచన కవిత్వంగా ఆవిష్కరిస్తున్నందుకు ఆనందిస్తున్నాను. మూర్తిగారిలోని వర్తమాన సామాజిక సాహితీ సమదృష్టిని, వచనాన్ని ప్రవచనాన్ని ప్రవచనంగా సులభ సుందరంగా చెప్పిన ఈ కవిగారి కావ్య సృష్టిని, కళారస దృష్టినీ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

**- వి.పి. చందన్ రావు**




## గడ్డిపరక

కవితా సంపుటి

– పి. లక్ష్మణరావ్

వెల : రూ.25/- పేజీలు : 120

ప్రతులకు : 9441215989

విషయ స్పష్టత ఉంది. లక్ష్య స్పష్టత ఉంది. ఇది దీర్ఘకాలిక సాధన అని తెలుసు. ఆయన ఏ ప్రక్రియలో రాసినా ఈ తెలివి, ఈ తర్కం, సామాజిక చర్య, ప్రతిచర్య కన్పడుతూనే ఉంటుంది. అటు జీవితంలోను, ఇటు కవితా సాధనలోను ఒక దశకు వచ్చారు... పరిణతికి వచ్చారు.

**- శివారెడ్డి**




## సగం సగం కలసి

కవిత్వం

– కోడం పవన్‌కుమార్

వెల : రూ.70/- పేజీలు : 109

ప్రతులకు : 9848992825

తన అక్షరాలకు పదునుపెట్టి, వాటినే తన రక్షణ కవచాలుగా చేసుకుని ఏకలవ్యుడిలా, అభిమన్యుడిలా ఏకకాలంలో ముందుకు సాగిపోతాడు. ఈ ఉద్యమంలో తాను వర్గవాదా, అస్తిత్వవాదా అనే యోచన చేయడు. సంక్షోభాల్ని ముందు బట్టబయలు చేస్తాడు. అందుకు తన పాఠకుల మద్దతు కోరుతాడు. తన అనుభవాన్ని వాళ్ళదిగా చేసి తనవైపు తిప్పుకుంటాడు.

**- ప్రొ. జయధీర్ తిరుమలరావు**




## నేర్చుకోవటానికి మొదటి పుస్తకం

– సంకలనం: దేవినేని మధుసూదనరావు

వెల : రూ.11/- పేజీలు : 32

ప్రతులకు : 0866-2862424

కాబోయే పట్టభద్రులు ఈ పుస్తకంలోని అంశాలను మొదటి సంవత్సరం నుండే చదివి వాటిమీద అవగాహన పెంచుకున్నట్లయితే, వారు తేలికగా ఉద్యోగం సంపాదించటమే కాక, వారికి, వారి కుటుంబాలకు, సమాజానికి ఉపయోగపడగలరనే అభిప్రాయంతో ఈ చిరుపుస్తకాన్ని ముద్రించాం.

**- దేవినేని మధుసూదనరావు**




## జ్ఞాపకం

కథా సంపుటి

– రాచమళ్ళ ఉపేందర్

వెల : రూ.45/- పేజీలు : 84

ప్రతులకు : 98492 77968

కథా శిల్పం గురించిన అధ్యయన శీలం కలిగిన రచయిత ఉపేందర్. కనుక, వస్తువు, ఇతివృత్తం... చదువరులలో గాఢమైన అనుభూతిని కలిగించటానికి ఆవశ్యకమైన శిల్పాన్ని ఎన్నుకోవటం ఆయనకు పట్టుబడిన విద్యే! ఆ గుణ నైపుణ్యమే ఈ కథల్లోను కనిపిస్తున్నది. ప్రత్యేకించి ప్రక్రియాపరంగా అచ్చమైన 'కథానిక' ని రాస్తున్నప్పుడు ఈ గుణ విశేషం మరీ కొట్టవచ్చినట్లు ద్యోతకమవుతోంది.

**- విహారి**

# స్వీకారం

## గాంధీ నిజస్వరూపం




- జనసాహితి

వెల : రూ.120/- పేజీలు : 311

ప్రతులకు : 08592-232404, 9440591520

సామ్రాజ్యవాదులకూ, దోపిడీవర్గాల ఏజంట్లకూ, పచ్చి అవినీతిపరులకూ నరహంతక రాజకీయులకు కూడా గాంధీ బొమ్మ ఆత్మరక్షణ కవచంగా ఉపయోగపడుతోంది. రాజకీయ విలువలు కుప్పకూలిపోయిన నేటి పరిస్థితులకు గాంధీవాదాన్ని ప్రత్యామ్నాయ ఆదర్శంగా ప్రదర్శనకు నిలిపేవారికి జవాబుగా ఈ పుస్తకం కొంతయినా తోడ్పడవచ్చు.

- జనసాహితి

## అవిశ్రాంతి మూర్తికి అక్షరాభిషేకం




- అభినందన సంచిక

వెల: రూ.250/- పేజీలు : 178

ప్రతులకు : 9985171411

'కనురెప్పల మీద వాలిన నమ్మకమైన కల'గా కవిత్వంతో మమేకమైన 58 ఏళ్ల జీవితంలో 31 సంవత్సరాల అధ్యాపకవృత్తి నిబద్ధత, మూడున్నర దశాబ్దాల కవిత్వ నేపథ్యం, రెండున్నర దశాబ్దాల అవార్డు చరిత్ర రాధేయ సొంతం. అందుకే ఈ అభినందన సంచికాసుమాహారం.

- వి.చంద్రశేఖర్ శాస్త్రి

## సుజలాం - సుఫలాం




నవల

- పారుపల్లి వెంకటేశ్వరరావు

వెల : రూ.180/- పేజీలు : 172

ప్రతులకు : 9848161208

కొన్ని యథార్థ ఘటనల్ని, కొందరు వ్యక్తుల ఆదర్శ జీవన విధానాల్ని ఆధారంగా తీసుకొని, ఔచిత్యానికి భంగం కాకుండా అసహజమైన అతిశయోక్తులు లేకుండా, కొన్ని సన్నివేశాల్ని స్వయంగా కల్పించి, మిశ్రకథగా సుజలాం సుఫలాం నవల రచించాను.

- పారుపల్లి వెంకటేశ్వరరావు

## రాయక్క మాన్యమ్




దళిత మహిళల కతలు

- జూపాక సుభద్ర

వెల : రూ.120/- పేజీలు : 120

ప్రతులకు : 9441091305, 994831167

తెలంగాణా దళిత స్త్రీల శ్రమ జీవితాలను, అణచివేతలపై వారి ప్రతిఘటనలను, న్యాయం, సహోదరత్వం సమానత్వాల కోసం వారు చేస్తున్న పోరాటాలను జీవంతో నడుస్తున్న బొమ్మలుగా రచయిత్రి ఈ కథల్లో ఆవిష్కరించిన తీరు అభినందించదగినది.

- కన్వీనర్, దండోరా ప్రచురణలు

## సీమ సాహితీ స్వరం శ్రీ సాధన పత్రిక




- సాహితి

- డా॥ అప్పిరెడ్డి హరినాథ్ రెడ్డి

వెల : రూ.200/- పేజీలు : 264

ప్రతులకు : 9963917187

హరినాథరెడ్డి గ్రంథం ఒక బాధ్యతను, ఒక కర్తవ్యాన్ని నేటి పరిశోధకుల ముందుంచుతున్నది. రాయలసీమ నుంచి వచ్చిన ప్రతికలన్నిటినీ సంపాదించి, వాటిలో వచ్చిన సాహిత్యాన్ని అధ్యయనం చేసి సాహితీ సాంస్కృతిక రంగంలో రాయలసీమ ముందు వెనుకడుగులను నిర్ణయించడమే ఆ కర్తవ్యం, ఆ బాధ్యత.

- ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి

## ప్రవహించే నానీలు




సాహిత్యం

- తిరుక్కోవెల భాస్కర్

వెల : రూ.50/- పేజీలు : 42

ప్రతులకు : 8008958142

"పుస్తకంలోని/అక్షరాలు/ప్రమిదల్లోని దీపాల్లా/ ఉన్నాయి" - అక్షరాలు పదాలలో ఒదిగి : పదాలు వాక్యాలుగా ఎదిగి జ్ఞానాన్ని వేదకాలం నుండి ఈనాటి వరకూ ప్రసరిస్తూనే ఉన్నాయి. జ్ఞానమంటే వెలుగే, వెలుగంటే జ్ఞానమే, కనుక, అక్షరాన్ని దీపంతో పోల్చడం సమున్నత భావ ఆవిష్కరణకు మంచి నిదర్శనం.

- సుద్దాల అశోక్ తేజ

## కవిత

# ఆధారం చేజారుతున్న క్షణం

- పోతగాని
9441083763

వాడి ఆగమనానికి అంగీకార నగారా మోగింది
పచ్చని జీవన పచ్చికలో దుమ్ము సుడులు తిరిగింది
దేగాసురుడి ఆకలి తీర్చేందుకు
ఈ సారి చిల్లర జీవాల వంతొచ్చింది
చమురు సముద్రాలెన్నో మింగిన
అడుగు లేని కడుపు వాడిది
శాంతి నెపంతో స్మశానాలు సృష్టించిన
అడగరాని ఘనత వాడిది
వాడు ఆరేసుకున్న రెక్కల నీడల్ని మోస్తున్న దేహాలన్నీ
అనివార్యంగా బతుకుదెరువును ఆవిరి చేసుకొని
చరిత్ర నూతిలోంచి జ్ఞాకాలను తోడుకుంటూ
కదలలేక కదులుతున్న కళేబరాలు
వాడి అదుపులేని పెత్తనాన్ని సహిస్తున్న మౌనాలన్నీ
సందిగ్ధ సంధ్యల్ని భుజానికెత్తుకొని
చీకటి ఉబిలోకి జారిపోతూ
మిణుగురు వెలుగుల్ని స్వప్నిస్తున్న ఆర్తనాదాలు
దుకాణం తెరిచింది మొదలు
దిక్కులన్నీ పిక్కటిల్లే దిగంబర ప్రకటన
కోరికల్ని గుర్రాలను చేసి బరిలోకి దూకిస్తుంది



కొనడాన్ని కొలబద్ధను చేసి
సరుకులతో మనిషికి వెలకడుతుంది
ప్రచారం డాంబికంగా సాగుతుంది
ప్రభావం డాలర్లై పండుతుంది
లాభాలను శ్వాసించే గ్లోబల్ వ్యాపారికి
ఎర్ర తివాచీలు పరిచే ఏలికల దాష్టీకానికి
అప్యాయంగా ఆదుకున్న పచారీ కొట్లు
చెల్లిపోయిన చిల్లర పైసలై
చిరునామా కోల్పోతుంటే
మనుషులే సరుకులై ప్రాఫిట్ల రాకెట్లలో
ఇంధనాలై మండుతుంటారు
భూమి కూడా సరుకుల చుట్టూ
గిరికీలు కొడుతుంది
ఏ పాపం ఎరుగని కాలం
మూలాలను గుర్తు చేస్తూ
తూర్పు దిక్కుకు ప్రవహిస్తుంది
మార్పు వచ్చేది, రావాల్సిందీ
తూర్పు నుంచే కదా!

# ఇంకెన్నాళ్ళూ

ఇంకెన్నాళ్ళూ ఇంకెన్నాళ్ళూ నారి ఆర్తనాదాలు ఇంకెన్నాళ్ళూ...
ఇంకెన్నాళ్ళూ, ఇంకెన్నాళ్ళూ కీచకుల అరాచకాలు ఇంకెన్నాళ్ళూ
పాపలూ, పడుచులూ, అభయ, నిర్భయలై
అమాంతంగా కబళించే నరమృగాల పాలై
కన్నీటి ధారలై రాలిపోయే తారలై
అనుక్షణం తల్లడిల్లే గాలిలో ప్రమిదలై
భరతావని మూగ రోదనింకెన్నాళ్ళూ...
చీమను నలిపేసినట్టు నిర్దయగా నలుపుతారు
మాటు చూసి కాటేసి తలరాతే మార్చుతారు.
ముందు వెనక చూడకుండ కఠిన శిక్ష వెయ్యండి
మాన ప్రాణ చోరులను నిలువున నరికెయ్యండి
మౌనం, సహనం, జాప్యం ఇంకెన్నాళ్ళు ...
వర్షించే మేఘమే గర్జించుట మానునా
అణిగి మణిగి ఉంటే నీకు న్యాయం చేకూరునా
ఒదిగి ఉన్న శౌర్యాన్ని ఉప్పెనలా మార్చుమా
స్వరక్షకై తెగించి నీవు ప్రళయమై సాగుమా
జంకు, బెణుకు క్షణ క్షణం ఇంకెన్నాళ్ళూ....



- ఫర్జాన బేగం
9493006026

# గాజా మనసు గాయపడింది

-డా॥ పి.విజయ లక్ష్మి పండిట్
9441736843

మత యుద్ధాల మారణ హోమంలో
శత్రువుల బాంబుల దాడులతో
గజ గజ వణుకుతోంది గాజా పట్టణం.
మానవత్వమే మనిషి మతం అని మరచి,
ప్రాంత, మత, కుల కక్షలతో, లింగ వివక్షలతో
ప్రపంచ జీవావరణం కలుషితమై
మనిషి మనుగడ అశాంతి మయమ్
ఆందోళనకరం ప్రస్నార్థకమ్.

ఈ జగతిలో మనిషికే కాదు
ఈ భూమి పైని ప్రతి అణువుకు
భూమి భూభాగానికి ఓ చైతన్యం ఉంటుంది.
అగ్నికి ఆహుతైన శలభాల్లా
తన ఒడిలో రాలి పడుతున్న
అమాయక పసి పిల్లల, వృద్ధుల, స్త్రీల, ప్రజల
శవాలను చూసి గాయపడిన మనసుతో
దుఃఖిస్తుంది గాజా ఆసహాయంగా.

## నివేదిక

# ‘శివ’మెత్తిన కవితా యోధుడికి ‘మువ్వా’ పురస్కారం



‘‘చలిని ఎదుర్కొనే ధైర్యమున్నవాడే/ పొద్దున్నే బయటికొస్తాడు చేతులు కాలుతాయని తెలిసిన వాడే మంటని ముట్టుకుంటాడు గుప్పిట పట్టుకుంటాడు/ ఒకానొక సందర్భంలో/ దేశంలో నిరసించటమే వీరకార్యమౌతుంది! దేహమూ, ప్రాణము విలువయినవే/ అత్యంత ప్రీతి కరమైనవే – ఒక దేశం కోసం ఒక సమిష్టి ప్రయోజనం కోసం వాటిని లెక్క చేయనివాడే హీరో వాటిని వెచ్చించినవాడే హీరో / రాజ్యముంటుంది/ రాజ్యహింస వుంటుందని తెలిసీ రాజ్యం ముఖం మీద గుద్దగలిగిన వాడే హీరో’’ అంటూ రాజ్యాధికారంపై నిప్పులు చెరిగే కవిత్వంతో నాటి ‘రక్తం సూర్యుడు’ నుండి ‘ఆసుపత్రి గీతం’ నుండి నేటి ‘గాథ’ వరకూ శివమెత్తుతున్న శివారెడ్డికి కవితా హృదయాల గమ్మంలో ఘనసత్కారాన్ని నిర్వహించారు.

ఒక సంవత్సరం క్రితం కవిత్వం చుట్టూ పచార్లు కొడుతూ ‘సమాంతర ఛాయలు’గా వెలిసిన మువ్వా శ్రీనివాసరావు ఇప్పుడు “సిక్స్ ఎలిమెంట్”ను తన దృక్పథ ఎసెన్స్‌గా మలిచిన సందర్భంగా తన తల్లిదండ్రి “మువ్వా పద్మావతి రంగయ్యల పేరు మీద ఒక ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి, ఆ ఫౌండేషన్ ప్రథమ పురస్కారాన్ని ఈ నెల పన్నెండున స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రంలో శివారెడ్డి ప్రధానం చేశాడు. ఈ ఉత్సవం తెలుగు సాహితీలోకానికి ఒక గొప్ప అనుభూతిని, స్ఫూర్తిని ఇచ్చేదిగా మిగిలింది. పాతిక మంది ప్రముఖ కవులు అతిథులుగా పాల్గొన్న ఈ సాహితీ సభలో హైకోర్టు జస్టిస్ చంద్రకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని శివారెడ్డి గారికి పురస్కారాన్ని అందించారు. “ప్రపంచ సాహిత్యాన్ని, ఆర్థిక శాస్త్రాన్ని, ఫిలాసఫిని చదివిన కవి శివారెడ్డి” అని కవి అంటే దార్శనికుడని, భయంలేని వాడే నిజమైన మనిషి, అన్యాయాలు, దోపిడీలపై తన గొంతుకను కవిత్వమై సమాజానికి అందించిన ఈ కాలపు సమాజకవి శివారెడ్డి’ అని న్యాయమూర్తి శివారెడ్డిని అభినందించారు.

“సమాజంలో కవులు, కళాకారులు, నిర్మాణాత్మక శక్తులని, కవిత్వం రాయడమంటే ఖడ్గంలో సహజీవనం చేయడమేనని మొద్దుబారడం, మోడువారడానికి వీళ్ళేదని” పురస్కారం గ్రహీత శివారెడ్డి తన జీవితానికి కవిత్వానికి ఉన్న సంబంధాన్నీ వివరించారు. భూపోరాటాలు, ఉద్యమాలు లేకుండా నా కవిత్వం లేదన్నారు. మనిషిగా పుట్టింది ఆంధ్రాలో అయినా కవిగా పుట్టిందీ పెరిగిందీ హైద్రాబాద్‌లోనే అని, తెలంగాణ ఉద్యమాలే నన్నింతవాడ్ని చేసాయని, కవులు నూతన తెలంగాణ కోసం కృషిలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

రెండు వేల మంది సాహితీ వేత్తలు, కవులు, సాహితీప్రియులు పాల్గొన్న ఈ సాహితీ పురస్కారం ప్రధానోత్సవ సభకు ప్రముఖ కవి ఖాదర్ మోహియుద్దీన్ అధ్యక్షత వహించారు, కవి సీతారాం కార్యక్రమాన్ని సమన్వయ పరిచారు. ప్రముఖ కవులు దేవిప్రియ, నగ్నముని, శిఖామణి, యాకూబ్, ఆశారాజు, అరుణ్‌సాగర్, వంశీకృష్ణ, ప్రసేన్, ప్రసాదమూర్తి, ఆనందాచారి, సురేంద్రరాజు వాసిరెడ్డినవీన్, రామతీర్థ, వాగ్గేయకారులు గోరటివెంకన్న జయరాజు, చక్రధర్, తులసిప్రసాద్, సైకిబాబా, కొండపల్లి పవన్




మొదలైనవారు పాల్గొని అభినందనలు తెలిపారు.

పాతికవేలు నగదు, జ్ఞాపిక, సన్మాన పత్రం శాలువాలతో శివారెడ్డిని అతిథులు ఘనంగా సన్మానించారు. మువ్వా ఫౌండేషన్, సాహితీస్రవంతి, ఫెమా, రవళి సాహితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

ఈ సాహితీ సభలో మొదట వర్ణలేఖ, చైతన్య, అనిల్‌డ్యాని, నరేష్కుమార్‌ల కవితా సంపుటి "తీరం దాటిన నాలుగు కెరటాలు..." పుస్తకాన్ని దేవిప్రియ, ఆవిష్కరించారు. దీని తొలి ప్రతిని కవులు తమ గురువు సత్యనారాయణరెడ్డికి అందజేశారు. అనంతరం నాగళ్ళ వెంకట దుర్గాప్రసాద్ రచించిన 'స్మృతి' కావ్యాన్ని మాజీ ఎం.పి. సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆవిష్కరించి తొలి ప్రతిని అంబటి మురళీకృష్ణకు అందించారు. మువ్వా శ్రీనివాస రావు రచించిన "సిక్స్ ఎలిమెంట్" కవితా సంపుటిని మాజీమంత్రి తుమ్మలనాగేశ్వరరావు ఆవిష్కరించి, కవి గురువయిన తొటచర్ల వెంకటపూర్ణచంద్రరావుకు అందజేశారు.

ఈ కార్యక్రమంలో పల్లా రాజేశ్వరరెడ్డి, లోకసత్తా నాయకుడు రవిమారుత్, కళాశాలల యాజమాన్య సంఘ నాయకులు వీరారెడ్డి పాల్గొని సందేశాలిచ్చారు.

"ఒక పురస్కారం మూడు పుస్తకాల ఆవిష్కరణ" కార్యక్రమానికి ముందుగా 'టెన్ టివి' వారు అరుణ్ సాగర్ ఆధ్వర్యంలో ప్రసాదమూర్తి, బిక్కికృష్ణలు కలిసి నిర్మించిన శివారెడ్డి కవిత్వం జీవితం గురించిన డాక్యుమెంటరీని ప్రదర్శించారు. అద్భుతంగా తీసిన ఈ డాక్యుమెంటరీ ప్రదర్శనను సభికులు ఎంతో ఆసక్తితో తిలకించారు. ఒక సాహితీ వాతావరణం నెలకొని కవితా ఔత్సాహికులకు నూతన ఉత్తేజాన్ని నింపింది. కేవలం కవితా నిర్మాణమేకాదు, కవితా వాతావరణ నిర్మాణంలోనూ ముందుంటానని తెలిపేందుకు సహమిత్రుల రెండు పుస్తకాలను వెలుగులోకి తేవటం, ఒక సాహితీ ఫౌండేషన్ ఏర్పాటు చేయడం, సాహితీ సభను పౌరసాహితీ సభగా నిర్వహించిన మువ్వా శ్రీనివాసరావు పురజనులు, కవుల అభినందనలు పొందారు.

**- కె.ఆనందాచారి**

## విజయనగరంలో జాషువా వర్ధంతి సభ

విజయనగరం సాహితీస్రవంతి ఆధ్వర్యంలో జూలై 24న గురజాడ స్వగృహంలో గుర్రం జాషువా వర్ధంతి సభ జరిగింది. ఈ సభలో చాగంటి తులసి మాట్లాడుతూ జాషువా అనుభవాలే ఆయన కవితలుగా రాశారని అన్నారు. జాషువా రచనలను ఔత్సాహిక కవులు అధ్యయనం చేయాలని కోరారు. ఎస్. అంబేద్కర్ మాట్లాడుతూ పద్యరూపాన్ని జాషువా ఎన్నుకున్నారని, వినూత్న రీతిలో రాశారని అన్నారు. ప్రణవశ్రీ వేదవల్లి, గండేటి శ్రీనివాసరావు, చంద్రిక, నిర్మల, షణ్ముఖరావు పాటలు వినిపించారు. దాసరి తిరుపతి నాయుడు, తూట బాబాజీ జాషువా పద్యాలు వినిపించారు. ఇనుగంటి జానకి, యుప్పులూరి శైలజ, విజయాదిత్య, మొయిద శ్రీనివాస్, బాలకృష్ణ, యం. చంద్రశేఖర్, పిళ్ళారాంప్రసాద్, చింతా నాగేశ్వర్ తదితరులు కవితలు చదివారు. యస్.వి.ఆర్. కృష్ణారావు స్వాగతం పలికారు. చంద్రిక సభాధ్యక్షత వహించారు. పి.యస్. శ్రీనివాసరావు వందన సమర్పణతో సభ ముగిసింది.




*విజయనగరం సాహితీస్రవంతి ఆధ్వర్యంలో జూలై 24న జరిగిన గుర్రం జాషువా వర్ధంతి సభలో ప్రసంగిస్తున్న ప్రముఖ రచయిత్రి చాగంటి తులసి. చిత్రంలో చంద్రిక*

# డైరీ

## కాలానికి నిలబడిన కవి జాషువా



*సాహితీస్రవంతి హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో జూలై 24న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన 'గుర్రం జాషువా' వర్ధంతి సభలో ప్రసంగిస్తున్న డా॥ శిఖామణి. చిత్రంలో వెంకటి, తంగిరాల చక్రవర్తి, గేరా.*

సాహితి స్రవంతి నగర కమిటీ ఆధ్వర్యంలో జూలై24న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గుర్రం జాషువా వర్ధంతి సభ, జనకవనం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలుగు విశ్వవిద్యాలయం ఆచార్యులు డా. శిఖామణి మాట్లాడుతూ జాషువా అంటరాని వాడిగా ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నాడని, అయినప్పటికీ పట్టుదలగా సాహిత్యకృషి కొనసాగించి, గండ పెండేరం చేజిక్కించుకుని నవయుగ కవి చక్రవర్తిగా కీర్తికెక్కారని అన్నారు. రుక్మిణి కళ్యాణం, ఫిరదౌసి, గబ్బిలం వంటి ఎన్నో కావ్యాలనే కాకుండా, నాటకాలను రచించారని కొనియాడారు. తెలుగు సాహిత్య చరిత్రలో కాలానికి తట్టుకుని నిలిచిన కవి జాషువా అని మరో వక్త, కవి గేరా అన్నారు. ఆయన భాషా సౌందర్యం అద్భుతమని, ఎవరి కోసం రాజీపడకుండా తనకి నచ్చినట్లుగా వర్ణించే సాంప్రదాయ కవి అని ఆయన అన్నారు. సాహితీ స్రవంతి నగర కమిటీ అధ్యక్షులు తంగిరాల చక్రవర్తి సభకు అధ్యక్షత వహించారు. కార్యదర్శి శాంతిశ్రీ, గజవెల్లి దశరథరామయ్య, ఒబ్బిని సన్యాసిరావు, మోపిదేవిరాధాకృష్ణ, ఆచార్యనరేంద్ర, పొత్తూరి సుబ్బారావు, శిష్టామాధవి, జి.ఆంజనేయులు, జి.రామకృష్ణ, కోరుపోటరాధాకృష్ణ, పౌరప్రసాద్, అహవళి హనుమంతరావు, మౌనశ్రీమల్లిక్, పెద్దాలి, వెంకట్‌దాస్, కె.శాంతారావు, కె.ఎల్.కామేశ్వరరావు, లాడే ధనంజయ్, శిల్పాజగదీష్, ప్రభుదాసు, బొపారా, జస్వంతరావు, తదితరులు స్వీయ కవితలు చదివారు.టి.వెంకటి జనకవనం నిర్వహించారు. మోహనకృష్ణ వందన సమర్పణ చేశారు.

## దళిత ఉద్యమ కేతనం గుర్రం జాషువా



*ప్రజాశక్తి బుక్‌హౌస్, ప్రజానాట్యమండలి సంయుక్త ఆధ్వర్యంలో జూలై 24న తిరుపతిలోని గాంధీ ట్రస్టు భవన్‌లో జరిగిన గుర్రం జాషువా వర్ధంతి సభ. చిత్రంలో డా. కొలకలూరి మధుజ్యోతి, డా. వి.ఆర్. రాసాని, ప్రజానాట్యమండలి అధ్యక్షులు భాషా, కార్యదర్శి యాదగిరి, జగన్ తదితరులు*

నిర్భయ, నిష్కలంక సత్యాన్వేషి అగ్రవర్ణ దౌర్జన్యాలపై గళమెత్తిన దళిత ఉద్యమ కేతనం గుర్రం జాషువా అని వక్తలు భావోద్వేగంతో ప్రసంగించారు. గాయపడిన కవులందరూ కావ్యాలు రాస్తే ఎంతటి సాహితీ సంపద సృష్టించబడేదోనని ఆశాభావం వ్యక్తం చేశారు. తిరుపతిలోని గాంధీట్రస్టు భవన్‌లో జూలై24న ప్రజాశక్తి బుక్‌హౌస్, ప్రజానాట్యమండలి సంయుక్త ఆధ్వర్యంలో గుర్రం జాషువా వర్ధంతి సభ జరిగింది. రుయా సూపరింటెండెంట్ డాక్టర్ వీరాస్వామి, డా॥ వి.ఆర్. రాసాని, శ్రీ పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ మధుజ్యోతిలు ప్రసంగించారు. వక్తలు మాట్లాడుతూ ఉదర పోషణార్థం వృత్తులెన్నో చేసినా కావ్యరచనే ఆయన ప్రధాన ప్రవృత్తిగా స్వీకరించారన్నారు. సమాజపు దుష్ట సంప్రదాయాలను, అంటరానితన్నాన్ని దుయ్యబట్టారని గుర్తు చేశారు. సాంఘిక దురాచారాలపై తిరుగుబాటు జెండా ఎగురవేసిన కవి దిగ్గజ, నవయుగ కవితా చక్రవర్తిగా జాషువాను కొనియాడారు. 1971, జూలై 24న జాషువా మృతిచెందారని తెలిపారు. ప్రపంచీకరణ నేపథ్యంలో విలువలు క్షీణించి ప్రతిదీ మార్కెట్లో సరుకుగా మారిందని, దీనిని నివారించాలంటే బలమైన ప్రజాసాంస్కృతిక ఉద్యమం అవసరమన్నారు. అభ్యుదయ మార్గంలో పయనిస్తూ నేడు విజృంభిస్తున్న హీన, క్షీణ, సంస్కృతికి వ్యతిరేకంగా పోరాడటమే ఆ మహనీయులకు మనమిచ్చే అసలైన నివాళని అన్నారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు భాషా, కార్యదర్శి పులిమామిడి యాదగిరి, జిల్లా అధ్యక్షులు ఒ.వెంకటరమణ తదితరులు మాట్లాడారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆర్ఆర్ రెడ్డి, వెంకటరమణ, ప్రజాశక్తి బుక్‌హౌస్ ఇన్‌ఛార్జ్ వెంకటేశం, శ్రీనివాసులు, ప్రజానాట్యమండలి జగన్, నారాయణబాబు, దయాకర్, శ్రీరాములు రవితేజ తదితరులు పాల్గొన్నారు.

# కర్నూల్ చివరి నవాబు గులాం రసూల్ ఖాన్ 174వ వర్ధంతి సభ



కర్నూల్ చివరి నవాబు గులాం రసూల్ ఖాన్ 174వ వర్ధంతి సభ కర్నూల్‌లోని పోదుపు భవన్‌లో జూలై 12న జరిగింది. ఈ సభకు ప్రముఖ సాహిత్య చరిత్రకారుడు వైద్యం వెంకటేశ్వరాచార్యులు అధ్యక్షత వహించారు. తన అధ్యక్షోపన్యాసంలో 1801లోనే స్వాతంత్ర్య పోరాటం ప్రారంభించిన వీరులున్నారని, చరిత్రకారులు ఈ అంశాన్ని విస్మరించటం శోచనీయమన్నారు. దేశం మారుమూలల్లో ఎన్నో స్వాతంత్ర్య పోరాటాలు జరిగాయని అవన్నీ వెలుగులోకి తేవాలన్నారు.

గులాం రసూల్ ఖాన్ పుస్తక రచయిత ఎస్.డి.వీ అజీజ్ మాట్లాడుతూ, చారిత్రకాధారాలను భద్రపరిస్తే చరిత్ర పై రాసే వారికి అనువుగా ఉంటుందన్నారు. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు రఘుబాబు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో ముస్లిం సోదరులు పాల్గొన్నారని, ప్రస్తుత పరిస్థితుల్లో ఆ స్ఫూర్తి ఎంతో అవసరమన్నారు. చరిత్ర పరిశోధకులు డా॥మద్దయ్య మాట్లాడుతూ రసూల్ ఖాన్ విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. ఇనయతుల్లా మాట్లాడుతూ జిల్లాలో ఫాక్షనిస్టులేకాదు స్వాతంత్ర్య వీరులూ ఉన్నారన్నారు. సభలో బీసీ సంఘ నాయకులు శేషఫణి, మహిళా నాయకురాలు జ్యోతి మొదలైనవారు పాల్గొన్నారు.

గులాం రసూల్ ఖాన్ పై తపాలా స్టాంపు తేవటం, నగరం నడిబొడ్డులో ఆయన విగ్రహం పెట్టటం, ఓ స్మారక స్థూపాన్ని ఏర్పాటు చేయాలని సభ ఏకగ్రీవంగా తీర్మానించింది.

– జంధ్యాల రఘుబాబు



అరసం ఆధ్వర్యంలో గుంటూరులో జరిగిన డా॥పరుచూరి రాజారామ్ సాహితీ సత్కార సభలో సాహితీ పురస్కారాన్ని రచయిత్రి శ్రీమతి సి.సుజాత అందజేస్తున్న శ్రీమతి పరుచూరి అజిత. వేదికపై అరసం రాష్ట్ర అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, వల్లూరు శివ ప్రసాద్ ఉన్నారు.



జూలై 6న కాకినాడలో గాంధీభవన్‌లో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో జరిగిన ఎస్.ఆర్. పృధ్వి కవితా సంపుటి 'కీలకం' ఆవిష్కరణ. చిత్రంలో ఎడమ నుండి డా॥ జోన్నల క్రిష్ణబాబు, సోమయాజులు, ఎన్.ఆర్.పృధ్వి, డా॥అద్దేపల్లి, ముమ్మిడి, రామకృష్ణరావు, గనారా



జూలై 14న కాకినాడలోని గాంధీ భవన్‌లో ప్రముఖ కవి విమర్శకుడు మాకినీడిపై 'మల్లె పందిరి' సాహిత్య మాస పత్రికను డా॥ అద్దేపల్లి రామమోహన రావు ఆవిష్కరించిన దృశ్యం. ఎడమ నుండి కలిమిశ్రీ, గనారా, పేరిచర్ల, సీతారామరాజు, అద్దేపల్లి, మాకినీడి, అవధానుల మణిబాబు, తంత్రవహి శ్రీరామ మూర్తి.

# డైరీ




ప్రముఖ కవి డా॥ ఎన్.గోపి రచించిన 'మళ్లీ విత్తనంలోకి' కవితాసంపుటిని హైదరాబాద్‌లోని ఆంధ్ర సారస్వత పరిషత్‌లో ఆవిష్కరిస్తున్న డా॥ సి.నారాయణరెడ్డి. చిత్రంలో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ కార్యదర్శి ముద్దాళి రఘురామ్, నేషనల్ బుక్ ట్రస్ట్ కార్యాధికారి డా॥పత్తిపాక మోహన్, ఉస్మానియా డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ ఆచార్య ఎస్.వి.సత్యనారాయణ, కృతి స్వీకర్త డా॥ఓలేటి పార్వతీశం, కవి గోపి, డా॥ ఎస్.రఘు ఉన్నారు.



అరసం అమరావతి పబ్లికేషన్స్, గుంటూరు ఆధ్వర్యంలో జరిగిన సభలో సముద్రాల రచన పక్షులు-జంతువులు, పెన్సిల్ షేడింగ్ చిత్రాలు పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్. వేదికపై అరసం రాష్ట్ర అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీ నారాయణ, కథానాయిక రచయిత వల్లూరు శివప్రసాద్, ప్రచురణకర్త యం.సౌభాగ్యరావు.



ప్రముఖ రచయిత 'నిర్మల్' రచించిన "అబ్కారి కథలు" గ్రంథాన్ని హైదరాబాదు బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఆవిష్కరిస్తున్న డా॥ఎన్.గోపి. చిత్రంలో వారితో పాటు జూలూరీ గౌరీ శంకర్, సభాధ్యక్షులు మేరెడ్డి యాదగిరిరెడ్డి, రచయిత 'నిర్మల్' ఉన్నారు.



జూలై7న కళా సుబ్బారావు కళావేదిక, హైదరాబాదులో జరిగిన జెవిఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ నిర్వహించిన జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా॥ రావూరి భరద్వాజ 87వ జయంతి వేడుకల కార్యక్రమంలో డా॥ఎ.చక్రపాణి, పి.విజయబాబుల ద్వారా డా॥రావూరి భరద్వాజ సాహితి పురస్కారం అందుకొంటున్న ప్రొ॥ ముదిగొండ శివప్రసాద్. రావూరికోటేశ్వరరావు, డా॥ ఓలేటి పార్వతీశం, గుదిబండ వెంకటరెడ్డి, డా॥ కళాదీక్షితులు.




ఒడిశా రాష్ట్రం, బరంపురంలో జరిగిన సాహితీ సమావేశంలో డా॥ తుర్లపాటి రాజేశ్వరి రచించిన 'వ్యాసవారధి' గ్రంథాన్ని ఆవిష్కరించిన ప్రముఖ కవి కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వేదికపై ఎమ్.జగన్నాథ ఆచారి, రాజానసూరచ్చాయి. యస్.యస్.యస్.యస్.రాజు, జి.ఎస్.ప్రకాశ్, ఎన్.ఎస్.మూర్తి, రచయిత్రి రాజేశ్వరి, పి.సత్యనారాయణ ఉన్నారు.



జూన్ 28న విశాఖ పౌర గ్రంథాలయంలో కవి అడపా రామకృష్ణ రచించిన దీర్ఘకవిత 'వాడిని జయించాలి' పుస్తకావిష్కరణ (ఎడమ, కుడి) ప్రముఖ చిత్రకారులు 'బాలి' గ్రంథకర్త అడపా రామకృష్ణ, సాంఘిక సంక్షేమ అధికారి శ్రీమతి టి.సరోజ, డి.సహదేవరావు, ప్రముఖ కవి అద్దేపల్లి రామమోహనరావు, డి.శ్రీనివాసన్, గోవిందరావు మున్నగువారు.

Printed, Published and owned by **V. Krishnaiah** 1-1-298/4, Street No-1, Ashoknagar, Hyderabad-20,
Printed at Prajashakti Daily Printing Press, 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad,
Published at **Shaitya Prasthanam** 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad-20. **Editor. T. Ravi**



శ్రీ నారా చంద్రబాబు నాయుడు
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

## ప్రాథమిక విద్యాశాఖ, సర్వశిక్షా అభియాన్, AP

విద్య మా హక్కు
సర్వశిక్షా అభియాన్, AP
అందరూ చదవాలి - అందరూ ఎదగాలి



శ్రీ ఘంటా శ్రీనివాసరావు
ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత విద్యాశాఖామాత్యులు

# బాలల భవిత కోసం బాలల ఉచిత, నిర్బంధ విద్యా హక్కు చట్టం - 2009

**6 నుండి 14 సం॥రాల పిల్లలందరు బడిలో చేరి ఉచితంగా చదువుకోవడానికి ఉద్దేశించిన చట్టం ఇది. దీనిని ఆగష్టు 27వ తేదిన పార్లమెంటు ఆమోదించింది. చట్టం ప్రకారం పిల్లలందర్నీ బడిలో చేర్పించి విద్యనేర్పించడం జరుగుతుంది.**






ఆటలలో పాల్గొన్న బడి పిల్లలు



బడిలో బడిఈడు పిల్లలు



ప్రదర్శనలను తిలకిస్తున్న బడి పిల్లలు

**బాలల హక్కుల ఉల్లంఘన నివారణకు సంప్రదించండి**
స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్
**సర్వశిక్షా అభియాన్**
ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్.

మీ సందేహాల నివృత్తికి సంప్రదించండి:
**టోల్‌ఫ్రీ నెం. 18004253525**

## సర్వ శిక్షా అభియాన్, AP ఉద్దేశ్యాలు - లక్ష్యాలు

◆ సార్వత్రిక ఎలిమెంటరీ విద్యా సాధన లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థల సహకారంతో సర్వశిక్షా అభియాన్ ద్వారా అనేక కార్యక్రమాలను చేపడుతోంది. ◆ 6-14 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలందరికీ ఎలిమెంటరీ స్థాయి వరకు నాణ్యతతో కూడిన మెరుగైన విద్యనందించడం సర్వశిక్షా అభియాన్ ముఖ్య ఉద్దేశ్యం. ◆ సర్వశిక్షా అభియాన్ కార్యక్రమాలను స్థానిక అవసరాలకు తగినట్లుగా ప్రజల భాగస్వామ్యంతో రూపొందిస్తారు.

### ఉద్దేశ్యాలు

◆ 6 నుండి 14 సంవత్సరాల వయస్సు కల్గిన బాలబాలికలందరికీ ఉపయోగకరమైన గుణాత్మక, ఎలిమెంటరీ విద్యను అందించడం
◆ పాఠశాల నిర్వహణలో సమాజం చురుగ్గా పాల్గొనడం ద్వారా బాలురు, బాలికల్లో వివక్షతను సామాజిక, ప్రాంతీయ భేదాలను తొలగించడం

### ప్రత్యేక లక్ష్యాలు

◆ బాలలందరు 5 సంవత్సరాల ప్రాథమిక విద్యను పూర్తి చేయడం
◆ 2015 వరకు బాలలందరు 8 సంవత్సరాల ఎలిమెంటరీ విద్యను పూర్తి చేయడం
◆ సంతృప్తికరమైన, గుణాత్మకతతో కూడిన ఎలిమెంటరీ విద్యపై దృష్టిని సారించడం
◆ మెరుగైన జీవనం కోసం విద్యను అందించడంపై దృష్టిని కేంద్రీకరించడం
◆ 2012 వరకు ప్రాథమిక, 2015 వరకు ఎలిమెంటరీ విద్యాస్థాయిల్లో బాలబాలికల మధ్య వివక్షను, సామాజిక వర్గ వ్యత్యాసాలను తొలగించడం

### కార్యక్రమ వివరాలు

◆ ప్రతి ఆవాస ప్రాంతానికి ఒక కిలో మీటరు దూరంలో ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేయడం ◆ప్రతి ప్రాథమిక పాఠశాలలో 30 మంది విద్యార్థులకు ఒకరు చొప్పున కనీసం ఇద్దరు ఉపాధ్యాయులను నియమించడం, ప్రాథమికోన్నత పాఠశాలలో అయితే తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించడం ◆ప్రాథమిక విద్య పూర్తి చేసిన పిల్లలందరికి మూడు కిలో మీటర్ల లోపల ఒక ప్రాథమికోన్నత పాఠశాలను ఏర్పాటు చేయడం ◆ప్రతి ప్రాథమిక పాఠశాలకు కనీసం వరండాతో కూడిన రెండు తరగతి గదులు మరియు ప్రధానోపాధ్యాయుని గది సమకూర్చడం. పిల్లలు ఎక్కువగా ఉన్నట్లయితే ప్రతి ఉపాధ్యాయునికి ఒక తరగతి గదిని ఏర్పాటు చేయడం ◆పాఠశాలలకు మరుగుదొడ్లు, ప్రహారీగోడ, విద్యుత్ వంటి కనీస సదుపాయాలు కల్పించడం ◆ త్రాగునీటి సౌకర్యం కల్పించడం ◆ప్రతి పాఠశాలకు భవన నిర్వహణ రిపేర్ల కొరకు గ్రాంట్ల సౌకర్యం కల్పించడం. మండల రిసోర్సు కేంద్రాలు, పాఠశాల సముదాయాలను ఏర్పరిచి వాటి నిర్వహణకు గ్రాంట్లు సమకూర్చడం ◆బోధనా అభ్యసన సామాగ్రి సమకూర్చుకోవడానికి నూతనంగా ఏర్పరిచిన ప్రాథమిక పాఠశాలలకు ప్రాథమికోన్నత పాఠశాలలకు గ్రాంట్ల సౌకర్యం కల్పించడం ◆ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయి పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరికి ప్రతి సంవత్సరం వృత్యంతర శిక్షణ ఇవ్వడం ◆ ప్రతి సంవత్సరం పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులకు శిక్షణ ఇవ్వడం ◆ప్రత్యేక అవసరాలు గల పిల్లల విద్య కొరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం ◆వివిధ స్థాయిల్లో పరిశోధన మరియు పర్యవేక్షణ ద్వారా కార్యక్రమాన్ని బలోపేతం చేయడం ◆బాలికల విద్య పూర్వ ప్రాథమిక విద్య ఎస్.సి., ఎస్.టి., మైనారిటీ బాలల విద్య, కంప్యూటర్ మరియు పట్టణ ప్రాంత అణగారిన పిల్లల విద్య కొరకు వినూత్న కార్యక్రమాలు చేపట్టడం. వంటి CLIP/CLAPS/LEP/CAL కార్యక్రమాల అమలు ద్వారా గుణాత్మకతను సాధించడం ◆బాలికల విద్యావ్యాప్తి కొరకు ఎలిమెంటరీ స్థాయి బాలికల జాతీయ విద్యా కార్యక్రమాన్ని (NPEGEL) నిర్వహించడం ◆బడి బయట ఉన్న బాలికల కోసం ప్రత్యేకంగా జాతీయ మహిళ అక్షరాస్యత కంటే దిగువన వున్న మండలాల్లో కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు నిర్వహించడం ◆పాఠశాలల్లో చేరిన పిల్లలందరికీ రెండు జతల బట్టలు అందచేయడం ◆ తరగతి స్థాయి లేని విద్యార్థులు, ఆవాస ప్రత్యేక శిక్షణ కేంద్రాల ద్వారా ఆయా తరగతి స్థాయి సాధించేలా చూడడం. ◆ పిల్లల ఆరోగ్య పరిరక్షణకు జవహర్‌బాల ఆరోగ్యరక్ష ◆చిన్నారుల కంటి చూపు కాపాడేందుకు చిన్నారి చూపు వంటి కార్యక్రమాలు అమలు.

SHAITYA PRASTHANAM RNI N0.APTEL/ 2004/18396 Postal Regd. No.H/SD/415/13-15
Date of Positng : 30.07.2014 ▪ Date of Publication: 25.07.2014

# ప్రజాశక్తి బుక్‌హౌస్ తాజా ప్రచురణలు




వెల: రూ. 100/-




వెల: రూ. 25/-




వెల: రూ. 50/-




వెల: రూ. 60/-




వెల: రూ. 40/-




వెల: రూ. 50/-




వెల: రూ. 30/-




వెల: రూ. 50/-




వెల: రూ. 40/-




వెల: రూ. 70/-



## సాహిత్య ప్రస్థానం తెలుగు సాహిత్య మాసపత్రిక

సాహిత్య

ప్రస్థానం



సంవత్సర చందా కేవలం- రూ.120/- మాత్రమే

**తెలుగు సాహిత్య కృషిని ప్రోత్సహించండి! తెలుగు భాషా వికాసానికి మీ వంతు సహకరించండి!**

వివరాలకు: సాహిత్య ప్రస్థానం, ప్లాట్ నెం.21/1, యం.హెచ్. భవన్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర, ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్- 500 020, ఫోన్: 040-27668861, సెల్: 9490099059
Email- ssprasthanam@gmail.com

**www.prasthanam.com**

ప్రస్థానం వెబ్‌సైట్‌ను తప్పక చూడండి!

ప్రత్యేక తగ్గింపు

5 సంవత్సరాల చందా: రూ.600 -100: 500/- మాత్రమే

10 సంవత్సరాల చందా రూ.1200-200 : 1000/- మాత్రమే

అంతేకాదు సుమారు 1000 రూపాయల పాత ప్రస్థానాలు ఉచితం!

ట్రాన్స్‌పోర్టు ఛార్జీలు అదనం

If Un delivered please return to : Prasthanam, C/o M.H.Bhavan, Plot No. 21/1, Azamabad
Near RTC Kalyanamandapam, Hyderabad - 500 020 (A.P), Ph: 040-27660013, Cell: 9490099059
Website : www.psbh.in